


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ | 22-07-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 263 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on

## నీట్ 'లీకేజీ' ఘోర పాపం



**న్యూఢిల్లీ, జూలై 21 (ఎఎంఎస్) :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా స్పందించారు. పేపర్ లీకేజీలకు పాల్పడటం తీవ్రమైన నేరమని, ఘోర పాపమని వ్యాఖ్యానించిన ఆయన.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడటం అందరి జాతీయ బాధ్యత అని స్పష్టం చేశారు. బాధ్యులెవరినీ విడిచిపెట్టేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జరిగిన 'మంగళ్ మిలన్' ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడిన ఈ కీలక అంశాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు.

**పిల్లలను రెచ్చగొట్టవద్దు: ప్రధాని సూచన**

పార్లమెంట్‌లో ఉభయ సభలు సజావుగా సాగేందుకు, నిర్మాణాత్మక చర్చలు జరిగేందుకు విపక్షాలు సహకరించాలని ప్రధాని కోరారు. "రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు ఉండవచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత క్షేమం విషయంలో ప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలి. విద్యార్థులను ఎవరూ రెచ్చగొట్టవద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమే కానీ, తిరిగి సరైన మార్గానికి రావడం అత్యంత కష్టం. వారిని సరైన దారిలో నడిపించే బాధ్యత మనందరిపై ఉంది" అని ప్రధాని ఎంపీలకు హితవు పలికారు.

**దిల్లీలో పెరిగిన రాజకీయ వేడి**

మే నెలలో జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ ఆరోపణలు రావడంతో జూన్‌లో మళ్లీ రీటెస్ట్ నిర్వహించాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి తోడు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలోనూ లోపాలు వెలుగుచూడటం, ఇతర పరీక్షల లీకేజీ వార్తలు కలకలం రేపాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు తేవాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేలాది మంది సీజేపీ శ్రేణులు బారికేడ్లు తోసుకుని పార్లమెంట్ వైపు దూసుకురావడంతో దిల్లీ వీధులు రణరంగాన్ని తలపించాయి. ఈ తీవ్ర నిరసనల నేపథ్యంలోనే ప్రధాని మోదీ స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రధాని నివాసం వద్ద
# కాంగ్రెస్ అగ్రనేతల ధర్నా!

**న్యూఢిల్లీ, జూలై 21 (ఎఎంఎస్) :** దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'నీట్' ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు పోరాటాన్ని ఉధృతం చేశాయి. విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించడం తీవ్ర సంచలనం సృష్టించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్‌లతో పాటు పలువురు సీనియర్ నాయకులు ప్రధాని నివాస ప్రాంగణంలోనే బైఠాయించి ధర్నాకు దిగారు. నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



**కేంద్ర మంత్రి సంప్రదింపులు ఫలించని వేళ..**

కాంగ్రెస్ ముఖ్య నేతల మెరుపు ధర్నాతో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది.



సమాచారం అందుకున్న వెంటనే కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. రాహుల్ గాంధీ, ఖర్గేలతో మాట్లాడి ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ కాంగ్రెస్ నేతలు వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాహుల్, ఖర్గే సహా పలువురు ముఖ్య నాయకులు తమ చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్న రీతిలో నినాదాలు చేశారు. దీంతో ప్రధాని నివాస ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# 'యంగ్ ఇండియా'కు కాంగ్రెస్ అండ



**హైదరాబాద్, జూలై 21 (వుదయం)** దేశంలో యువత భవిష్యత్తు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని నివాసం వద్ద నిర్వహించిన ధర్నాకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన స్పందించారు. దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీలు కొండంత అండగా నిలిచారని ప్రశంసించారు. 'యంగ్ ఇండియా' ఆకాంక్షలకు, యువత సన్మార్గ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

## ఇది కాలం తెచ్చిన కరవు కాదు



- **యూరియా కష్టాలు, కరెంటు కోతలతో కోలుకోలేని దెబ్బ**
- **రైతులు మరణిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు**
- **సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధుతో నాడు అభయం**
- **బాధితులకు బీఆర్ఎస్ తరఫున ఆర్థిక సాయం అందజేత**
- **అన్నదాతలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: కేటీఆర్**

**లక్సెట్టిపేట, జూలై 21 (వుదయం) :** రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనలో అన్నదాతలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సాగునీరు అందక, పంటలు ఎండిపోయి రైతులు చనిపోతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలను ఆయన పరామర్శించి, పార్టీ తరపున వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యూరియా కష్టాలు, కరెంటు కోతలు, సాగునీటి అవస్థలతో రైతులు అల్లాడిపోతున్నారు. కేసీఆర్ పాలనలో నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్, సమయానికి రైతుబంధు సొమ్ము జమ అయ్యేవి. నాడు తెలంగాణ వ్యవసాయ రంగం పంజాబ్‌ను సైతం తలదన్నే రీతిలో రూపుదిద్దుకుంది" అని గుర్తుచేశారు.

కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అసూయతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు నిరంతరం దుష్ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "కాంగ్రెస్ నాయకులు ఒకరోజు నీళ్లు లేవంటారు.. మరుసటి రోజు మరో కథ చెబుతారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ పాలకులు తెచ్చిన కరవు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేవలం రెండు అంశాలే తెలుసని.. ఒకటి 'ఓట్లు', రెండు 'తిట్లు' అని కేటీఆర్ చురకలు అంటించారు. కష్టకాలంలో రైతులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ డ్రోన్ దాడులు!



**జోర్డాన్ :** పశ్చిమాసియాలో ఇరాన్‌అమెరికా మధ్య యుద్ధ జ్వాలలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరు దేశాలు పరస్పరం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతుండటంతో గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని పలు కీలక ప్రాంతాలపై అమెరికా వైమానిక దాడులు జరపగా.. దానికి ప్రతిగా గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, సాంకేతిక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ విరుచుకుపడుతోంది. సోమవారం రాత్రి జోర్డాన్‌లోని సైనిక, పౌర మౌలిక సదుపాయాలతో పాటు కువైట్, బహ్రెయిన్‌లలోని పౌర విమానాశ్రయాలు, విద్యుత్ కేంద్రాలపై ఇరాన్ బలగాలు దాడులకు తెగబడ్డాయి.

## జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ
# ఇళ్ల పేరుతో నాటకాలు



**హైదరాబాద్, జూలై 21 (వుదయం)** రాష్ట్ర ప్రభుత్వం 'క్యూర్' (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పేరుతో ప్రజలకు ఉపశమనం అందించాల్సింది పోయి తీవ్ర వేదన (పెయిన్) మిగులుస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'క్యూర్' విధానంలో ఎటువంటి శాస్త్రీయ బద్ధత లేదని, కేవలం పన్నుల దోపిడీతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆయన ఆరోపించారు. ఎవరితోనూ సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. నివాస సంక్షేమ సంఘాలు (రెసిడెన్షియల్ అసోసియేషన్లు) సైతం ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని గుర్తుచేశారు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోతుండటంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల కేటాయింపుల పేరుతో కొత్త నాటకానికి తెరతీసిందని రామచందర్‌రావు ఆరోపించారు. "ఏడు వేల ఇళ్లకు గాను దాదాపు పదివేల దరఖాస్తులు వస్తాయనే అంచనాతో, ఒక్కో దరఖాస్తుకు రూ.10 వేల చొప్పున వసూలు చేస్తూ ప్రభుత్వం సుమారు రూ.వెయ్యి కోట్ల రాబడి పొందేందుకు కుట్ర చేస్తోంది. వెయ్యి కోట్ల నిధుల కోసం పేద ప్రజల నుంచి రూ.10 వేలు వసూలు చేయడం దారుణం" అని మండిపడ్డారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 'రాజీవ్ స్వగృహ' కింద నిర్మించిన ఇళ్లు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయని, వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 'క్యూర్' చట్టంపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే దాని అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

# 'అన్నింటికీ కోర్టును లాగొద్దు'

- **20 రోజులుగా కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్ష**
- **అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు నై**
- **విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై దాఖలైన పిటిషన్**
- **రణరంగాన్ని తలపించిన జంతర్‌మంతర్ పరిసరాలు**
- **వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై భార్య గీతాంజలి ఆందోళన**

**న్యూఢిల్లీ, జూలై 21 (ఎఎంఎస్) :** దేశంలో విద్యా వ్యవస్థ వైఫల్యాలకు నిరసనగా గత 20 రోజులకు పైగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు దిల్లీ హైకోర్టు అనుమతించింది. ఆయన చేపట్టిన ఆందోళనను, ఆరోగ్య పరిస్థితులను విస్మరించలేమని ఈ సందర్భంగా న్యాయస్థానం అభిప్రాయపడింది.



ప్రస్తుతం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను గుర్గావ్‌లోని మేదాంత ఆసుపత్రికి తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టు నిర్ణయం పట్ల ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో హర్షం వ్యక్తం చేశారు. దీక్ష కారణంగా వాంగ్‌చుక్ ఆరోగ్యం తీవ్రంగా క్షీణించే ప్రమాదం ఉన్నందున ఆయనను తక్షణమే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఆదేశాలివ్వాలని గీతాంజలి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. వాంగ్‌చుక్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించేందుకు ఉన్న అభ్యంతరాలేమిటని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై స్పందించిన ఎస్‌జీ.. ఆయనను మేదాంతకు తరలించడంపై కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టుకు తెలిపారు.

**'అన్ని విషయాల్లోకీ కోర్టును లాగొద్దు'**

మరోవైపు, ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారంటూ దాఖలైన మరొక పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు దిల్లీ హైకోర్టు నిరాకరించింది. "ఇలాంటి అన్ని విషయాల్లోకి న్యాయస్థానాలను లాగడం సరైంది కాదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై జులై 22న విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, సోమవారం జంతర్‌మంతర్ వద్ద చోటుచేసుకున్న ఘర్షణల్లో మొత్తం 178 మంది గాయపడినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. బాధితుల్లో 118 మంది పోలీసు సిబ్బంది, 60 మంది నిరసనకారులు ఉన్నారని అధికారులు తెలిపారు.





## మహీంద్రా కంపెనీ సహకారంతో పాఠశాల సుందరీకరణ పనుల ప్రారంభం

**కోహీర్, జూలై 21(వుదయం ప్రతినిధి):** కోహీర్ మండలంబిలాల్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రముఖ మహీంద్రా కంపెనీ సౌజన్యంతో ఈ సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి.పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు భవన మరమ్మతులు పెయింటింగ్ పనులను పాఠశాల ప్రాంగణంలో చేపట్టనున్నారు.మహీంద్రా కంపెనీ యాజమాన్య బృందం పాఠశాలను సందర్శించింది.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.సుచరితతో కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు.పాఠశాలకు అవసరమైన వసతులు మరియు ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ స్వర్ణలత అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ స్వర్ణలత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థినులను సందర్భంగా రు అనంతరం విద్యార్థినులతో కలిసి సర్పంచ్ మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.అందరితో కలిసి సర్పంచ్ సహపంక్తి భోజనం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు.పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన మహీంద్రా కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.సుందరీకరణ పనుల ద్వారా విద్యార్థులకు మెరుగైన చదువు వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా కంపెనీ యాజమాన్య బృందం సభ్యులు ,ఉపాధ్యాయుల బృందం తో పాటు స్థానిక ప్రతినిధులు పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# చట్టం కళ్లుగప్పి.. సర్కారు భూమి స్వాహా!

- మల్లకల్‌లో విచ్చలవిడిగా భూబకాసురుల విలయతాండవం
- రెవెన్యూ నాసిక కిందనే డ్రైనేజీలు ఖతం.. కాలువలపై రేకుల సామ్రాజ్యాలు!
- 'అధికారుల' ముసుగులో అద్దె దందా.. ప్రజా ప్రయోజనాలకు పాతర!

**మల్లకల్ జూలై 21 (వుదయం బ్యూరో)**

చట్టం తన పని తాను చేసుకుపోతుందనే ధీమా ఆక్రమణదారుల ముందు మోకరిల్లుతోంది! ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంటే, భూబకాసురులు చెలరేగిపోతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్లకల్ మండల కేంద్రంలో కబ్జాదారుల బరితెగింపు పరాకాష్టకు చేరింది. సాక్షాత్తూ మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే, ప్రభుత్వ స్థలాలను, ప్రజా రక్షణార్థం నిర్మించిన డ్రైనేజీలను యథేచ్ఛగా మింగేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా అక్రమ నిర్మాణాలతో రేకుల సామ్రాజ్యాలు స్థాపిస్తున్నా అధికారుల అచేతనత్వంపై స్థానికులు తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తం చేస్తున్నారు.

**కాలువల గల్లంతు.. ప్రజలకు ముదురు శాపం!**

ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీలే ఆక్రమార్కులకు కామధేనువుగా మారాయి. పారుతున్న కాలువలపై దర్జాగా బండలు పరిచి, మట్టితో కప్పి వేసి రాత్రికి రాత్రే పెద్ద షెడ్లు లేపేస్తున్నారు. నిలిచిన నీరు - ముంచుకొస్తున్న ముప్పు: డ్రైనేజీలను పూర్తిగా మూసివేయడంతో మురుగునీటి సాఫీగా స్తంభించిపోయింది. స్వల్ప వర్షానికే రహదారులు జలమయమై తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మృత్యుకుహరంగా రహదారి: ఆక్రమణల వల్ల రోడ్డు ఇరుకుగా మారి పాదచారులు, వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

**సర్కారు భూమిపైనే 'కాసుల' దందా!**

ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు కొందరు స్వార్థపరుల వ్యక్తిగత 'కాసుల పంట'కు వేదికలుగా మారాయి. ఆక్రమించిన డ్రైనేజీలపై నిర్మించిన షెడ్లలో కొందరు వ్యాపారాలు సాగిస్తుండగా, మరికొందరు ఏకంగా వాటిని ఇతరులకు అద్దెలకు ఇస్తూ నెలకు వేలాది రూపాయలు అక్రమంగా దండుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తిని సొంత ఆస్తిగా మార్చుకుని జేబులు నింపుకుంటున్న ఈ 'అద్దె దందా' వెనుక పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.



**అధికారుల పేర్లతో బురిడీ!**

కబ్జాదారుల తెగింపు ఏ స్థాయికి చేరిందంటే.. తమ ఆక్రమణలకు అధికారుల పేర్లనే అడ్డుగా పెట్టుకుంటున్నారు! స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల 'పూర్తి అనుమతులు' తమకున్నాయని ప్రచారం చేసుకుంటూ, నిబంధనలను బొందపెట్టి వ్యాపారాలు నడుపుతున్నారు.

**క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం!**

నా అనుమతి లేకుండా, నా పేరు వాడుకుంటూ ఎవరైనా ప్రభుత్వ స్థలాలను, డ్రైనేజీలను ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. అక్రమ నిర్మాణ దారులకు తక్షణమే నోటీసులు జారీ చేస్తాం. చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడానికి వెనుకాడం."

గ్రామ కార్యదర్శి మల్లకల్

**స్థానికుల అల్టిమేటం: 'ఉమ్మడి సర్వే' జరగాల్సిందే!**

మండల కేంద్రంలో పాతుకుపోయిన ఈ కబ్జా పర్వానికి చరమగీతం పాడాలని స్థానికులు ఖరాకండిగా తేల్చిచెబుతున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు వెంటనే సంయుక్తంగా వీధి ఉమ్మడిగా 'ప్రత్యేక సర్వే' నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న ఆక్రమణ నిర్మాణాలను తొలగించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



## ప్రకృతిని ప్రేమిద్దాం వృక్ష సంపదను కాపాడుకుందాం

- "సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్ "
- "మనియార్ పల్లి గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమం

**కోహీర్ జూలై 21 (వుదయం ప్రతినిధి):** కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామంలో మంగళవారం నాడు వన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్ మాట్లాడుతూ....ప్రకృతిని ప్రేమించడం మరియు మనోహరమైన వృక్ష సంపదను కాపాడుకోవడం ప్రతి పౌరుడి తక్షణ కర్తవ్యమని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి కనీసం మూడు మొక్కలైనా నాటాలని కోరారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించడం అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ఇటువంటి వనమహోత్సవాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. గ్రామ వీధుల్లో మరియు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి, పరిసరాలను పచ్చదనంతో నింపుకోవాలని గ్రామస్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. పచ్చని మనియార్ పల్లి గ్రామే తమ ప్రధాన లక్ష్యమని, మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ రాజ్ కుమార్ వెల్లడించారు.

## ఎల్ ని నో వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**నారాయణపేట టౌన్, జూలై 21(వుదయం ప్రతినిధి):**



నారాయణ పేట జిల్లా వ్యాప్తంగా ఎల్ నినో వల్ల రైతులు సరి అయిన సమయంలో వర్షాలు రాక పత్తి, ఆముదం, కంది,పెసర విత్తనాలు మొలువక చాలా నష్టపోయారని తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సామజిక కార్యకర్త హెచ్. నర్సింహా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఖరీఫ్ లో వర్షాలు కురవకపోవడం వలన ఒక్కొక్క రైతు రెండు, మూడు సార్లు పత్తి, కంది, పెసర, ఆముదం విత్తనాలు నాటి సుమారు ఎకరాకు 15000 నష్టపోయారని తెలిపారు. మొలకలు సరిగ్గా మొలవక పోవడం వలన గత రెండు రోజుల క్రితం కురిసిన వానలకు జిల్లాలో చాలా గ్రామాలలో పంటలు చెడిపి ఆముదలు, పత్తి పెట్టినట్లు తెలిపారు .ధన్వాడ మండలం కంసాన్ పల్లి రైతు మరాఠి నర్సిములు 5 ఎకరాలు మొదట పత్తి పెడితే సరిగ్గా మొలవకపోవడం వలన చెడిపి నిన్న ఆముదలు పెట్టినట్లు చెప్పారని తెలిపారు. ఈ రైతుకు 45000 వేలు నష్టం వచ్చిందని అన్నారు. అదే గ్రామానికి చెందిన మరొక రైతు వెంకటయ్య 5 ఎకరాలలో పత్తి వేసి సరిగా మొలవక పోవడం వలన మొత్తం చెడిపి మళ్ళీ పత్తి విత్తనాలు పెట్టడం వలన 60000 నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పేట జిల్లాలోని రైతులు అందరికీ ఉంది కావున వ్యవసాయ అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి రైతులను ఆదుకోవడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సంవత్సరం పంట పొలాలు చూస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు కావున తెలంగాణ ప్రభుత్వం పేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొనుటకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆటో టాప్ ప్రయాణం..బాలుడికి నూరేళ్లు నింపింది!

- ఒక్క బ్రేక్.. ఎంత ఘోరం చేసెను!
- ఘటనా స్థలంలోనే బాలుడి దుర్మరణం

**మల్దకల్, జూలై 21 (వుదయం బ్యూరో):**



అది ప్రయాణం కాదు.. మృత్యువుతో సాగించిన సరసమని తెలిసేలోపే ఆ బాలుడి నూరేళ్లూ నిండిపోయాయి. ఆటో పైన కూర్చొని ప్రయాణిస్తున్న బాలుడు, డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాల్వాయి గ్రామం నుంచి మల్దకల్ పశువుల సంతకు వెళ్తున్న ఆటోపై అదే గ్రామానికి చెందిన రంగముని అనే బాలుడు కూర్చున్నాడు. పెద్దపల్లి వద్దకు రాగానే డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బాలుడు కిందపడి తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మల్దకల్ ఎస్ఐ శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని గద్వాల ఆసుపత్రికి తరలించారు. కంటికి రెప్పలా చూసుకుంటున్న కుమారుడు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లడంతో కన్నవారి రోదనలు మిన్నంటాయి.



## రక్తం ఏరై పారుతుంటే ఏసీ గదుల్లో సమీక్షలా?

- కాగితాల్లో కాదు.. రోడ్లపైన కనిపించాలి భద్రత!
- హైవే ఆక్రమణలపై 'నోటీసుల' వేటు.. జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం!

**గద్వాల, జూలై 21 (వుదయం బ్యూరో):**

జాతీయ రహదారులు రక్సిక్తంగా మారి, అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా ప్రభుత్వ అధికారుల్లో ఏమాత్రం చలనం రాకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మంగళవారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ క్షేత్రస్థాయి అధికారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రహదారి భద్రత అనేది కేవలం కాగితాలకే, ఏసీ గదుల సమీక్షలకే పరిమితమవుతోందని కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఉపేక్షించేది లేదని, రహదారులపై ఉన్న ఆక్రమణలను తక్షణమే, నిర్దాక్షిణ్యంగా తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**కలెక్టర్ హెచ్చరిక:**

"హైవేల పక్కన వెలసిన అక్రమ డాబాలు, ప్రమాదకరమైన బ్లాక్‌స్పాట్ల వద్ద భద్రతా లోపాలే అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. రహదారి భద్రతపై స్పష్టమైన, సమగ్రమైన కార్యాచరణ నివేదికను వెంటనే సమర్పించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవు

# బడులకు 'డుమ్మా'.. భవిష్యత్తుకు 'మచ్చ'!

- బోధన పక్కనబెట్టి.. 'సంఘాల' పనుల్లో ఉపాధ్యాయులు!
- ఎంఈఓ ఆఫీసులు, వ్యక్తిగత వ్యాపకాలతో కాలక్షేపం
- సర్కారు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు డిమాండ్

**గట్టు జూలై 21 (వుదయం బ్యూరో)**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను బలోపేతం చేయాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరి తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం పేద విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా మారుతోంది. పవిత్రమైన విధి నిర్వహణ సమయాన్ని పక్కనబెట్టి.. ఎంఈఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఉపాధ్యాయ సంఘాల పనులు, వ్యక్తిగత వ్యాపకాల పేరుతో పాఠశాలలకు డుమ్మా కొడుతున్న ఉదంతాలు విద్యాశాఖ పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఈ నిర్లక్ష్య వైఖరిపై ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఉపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి, తెలంగాణ ప్రభుత్వ సేవా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గట్టు మండల ఎంఈఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ హుస్సేన్ పాషా, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేష్‌లకు పిడిఎస్ యు నాయకులు వినతిపత్రం సమర్పించారు.

**పిడిఎస్ యు ముఖ్య డిమాండ్లు:**

ఆకస్మిక తనిఖీలు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కఠిన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. శాఖాపర మైన చర్యలు: ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే లేదా విధి సమయాల్లో ఇతర పనుల కోసం తిరిగే ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. సమయపాలన పునరుద్ధరణ: పాఠశాలల్లో రోజువారీ బోధన నిబంధనల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకుని, ఉపాధ్యాయుల్లో బాధ్యతాయుత ప్రవర్తనను కట్టుదిట్టం చేయాలి.

**అధికారుల హామీ:**

పిడిఎస్ యు వినతిపై స్పందించిన ఎంఈఓ కార్యాలయ సిబ్బంది.. ఈ తీవ్రమైన అంశాన్ని తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలింపాషా, ప్రతినిధులు చిరంజీవి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ జన జాగరణ యాత్ర

**సంగారెడ్డి, వుదయం:**

సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఉద్యోగుల సంఘం చేపట్టిన జన జాగరణ యాత్ర సంగారెడ్డికి చేరుకుంది.

ఈ సందర్భంగా సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామచందర్ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా ఈ నెల 23న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## గద్వాలలో 'గురు పరంపర' మహోత్సవం!

- 24న బీడీ కాలనీ శ్రీ గురు రామలింగేశ్వర స్వామి 195వ ఆరాధనోత్సవాలు
- ఆధ్యాత్మిక వైభవానికి వేళాయె.. మహా అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి

**గద్వాల, జూలై 21 (వుదయం బ్యూరో):**

తరతరాల నాటి గురు పరంపరకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన గద్వాల పట్టణం మరో చారిత్రక ఆధ్యాత్మిక ఘట్టానికి వేదికవుతోంది. బీడీ కాలనీలో వేంచేసిన శ్రీ గురు రామలింగేశ్వర స్వామివారి 195వ ఆరాధనోత్సవాలు ఈ నెల 24న (శుక్రవారం) అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.ముఖ్య ఘట్టాలు: మహాయజ్ఞం (ఉదయం 8:00), గురుపూజ (ఉదయం 10:00), దివ్య ప్రవచనం (మధ్యాహ్నం 12:00), మహా అన్నసంతర్పణ (మధ్యాహ్నం 1:00).ప్రత్యేకత: లోకకళ్యాణార్థం నిర్వహించే మహాయజ్ఞంలో పాల్గొనే భక్తులకు ప్రత్యేక క్యాలెండర్లు, తీర్థప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆహ్వానం: గద్వాల ప్రజలతో పాటు ఆయకట్టు గ్రామాల భక్తజనమంతా ఈ దివ్య మహోత్సవంలో భాగస్వాములై స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు తీసుకోవాలి

- సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సమీక్ష
- సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్, జూలై 21 (వుదయం బ్యూరో):**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం, సుప్రీంకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలను ప్రతి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా రాష్ట్ర రోడ్లు, రవాణా మరియు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల కలెక్టర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు, రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలను ప్రతి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని స్పష్టం చేశారు.

ప్రమాదాలు ఎక్కడ, ఏ కారణాలతో జరుగుతున్నాయనే అంశాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తున్న జిల్లా రోడ్డు భద్రత కమిటీ మరింత పటిష్టంగా పనిచేసేలా చూడాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని,



వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచించిన అన్ని మార్గదర్శకాలను జిల్లాలో కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

ఇందులో భాగంగా జిల్లా అధికారులతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలోని జాతీయ రహదారుల పరిస్థితి, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలు, హైవేలపై ఉన్న ధాబాలు, హోటళ్ల అనుమతులు, రహదారి భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, అంబులెన్స్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతకు సంబంధించిన సుప్రీంకోర్టు ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడికి సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవిన్యూ చెన్నయ్య, ఆర్టీవో ఇమ్రాన్ అహ్మద్, ఇతర రవాణా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



- శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పోచయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

**దౌల్తాబాద్, జూలై 21 (వుదయం):**

బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి చింతకింది మహేశ్ మాతృమూర్తి చింతకింది యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం రాయపోల్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యాదమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచిస్తూ, యాదమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మి భర్త ఇప్ప పోచయ్య శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పోచయ్య ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ హనుమంతు రాజు, వార్డు సభ్యుడు పరశురాములు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, దయాకర్ రెడ్డి, జీవన్ రెడ్డి, రాజు గౌడ్, నవీన్ గౌడ్, మంజూరు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు గుంతలమయమైన కోహిర్ మండల రహదారులు

- "నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు"

**కోహిర్, జూలై 21(వుదయం ప్రతినిధి ):**

కోహిర్ మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని, గుంతలమయంగా మారడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది.

రహదారులపై పెద్ద ఎత్తున గోతులు ఏర్పడి, వర్షపు నీరు నిలిచిపోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రోజూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించే రైతులు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారు.అత్యవసర వైద్య సేవల కోసం మండల కేంద్రానికి లేదా ఆసుపత్రులకు వెళ్లాలన్నా అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు సకాలంలో



చేరుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ మార్గాల్లో రహదారులు దెబ్బతిని ప్రయాణానికి వీలులేకుండా తయారవ్వడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురై యజమానులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోంది.చీకటి పడితే ఈ రోడ్లపై ప్రయాణించడం మరీ ప్రమాదకరంగా మారుతోందని, కాలినడకన వెళ్లే గ్రామస్తులు సైతం బురదలో జారిపడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా అనేకమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా తాత్కాలిక పనులు తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.ప్రతి ఏటా వర్షాకాలం రాగానే పరిస్థితి మ( )త దిగజారుతోందని, ఏళ్ల తరబడి సమస్య తీరకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, ఆర్థిక రవాణాకు రోడ్డు సదుపాయం అత్యంత కీలకమని, అధికారులు ఇప్పటికైనా బాధ్యతాయుతంగా స్పందించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, ప్రమాదకరంగా మారిన ఈ రహదారులకు శాశ్వత మరమ్మతులు లేదా కొత్త రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.గ్రామీణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోహిర్ మండల పరిధిలోని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సంక్షేమ హాస్టళ్లలోని మౌలిక సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డీవో కు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

**నాగర్‌కర్నూల్, జూలై 21 (వుదయం బ్యూరో):**

నాగర్‌కర్నూల్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) ఆధ్వర్యంలో డివిజనల్ రెవెన్యూ అధికారి అర్చన రెడ్డికి వినతిపత్రం అందజేశారు.గత నెల రోజులుగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పొదిల రామయ్య తెలిపారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...**



నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో బాటనీ, తెలుగు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అదనంగా విద్యార్థులు చదువుకోవడానికి 3 ప్రత్యేక గదులు, అటెండర్, స్కావెంజర్ అవసరం ఉందన్నారు.బాలికల ప్రభుత్వ పాఠశాలలో వర్షాకాలంలో గదుల పెచ్చులు ఊడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులకు కేవలం 4 గదులు మాత్రమే ఉండటంతో తరగతులు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న అన్నం, కూరగాయలు నాణ్యత లేకుండా ఉన్నాయని, ఉడకని కూరలు, నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారని ఆరోపించారు. గౌతంపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పై సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మధు, కేతపల్లి సత్యనారాయణ, మల్లికార్జున్, కురుమయ్య, కాశన్న లు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజలకే టీఆర్‌టీ కమ్యూనిటీ హాల్



**- జోనల్ కమిషనర్ పరిశీలన**
**– ప్రజల వినియోగానికే హాల్: మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**

ముషీరాబాద్, జూలై 20 (వుదయం)

టీఆర్‌టీ కమ్యూనిటీ హాల్‌ను ప్రజల అవసరాలకే వినియోగించనున్నట్లు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ మంగతాయారు స్పష్టం చేశారు. అన్ని పార్టీల ప్రతినిధులు, కాలనీ వాసులతో కలిసి కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన ఆమె, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు భవనాన్ని ప్రజల అవసరాలు, శుభకార్యాల నిర్వహణకు మాత్రమే కేటాయిస్తామని వెల్లడించారు.
టీఆర్‌టీ కమ్యూనిటీ హాల్ అంశంపై ప్రజలు చేపట్టిన నిరసనలు, ఆందోళనల ఫలితంగా కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుల చొరవతో సమస్యకు పరిష్కారం లభించిందని గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి సానుకూల నిర్ణయం తీసుకున్న జోనల్ కమిషనర్ మంగతాయారు, డిప్యూటీ కమిషనర్ పుష్పలతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా కాలనీ వాసులు జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, సాయిగౌడ్, శ్యామ్, కాంగ్రెస్ నాయకులు మధుమతి, బాబ్జీ, అభిషేక్ కెనడి, బీఆర్ఎస్ నాయకులు రాకేష్, శ్రీకాంత్, స్థానికులు చిట్టి, ఉమేష్, పవన్, మురళి, యేళ్లప్ప, సాంసన్, మణి తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్, మండల అధ్యక్షులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల, జూలై21(వుదయం)

చేవెళ్ల మున్సిపాల్టీ కాంగ్రెస్ పార్టీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పని గిరిధర్ రెడ్డిలను ఎమ్మెల్యే కాలె యాదయ్య మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీ అధిష్ఠానం నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.నూతన మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి,ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్, మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా జి డబ్ల్యూ ఎస్ ది ఫస్ట్ చాప్టర్ నిర్వహణ




బాచుపల్లి, జులై 21,(వుదయం ప్రతినిధి ),

గౌతమ్ వరల్డ్ స్కూల్, నిజాంపేట్‌లో జి డబ్ల్యూ ఎస్- ది ఫస్ట్ చాప్టర్" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్వెస్టిచర్ సెరిమనీ, వివిధ పోటీలలో విజేతల సన్మాన కార్యక్రమం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి గౌతమ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీన్ పద్మలత, గౌతమ్ వరల్డ్ స్కూల్, సరూర్‌నగర్ శాఖ ప్రిన్సిపల్ ప్రత్యూష, విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు బ్యాడ్జీలు ప్రదానం చేసి నాయకత్వ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీకాంత్ మాట్లాడుతూ నాయకత్వం అంటే అధికారం కాదు, బాధ్యత అని, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుండి నడిపించే వారే నిజమైన నాయకులని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.ప్రిన్సిపల్ రవి పరిపల్లి మాట్లాడుతూ ప్రతి గొప్ప ప్రయాణం ఒక తొలి అధ్యాయం తోనే ప్రారంభమం ఆవుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభమైన తొలి నెలలోనే విద్యార్థులు సాధించిన విజయాలను గుర్తించి ప్రోత్సహించడానికే జి డబ్ల్యూ ఎస్- ది ఫస్ట్ చాప్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, నాయకత్వం, క్రమశిక్షణ వంటి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి సత్కరించారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు ఎంతో అభినందిస్తూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి గౌతమ్ వరల్డ్ స్కూల్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ప్రశంసించారు.

## అన్నారం 261 భూ వ్యవహారంలో మరో సంచలన మలుపు



**- కలెక్టర్‌ను ఆశ్రయించిన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గం**
**- భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

గుమ్మడిదల, జూలై 21 (వుదయం):

గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామ సర్వే నంబర్ 261 భూ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఇప్పటికే ఈ అంశంపై 13 మంది కౌన్సిలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, తాజాగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులంతా జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.సర్వే నంబర్ 261లో భూ అక్రమాలు, కబ్జాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారం ఇప్పటికే స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, పాలకవర్గం మొత్తం ఒకే వేదికపైకి వచ్చి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిష్పక్షపాత విచారణ ద్వారా నిజానిజాలను బయటపెట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి



**: కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, జులై 21,(వుదయం ప్రతినిధి )

,కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 273వ డివిజన్ బాచుపల్లి పరిధిలోని పంచవతి కాలనీలో నూతన డ్రైనేజీ లైన్‌ను పనులను కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ఈ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి, కొలన్రా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి జశేఖర్ రెడ్డి, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షుడు మురళి, బాచుపల్లి డివిజన్ అధ్యక్షుడు కొలన్ జీవన్ రెడ్డి, బాల్ రెడ్డి, రాజి రెడ్డి, శ్రీనివాస్ రావు, వేణుగోపాల్ రెడ్డి,సునీల్ కుమార్, పూర్ణ ప్రసాద్, కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై బీఎల్ఏ సూపర్వైజర్లతో సమీక్ష




అమీనాపూర్ జులై 21, (వుదయం )

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఏ సూపర్వైజర్లతో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కోఆర్డినేటర్లు నాగరిగారి ప్రీతం, గూడూరు శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ చేపడుతున్న ఎన్యూమరేషన్, ఫారమ్‌ల నింపుదల, ఓటర్ల వివరాల సేకరణ, ఇతర కార్యాచరణల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ స్థాయిలో సూపర్వైజర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఏ సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

## కాలయముడిలా.. గద్వాల బీసీ హాస్టల్!



**ఎప్పుడు ఏ ప్రాణం పోతుందోనని కలవరం**
**శిథిల గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు**
**చలనం లేని సంక్షేమ శాఖ అధికారులు**
**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉధృత ధర్నా**

గద్వాల జూలై 21 (వుదయం బ్యూరో)

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయి. గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం భవనం పూర్తిగా దెబ్బతిని భయానక వాతావరణాన్ని తలపిస్తోంది. గోడలు పగిలి, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల తీరుపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం హాస్టల్ ముట్టడి ధర్నా నిర్వహించారు.
విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగులు నింపాల్సిన వసతి గృహాలు.. వారి ప్రాణాల మీదికి తెస్తున్నాయి. అధికారులకు స్పందన లేకపోవడం దారుణం. భరత్ & ప్రవీణ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులుదారుణ పరిస్థితికి ఇవే నిదర్శనాలు:ప్రాణాపాయం: పైకప్పు నుంచి రాలిపడే పెంకులతో విద్యార్థులకు నిత్యం గాయాలవుతున్నాయనే ఆందోళన. ఇరుకు గదులు: సరిపడా గదులు లేక చిన్న స్థలంలోనే ఎక్కువ మంది సర్దుకోవాల్సిన దుస్థితి. సౌకర్యాలు శూన్యం: నాణ్యమైన ఆహారం అందడం లేదు; స్నానపు గదులు, తాగునీటి వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. తక్షణమే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున కలెక్టరేట్ దిగ్బంధం చేస్తామని ఏఐఎస్ఎఫ్ హెచ్చరించింది.

## చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ నూతన అధ్యక్షులకు ఘన సత్కారం



**- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ పిలుపు**

చేవెళ్ల ,జూలై21(వుదయం)

చేవెళ్ల నియోజకవర్గంలోని నూతనంగా నియమితులైన మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అలాగే రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భీమ్ భరత్ నూతన అభ్యర్థి లను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ చేయాలని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ రామ్ చంద్రయ్య, జిల్లా సెక్రటరీలు బర్ల యాదయ్య, శ్రీకాంత్ రెడ్డి, మాణిక్యం, షాబాద్ మండల అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి,మొయినాబాద్ మండల అధ్యక్షుడు బి. సత్యనారాయణ, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మనయ్య, కేబుల్ రాజు, కంజర్ల భాస్కర్, సురంగల్ కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్, జులై 21,(వుదయం ప్రతినిధి ),

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్గే కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలి దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండి శామ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ ఇన్‌చార్జి కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొలన్ జీవన్ రెడ్డి, వరుగాని వాసు, మురళి, మైసిగారి శ్రీనివాస్, రాజి రెడ్డి, బంటు నరేష్, బాల్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వుదయం' దెబ్బ.. అధికారుల్లో గుబులు!

**— బిజ్వారం ముఖద్వారాన పాత బోర్డు ఊడకోత.. కొత్తది ప్రత్యక్షం!**
**— ఏళ్లనాటి నిర్లక్ష్యానికి చరమగీతం.. ఆర్అండ్‌బీకి దారికొచ్చిన జ్ఞానోదయం**
**— చీకట్లో చిక్కుకున్న ప్రయాణికులకు విముక్తి.. 'వుదయం' ధీరత్వానికి జనం నీరాజనాలు**

మల్దకల్, జూలై 21 (వుదయం బ్యూరో)

అధికారుల నిద్రమత్తు వదిలించాలన్నా, ఏళ్లనాటి నిర్లక్ష్యాన్ని బద్దలు కొట్టాలన్నా పత్రికా స్వేచ్ఛకు ఉన్న పవర్ ఏంటో 'వుదయం' మరోసారి నిరూపించింది! జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామ ముఖద్వారం వద్ద దశాబ్దాలుగా మురికిపట్టి, నామరూపాల్లేకుండా పోయిన దిశానిర్దేశక బోర్డును చూసీచూడనట్లు వదిలేసిన ఆర్అండ్‌బీ (R&B) యంత్రాంగానికి 'వుదయం' ప్రచురించిన కథనం వాతపెట్టింది. పత్రికలో కథనం వచ్చిన మరుక్షణమే నిద్రలేచిన అధికారులు పరుగులు తీస్తూ వచ్చి, పాత ఇనుప చెత్తను ఊడబీకి కొత్త బోర్డును పాతేశారు!చీకట్లో చుక్కలు చూసిన ప్రయాణికులు!బోర్డుపై అక్షరాలు తుడిచిపెట్టుకుపోవడంతో అసలు ఆ గ్రామం ఉందో లేదో తెలియక ప్రయాణికులు దారి తెలవక నడిరోడ్డుపై నరకం చూశారు. పగటిపూటే గందరగోళం నెలకొంటే, ఇక రాత్రి వేళల్లో అపరిచితులు, వాహనదారులు పడిన అవస్థలు వర్ణనాతీతం. ఆఖరికి ఆపదలో వచ్చే అంబులెన్సులు, అత్యవసర సేవల సిబ్బంది కూడా ఊరు చిరునామా దొరక్క అల్లాడిపోయారు. ప్రజాసమస్యలపై అధికారులు చూపుతున్న ఈ ఘోర అలసత్వాన్ని ఎండగడుతూ 'బోర్డుకే దిక్కు లేదు... ఇక బిజ్వారాన్ని పట్టించుకు నేదెవరు?' అంటూ 'వుదయం' విసిరిన ఘాటు ప్రశ్నకు అధికార వర్గాల్లో సీటు కింద మంట పుట్టింది. పరుగులు తీసిన ఆర్అండ్‌బీ యంత్రాంగం! పత్రికలో ప్రచురితమైన కథనం నెట్టింట, అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపడంతో ఆర్అండ్‌బీ అధికారులు హుటాహుటిన బిజ్వారం ముఖద్వారానికి చేరుకున్నారు. ఏళ్ల తరబడి పట్టింపేలేని పాత ఐరన్ తుప్పు బోర్డును కనీసం ఆలస్యం చేయకుండా పీకి పందెంకోడిలా పారేశారు. దాని స్థానంలో రాత్రివేళల్లో సైతం కళ్లారా స్పష్టంగా కనిపించే నూతన రేడియం సూచిక బోర్డును శరవేగంతో అమర్చారు. దీంతో ప్రయాణికులు, వాహనదారుల ఏళ్లనాటి నరకయాతనకు ఒక్క దెబ్బతో తెరపడింది. అధికారుల నిర్లక్ష్యపు నిద్రను వదిలించి, సమస్యను చిటికెలో పరిష్కరించేలా చేసిన 'వుదయం' పత్రిక పదునైన వైఖరిపై బిజ్వారం ప్రజలు, ప్రయాణికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం కళ్ళు తెరిచి అన్ని సమస్యలపైనా ఇదే రీతిలో విరుచుకు పడాలని హెచ్చరిస్తున్నారు!"


**IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE, City Civil Court, AT: Hyderabad.**
**O.S.No. 1877 of 2026**

BETWEEN:
1. Bannala Dana Laxmi,
2. Bannala Laxmiprasanna,
3. Bannala Prashanth,
4. Bannala Shiva Kumar

........ Plaintiffs

**A N D**

1. The Thahsildar, Mandal Revenue Office, Asifnagar Mandal,
2. All Concerned.

............Defendants

**N O T I C E**

To,
**All Concerned**

The above Suit is filed for declaration of legal heirs, i.e., plaintiff No. 1 as wife and Plaintiff No.2 as daughter and Plaintiffs No.s 3 & 4 are the Sons as of the deceased namely Bannala Chandra Mohan, S/o B. Mallaiah, who died on 14-04-2026 as legal status.

If any person/persons have any objections may appear before the above Court on 20-08-2026 at 10-30 AM, either in person or through their advocate, failing which the matter will be decided Ex-Parte.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
Counsel for Plaintiff
K. Govardhan Reddy,
Advocate,
H.No.1-6-430/1, Zamisthanpur,
Musheerabad, Hyderabad- 500020,
(P. No. 98481 38076)
Place : Hyderabad,
Date : 21-07-2026

**IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE, City Civil Court, AT: Hyderabad.**
**O.S.No. 1981 of 2026**

BETWEEN:
1. Mamidi Latha,
2. Mamidi Chettu Rajkumar,
3. Mamidishetty Ramkumar,

........ Plaintiffs

**A N D**

1. The Thahsildar, Mandal Revenue Office, Asifnagar Mandal,
2. All Concerned.

............Defendants

**N O T I C E**

To,
**All Concerned**

The above Suit is filed for declaration of legal heirs, i.e., plaintiff No. 1 as the wife and the plaintiffs No.s 2 & 3 are the Sons of the deceased namely Mamidi Yadagiri @ M. Yadagiri @ Mamidishetty Yadagiri @ Mamidichetty Yadagiri @ Mamidichettu Yadagiri, who died on 21-11-2016 as legal heirs/legal status.

If any person/persons have any objections may appear before the above Court on 13-08-2026 at 10-30 AM, either in person or through their advocate, failing which the matter will be decided Ex-Parte.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
Counsel for Plaintiff
K. Govardhan Reddy,
Advocate,
H.No.1-6-430/1, Zamisthanpur,
Musheerabad, Hyderabad- 500020,
(P. No. 98481 38076)
Place : Hyderabad,
Date : 21-07-2026

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE,CITY CIVIL COURT, HYDERABAD**
**O.S. No. 1912 OF 2026**

*Between:*
1. Smt. N Sudha @ Kulkarni Sudha
2. Sri. Nirikhi Sudhindra Rao
3. Smt. Nirikhi Vani
4. Smt. Nirikhi Gayathri

.... **Plaintiff/s**

**AND**

1. The Mandal Revenue Officer, Ameerpet Mandal
2. All concerned

... **Respondents**

To,
All Concerned,
Please take notice that the above suit is filed for declaration of legal heirs of deceased Late Nirikhi Srinivasa Rao, who died intestate on 28.09.2024 at Hyderabad. Subsequently, Late Nirikhi Bhavani, wife of Late Nirikhi Srinivasa Rao died on 15.12.2025. The above suit is posted to 07.08.2026 for appearance in the above said court at 10:30AM. If anyone wants to defend the said suit shall attend the Court in person or through counsel. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined exparte.

***[BY ORDER OF THE COURT]***
***sd/-***
**Smt. Gayathri, Advocate on Record, Supreme Court**
**Sri. B. Balaji Sukumar**
**Advocates**
**Flat-103, 1-10-186, Rajeswari Castle Apartments,**
**Street No. 7, Ashok Nagar,**
**Hyderabad – 500020.**
**Ph: 9391327107 / email: gayathriadvocate123@gmail.com**

**IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENT CLAIMS TRIBUNALCUM III ADDI - CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.P. No. 2829 OF 2024**

***Between:***
Vadthyavath Jashwanth.

.... **Plaintiffs**

**AND**

Jakkidi Laxma Reddy and .Others....

... **Respondents**

To,
1.Jakkidi Laxma Reddy,S/o.J.Sanjeev Reddy,Occ: Business,H.No.5-1-200, Saheeb Nagar,Near Grama Panchayathi,Vasanthilipuram, Sarada Nagar,
R R District,Hyderabad

. . .........**R1**

2. Vaddula Brahma Reddy,S/o.V Punna Reddy,Occ:Driver of the Crime Vehicle,H.No.74/P,75/P,Erragadda,Fathenagar,sanath Nagar,Hyderabad.

... . .........**R3**

**NOTICE**

Please take notice that the above O P is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 5-8-2026 at 10.30 a.m. in person or by an Advocate, failing which the case will be decided on merits in your absence.

***[BY ORDER OF THE COURT]***
***sd/-***
**M.RAMAN GOUD,,**
**Advocates**
**SAI NAGAR,BALAPOOR, HYDERABAD.**

**IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGECITY CIVIL COURT AT: HYDERABAD**
**SOP NO. 49 Of 2026**

***Between:***
Shoba Reddy Kumbham & Ors

.... **Plaintiffs**

**AND**

1. Union Bank of India
2. All Concerned

...**Respondents**

**NOTICE**

To,
All Concerned
Take notice that my client Shoba Reddy Kumbham & Ors has filed the above Succession O.P seeking to grant Succession Certificate in favour of the petitioners in respect of the Schedule Amount of **Rs.2,52,437.39/-.**(Rupees Two lakhs Fifty Two Thousand Four Hundred Thirty Seven and Thirty Nine Paise only) held in Savings Account in **Union Bank of India, Sivannaguda Branh, Marriguda Mandal, Nalgonda (Dist)** which is on the name of husband of Petitioner No.1 i.e Ms Shoba Reddy Kumbham and father of Petitioners No 2 & 3 , against you in General and the above case is posted on **13.08.2026**, if anyone has any objections may appear on **13.08.2026** at 10.30 am before **the Hon'ble I Senior Civil Judge City Civil Court at Hyderabad** with material evidence by person or through counsel, else the matter will heard as per law

***[BY ORDER OF THE COURT]***
***sd/-***
**N.Vijaya Saradhi,**
**Shaik. Zaheeruddin,**
**ADVOCATES**
**Flat No 402, 4th Floor,**
**Rajya Lakshmi Bhavan,**
**Opp: Sai Chaitanya Techno School,**
**Parvat Nagar,**
**Hyderabad – 500018**




## అది అత్యంత హేయమైన చర్య

"నీట్ పరీక్షల లీకేజీ విషయానికి సంబంధించి దేశవ్యాప్తంగా యువత చేస్తున్న ఆందోళనల్లో, వారు చేస్తున్న నిరసనల్లో ఏమాత్రం తప్పు లేదు.. కానీ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు మాత్రం అత్యంత అసహ్యకరమైనది. విద్యార్థులపై భాష్పవాయువు ప్రయోగించడం, లాఠీఛార్జ్ చేయడం వంటివి ఏమాత్రం సరైన ప్రవర్తన కాదు, ఇది ప్రజాస్వామ్యయుత భారతీయ విధానం కాదు , ఇలా వ్యవహరించడం హేయమైన చర్య, ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్యలు ఏమాత్రం సరైనవి కావు.. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వ్యవహారశైలిని నేను తీవ్రంగా ఖండిస్తున్నా చివరి సారిగా ఆమెను ఓ పెళ్లి వేడుకలో కలిశా."

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత**

## వే'మన' పద్యం

**వంపుకర్రగాల్చి వంపు దీర్పగవచ్చు**
**కొండలన్ని పిండి గొట్టవచ్చు**
**కరినచిత్తు మనసు కరిగింపగరాదు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**



# సంపాదకీయం

## అది సమాజాన్ని చీల్చేది

సనాతన వాదం గురించి ఈ మధ్యకాలంలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏది సనాతన వాదమో, ఏది కాదో ఎవరికీ తెలియదు. సనాతన వాదులమని చెప్పటం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఏది సనాతనమో? ఏది ఆధునికమో? తెలియని అయోమయ పరిస్థితి సాధారణ పౌరునికి వస్తుంది. బొట్లు పెట్టుకోవడం, జైశ్రీరామ్ అనటం, గుడులకి పోయి రావటమే సనాతనం అనే భావనలో ప్రస్తుత తరానికి చెందిన వారిలో అత్యధికులు ఉన్నారు. కానీ ఎప్పటినుండి ఎప్పటి వరకు ఉన్న ఆచార సంప్రదాయాలు సనాతనమో, ఎప్పటినుండి ఆచరించే ఆచార సంప్రదాయాలు ఆధునికమో ఎవరు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. క్రీస్తుపూర్వానికి ముందున్న ఆచార సంప్రదా యాలని పాటించటం సనాతనమా? లేదా, ఇంగ్లీష్ వారు వచ్చేవరకు పాటించబడిన ఆచార సంప్రదా యాలు సనాతనమా? లేదా స్వతంత్ర్యం వచ్చే వరకు ఉన్న ఆచార సంప్రదాయాలు పాటించటం సనాతనమా? లేదా ఈ తరం అంటే గత పాతకేండ్ల తర్వాత పాటించేవి కూడ సనాతనమేనా? లేదా సాధువులు సన్యాసులు బ్రాహ్మణులు చెప్పేదే సనాతనమా? లేక బొట్లు పెట్టుకొని, జై శ్రీరామ్ అంటూ, గుడుల చుట్టూ తిరగటం మాత్రమే సనాతనమా? ఈ విషయాలు వివరణ ఇవ్వటానికి సరైన సనాతన వాది మీకు ఎవరూ దొరకరు. వాస్తవానికి అందరూ ఆచరించేది ఆధునికమే. చెప్పేది మాత్రమేమో సనాతనం. అది ఎలానో చూద్దాం. సనాతనవాదానికి ప్రామాణికంగా చెప్పబడేవి మను, పరాచరస్మృతులే. వాటి ప్రకారం అయితే, మనుధర్మం ఒకటవ స్మృతి 31వ శ్లోకం ప్రకారం బ్రాహ్మణుడు పౌరోహిత్యాన్ని చేయాలి. ఉద్యోగాలు, వ్యాపారాలు చేయరాదు. అలా చేస్తే ఆధునికవాదం అవుతుంది. వైశ్యులు వ్యాపారాలే చేయాలి. చదువుకొని ఉద్యోగాలు చేయరాదు. అలా చేస్తే ఆధునికవాదం అవుతుంది. క్షత్రియులు యుద్ధాలు చేయాలి, రాజ్యపాలనే చేయాలి. ఇంకొక వృత్తిలో ఉండకూడదు. ఏదైనా వృత్తిలో పాల్గొంటే అది ఆధునికవాదం అవుతుంది. మను ధర్మశాస్త్రం రెండవ స్మృతి పదహారవ శ్లోకం ప్రకారం శూద్రులు, అనగా ఎస్సీ,ఎస్టీ,బీసీలు చదువుకోకూడదు. అలా చదవకుండా శూద్రుడు ఉంటే సనాతన ధర్మాన్ని పాటించినట్లు, చదువుకుంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లు. 8వ స్మృతి417 వ శ్లోకం ప్రకారం ఆస్తులు కలిగి ఉండకూడదు. ఆస్తులు కలిగి ఉంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లే.8 వ స్మృతి 413 వా శ్లోకం ప్రకారం పై మూడు వర్ణాలకే శూద్రులు సేవలు చేయాలి. అలా కాకుండా చదువుకొని ఉద్యోగాలు చేయడం ఆధునిక వాదం అవుతుంది. దళితులను గుడిలోకి రానివ్వకూడదనేది సనాతన వాదం. అందరితో పాటు దళితులను కూడా గుడిలోకి అనుమతించడం ఆధునికవాద మవుతుంది. సనాతన వాదానికి మరో ప్రామాణికమైన ఐత్రియ బ్రాహ్మణీయం (111. 9.8) ప్రకారం గోమాంసం అంటే ఎద్దు,ఆవు ల మాంసాన్ని తింటేనే నిజమైన సనాతన వాదం అవుతుంది. ప్రత్యేకంగా విందులో తద్దినాలలో బ్రాహ్మణులకు ఎద్దు, అవు మాంసాలని వడ్డించాలి. అలా తిన్న బ్రాహ్మణుడే సనాతన వాది. గోమాంసం తినని వాడు ఆధునిక వాది అవుతాడు. పరాచర స్మృతి (29)ప్రకారం అమ్మాయిలకు పుష్పవతి కాకముందే పెళ్లి చేయాలి. 418 ప్రకారం భార్య భర్త అనుమతి లేకుండా ఏ పని స్వతంత్రంగా చేయకూడదు. భర్తని భార్య అనుమానించకూడదు. ప్రశ్నించకూడదు.1018 ప్రకారం భర్త చనిపోతే అతని చితిలోనే భార్య కూడా పడి చనిపోవాలి. ఇవన్నీ పాటిస్తే సనాతన వాదులు అవుతారు. ఇవన్నీ పాటించని వారంతా ఆధునికలవుతారు. ఇలాంటివి సమకాలీన సమాజంలో అనేకం చూడవచ్చు. ఉదాహరణలుగా చెప్పుకోవాలంటే... సనాతనవాదులు ప్రయాణాల కోసం ఎడ్లబండ్లను లేదా గుర్రాలను వాడాలి. ఆధునికులు వాడే బైకులను, కారులను, బస్సులను, రైళ్లను, విమానాలను వాడకూ డదు. ఫోన్లు,మొబైల్ కంప్యూటర్లు వాడకూడదు. అలా వాడితే సనాతన వాదాన్ని వదిలి ఆధునికవాదాన్ని ఆమోదించినట్లు అవుతుంది. అవసరం లేదనుకుంటే పుట్టగానే ఆడపిల్లని చంపేయటం సనాతనవాదం. చంపటం తప్పు అని చెప్పటం ఆధునిక వాదం. కులాలని బట్టి శిక్ష వేయాలి,అగ్రకులాలు ఎంత పెద్ద తప్పు చేసినా చిన్న శిక్షలు వేయాలి, చిన్న కులాల వారు ఎంత చిన్న తప్పు చేసినా పెద్ద శిక్షలు వేయాలనేది సనాతనవాదం.నేరాన్ని బట్టి కులాలకతీతంగా శిక్షలుండాలనేది ఆధునిక వాదం.కొత్తగా పెళ్లయిన శూద్రుల ఆడపిల్లలు మొదటి మూడు రాత్రులు బ్రాహ్మణులతో గడపాలనేది సనాతన వాదం. దీనిని వ్యతిరేకించేది ఆధునిక వాదం. దేవదాసి విధానం ఉండాలని అది ఆచారంలో భాగమనేది సనాతనవాదం. ఈ విధానం ఉండకూడదు అనేది ఆధునికవాదం. "చరక్ పూజ" పేరిట శూద్రులను నరబలులు ఇవ్వాలనేది సనాతనవాదం. ఇది అమానుషం, ఉండకూడదు అనేది ఆధునిక వాదం.భర్తలు చనిపోతే ఇంకొక పెళ్లి చేసుకోకూడదు, కానీ భార్యలు చనిపోతే భర్తలు ఎన్నైనా పెళ్లి చేసుకోవచ్చు అనేది సనాతన వాదం. భర్తలైనా భార్యలైనా రెండో వివాహం అనగా మళ్లీ పెళ్లి చేసుకోవచ్చనేది ఆధునికం. ఎవరి కులంలో వారే పెళ్లి చేసుకోవాలి అనేది సనాతన వాదం. కులాలని పాటించకుండా ఇష్టమైన వారిని పెళ్లి చేసుకోవచ్చు అనేది ఆధునిక వాదం.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## హాస్య గీతల రారాణి



**రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్య గానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు.**

రాగతి పండరి పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి నవ్వు తెప్పించే కార్టూన్లే. ఆమె పేరు తెలియని సాహిత్య అభిమానులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వ్యంగ్య చిత్రాలతో నవ్వించాలనే లక్ష్యంతో అన్ని అడ్డంకులను అధిగమించి జీవిత ఆశయం నెరవేరుకున్న అపురూప కళాకారిణి. సామాజిక అంశాలను ప్రతిబింబించే కార్టూన్లు గీస్తూ మన్ననలు, పురస్కారాలూ అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరి. విధి వంచితయై, నాలుగడుగులు వేసి చుట్టూ ఉన్న ప్రపంచంలో స్వేచ్ఛగా తిరిగే భాగ్యానికి నోచుకోక పోయినా అన్నింటిని అవగాహన చేసుకొని హాస్యంలో రంగరించి లక్ష్యాన్ని చేరుకున్న ఘనత, అసమాన ప్రతిభ ఆమెకే సొంతం.రాగతి పండరి (జూలై 22, 1965 19 ఫిబ్రవరి, 2015)తెలుగు వ్యంగ్య చిత్రకారులలో రాశిలోనూ, వాసిలోనూ సమానమైన కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు. అంతే కాదు, అనతి కాలంలోనే తెలుగు వ్యంగ్య చిత్ర కళా రంగంలో ఎనలేని పేరు తెచ్చుకుని, ఆ రంగంలో అగ్రగణ్యులైన బాపు, జయదేవ్ ల సరసన నిలబడ గలిగిన స్థాయి చేరుకున్న గొప్పతనం ఆమెది. ఆ గొప్పతనం వెనక అకుంఠిత దీక్ష, అంకిత భావంతో కృషి, వ్యంగ్య చిత్ర కళ మీద ఎనలేని ప్రేమ, నిరంతర పరిశ్రమ ఉన్నాయి. దురదృష్ట వశాత్తూ, ఆమెకు చిన్నతంలో వచ్చిన పోలియో మూలంగా శారీరకంగా బలహీనురాలైనా, ఆ బలహీనతను అధిగమించి, మానసిక ఒత్తిడిని అతిక్రమించి, తనకు ఇష్టమైన కళకే అంకితమై, కార్టూన్లు గీసి అందరి మన్ననలు పొందారు. ఆమె కార్టూనులో ఏ మూల వెదికినా తేట తెలుగు దనమే, ఏ చోట స్పృశించినా తేనెల తెలుగు మాటలే దర్శనం ఇస్తాయి. పండగలు, పబ్బాలు, అల్లుళ్ళు, ఆడ పడుచులు, దొంగలు, పోలీసులు, ఆఫీసులు, పార్కులూ, ఆమె తాకని విషయం లేదు, లాగని తీగ లేదు, నడవని డొంక లేదు. తెలుగు వ్యంగ్య చిత్ర రంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారా వాహికలు వార పత్రికలలో నిర్వహించిన ఘనత ఆమెదే. పన్నెండు వేలకు పైగా కార్టూన్లు వేసిన ఏకైక మహిళగా ఆమె గుర్తింపు పొందారు. రాగతి పండరి 1965 సంవత్సరం జూలై 22 న విశాఖ పట్టణంలో రాగతి గోవింద రావు, శాంతకుమారి దంపతులకు జన్మించారు. చదువు ఇంటి వద్దనే కొనసాగింది. అతి చిన్న వయసులోనే పోలియో వచ్చి, శారీరక లోపం ఏర్పడినా, పట్టుదల, ధైర్యం కలిగి జీవితాన్ని ఆత్మ విశ్వాసంతో, కఠోర పరిశ్రమతో ఎదుర్కొని, కార్టూన్ రంగంలో అగ్రగణ్యుల సరసన చేరారు.ఆమె తన వ్యంగ్య చిత్ర ప్రస్థానాన్ని 1973లో తన 8వ ఏటనే మొదలు పెట్టారు. బాల్యంలోనే వ్యంగ్య చిత్రాలు ప్రచురణ ప్రారంభ మయ్యింది. 19801990 దశకాల మధ్య కొన్ని వేల వ్యంగ్య చిత్రాలను శరపరంపరగా చిత్రించారు. పాఠకుల మనసులను దోచుకున్నారు. అన్ని ప్రముఖ వార, మాస పత్రికలలో ఈమె కార్టూన్లు ప్రచురించ బడ్డాయి. పండుగల సందర్భాలలో పత్రికల సంపాదకులు ఆమె కార్టూన్లను కోరుకుని, అడిగి తెప్పించుకుని తమతమ పత్రికలలో ప్రచురించేవారు. రాగతి పండరి ఆలోచన వచ్చిందే తడవుగా కాగితంపై పెన్సిల్‌తో గీతలు కూడా గీసు కోకుండా నేరుగా స్కెచ్ పెన్నుతోనే కార్టూన్ వేసే వారు. ఆ క్రమంలో ఐదు పది నిమిషాల స్వల్ప వ్యవధి లోనే కార్టూన్ గీసే విభిన్నమైన శైలి ఆమెది. జయదేవ్ గురువుగా భావించి ఆయన శైలిలో కొద్దిరోజుల పాటు కార్టూన్లు వేసినా, వేగంగా తనదంటూ ఓ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకుని ఆమె గీత చూడగానే గుర్తుపట్టేలా శైలిని ఏర్పరుచు కున్నారు.

రాగతి పండరి కార్టూన్లలో ఆడవారిని గయ్యాళి భార్య గానో, అత్త గానో మాత్రమే కాకుండా, అనేక ఇతర పాత్రలను, సృష్టించి, చూపించారు. కుదురైన చక్కటి చిత్రీకరణ, గుండ్రటి చేతివ్రాత, తేట తెలుగులో సంభాషణలు ఆమె వ్యంగ్య చిత్రాల ప్రత్యేకత. తెలుగు వ్యంగ్య చిత్రరంగంలో అనేక వ్యంగ్యచిత్ర ధారావాహికలు వార పత్రికలలో నిర్వహించిన ఘనత ఆమెది. సమకాలీన వ్యంగ్య చిత్రాకారులలో, వార్తా పత్రికలలో పనిచేస్తూ ఉన్న కార్టూనిస్ట్‌లను మినహాయిస్తే, రాజకీయ వ్యంగ్య చిత్రాలు వేసే ఏకైక ఫ్రీలాన్స్ కార్టూనిస్టు ఆమె. 'రాజకీయ చెదరంగం' అన్న పేరుతో ఒక దశాబ్దం పైగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురించబడటం తనకెంతో ఆనందం కలిగించిందని ఆమె చెపుతుండే వారు. ఆమె వ్యంగ్య చిత్రాలు హాస్యం ప్రధానంగా, ఆకర్షణీయంగా ఉండి,మానవ ప్రవృత్తిలో ఉన్న ద్వంద్వ అలోచానా విధానం, సాంఘిక దురాచారాల పట్ల విమర్శలతోకూడి పాఠకులను నవ్వులలో ముంచెత్తటమే కాకుండా, ఆలోచించటానికి కూడా ఉద్యుక్తులను చేస్తాయి.2001 సంవత్సరం ఉగాది పురస్కారం ఆంధ్రప్రదేశ్ అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. రాగతి పండరి కార్టూన్ సామ్రాజ్యాన్ని మొత్తం తన కైవసం చేసుకున్న ఏకైక మహిళ కార్టూనిస్టుగా పేరు ప్రఖ్యాతుల నార్జించారని ఆమె గురు తుల్యులు కార్టూనిస్టు జయదేవ్, వ్యాఖ్యానించారు. కాలక్రమేణా, తనకంటూ స్వంత శైలి ఏర్పరుచుకుని, చాలామంది మగ తెలుగు కార్టూనిస్టులు, వృత్తిపరంగా అసూయ పడేలా దూసుకు వచ్చిన ఒకే ఒక మహిళా కార్టూనిస్టుగా కార్టూనిస్టు రామకృష్ణ అభివర్ణించారు. కార్టూన్ల సాధనలో మొదట్లో తాను గీసిన చిత్రాలను చెన్నైలో నివసించే కార్టూనిస్టు జయదేవ్‌కు పండరి పంపితే మెచ్చుకోవడమే కాకుండా, ఆయన జవాబు రాస్తూ, కార్టూన్లను అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. స్వయంగా విశాఖపట్నం వచ్చి తన శిష్యురాలిని అభినందించారు.. బాపు అంతటి గొప్ప చిత్రకారుడు రచన మాస పత్రికలో 2005లో ప్రచురించిన వినాయక చవితి కార్టూన్ మెచ్చుకొంటూ లేఖ రాసి, పండరి కార్టూన్‌కు బాపు బొమ్మ గీయడం విశేషం.2015 ఫిబ్రవరి 19 న విశాఖపట్టణంలో ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో కన్ను మూశారు. ఆమె కోరిక ప్రకారం కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను సావిత్రిబాయి పూలే మెమోరియల్ ట్రస్ట్ ద్వారా దానం చేశారు.

# మన చదువుకు విలువెక్కడ?



భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఒక ఉపాధి అవకాశం కాదు. లక్షలాది కుటుంబాలకు అది ఆర్థిక భద్రతకు, సామాజిక గౌరవానికి ప్రతీక. అలాంటి అవకాశాలను అందించే నియామక వ్యవస్థలు సహజంగానే అత్యుత్తమ ప్రతిభను ఎంపిక చేయాలని ఆశిస్తాం. అయితే ఇక్కడే ఒక ప్రాథమిక వైరుధ్యం కనిపిస్తోంది. ఒక విద్యార్థి పాఠశాల నుండి విశ్వవిద్యాలయం వరకు దాదాపు రెండు దశాబ్దాల పాటు వివిధ సబ్జెక్టులను అభ్యసిస్తూ, వందలాది పరీక్షలు రాస్తూ, నిరంతర కృషితో తన విద్యా ప్రస్థానాన్ని నిర్మించు కుంటాడు. కానీ ఉద్యోగ నియామకానికి వచ్చేసరికి, ఆ సుదీర్ఘ ప్రయాణం దాదాపు అప్రస్తుతం అయిపోతుంది. చివరికి కొన్ని గంటల పాటు జరిగే ఒకే ఒక్క పరీక్షే అతని భవిష్యత్తును నిర్ణయిస్తుంది. రెండు దశాబ్దాల విద్యా ప్రయాణం కంటే చివరి రెండు మూడేండ్ల పరీక్షా తయారీనే నిర్ణయాత్మకంగా మారితే, విద్యా వ్యవస్థ లక్ష్యాలు, నియామక వ్యవస్థ లక్ష్యాలు నిజంగా ఒకే దిశలో ఉన్నాయా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

దేశవ్యాప్తంగా విస్తరించిన కోచింగ్ పరిశ్రమను కేవలం ఒక వ్యాపార విజయగథగా చూడడం సరిపోదు. అది విద్యా వ్యవస్థ, నియామక వ్యవస్థల మధ్య ఏర్పడిన అంతరానికి ప్రతిబింబం. ఒకవేళ పాఠశాలలు, కళా శాలలు అందిస్తున్న విద్యే నియామకాలలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తే, సమాంతరంగా మరో విద్యావ్యవస్థ ఎందుకు అవసరమైంది? ఎందుకు లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత మళ్లీ ప్రత్యేక శిక్షణ కోసం కోచింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది? అసలు సమస్య కోచింగ్ సంస్థల ఉనికిలో లేదు. పాఠశాలలు, కళాశాలలు ఇరవై ఏళ్ల పాటు అందిస్తున్న విద్య, తుది ఎంపిక ప్రక్రియ మధ్య సంబంధం ఎందుకు బలహీనపడిందన్నదే ప్రధాన ప్రశ్న.

ఏ పోటీ పరీక్ష లక్ష్యమైనా ఉత్తమ అభ్యర్థిని ఎంపిక చేయడమే. అయితే ఉత్తమ అభ్యర్థి అంటే ఎవరు? బాల్యం నుంచే వివిధ సబ్జెక్టులపై పట్టు సాధిస్తూ, నిరంతర కృషితో ఎదిగిన విద్యార్థినా? లేక పరీక్షల నమూనాలను అర్థం చేసుకుని వాటిని అధిగమించే ప్రత్యేక వ్యూహాలను అలవర్చుకున్న అభ్యర్థినా? రెండు దశాబ్దాల విద్యా ప్రస్థానం కంటే చివరి రెండు మూడేండ్ల పరీక్షా తయారీకి అధిక ప్రాధాన్యం లభిస్తే, మనం నిజంగా విద్యను కొలుస్తున్నామా? లేక పరీక్షలను ఛేదించే నైపుణ్యాన్నే కొలుస్తున్నామా? ఏ వ్యవస్థలోనైనా ప్రోత్సాహకాలు దాని స్వభావాన్ని నిర్ణయిస్తాయి. పాఠశాల స్థాయి నుండి డిగ్రీ వరకు సాధించిన ప్రతిభకు, క్రమశిక్షణకు, నిరంతర మేధో శ్రమకు తుది ఎంపికలో ఎలాంటి ప్రాధాన్యం లేకపోతే, విద్యార్థులు కూడా సహజంగానే పరీక్షలకే పరిమితమైన తయారీ వైపు మొగ్గు చూపుతారు. అప్పుడు విద్య జ్ఞానాన్ని పెంపొందించే ప్రక్రియగా కాకుండా, కేవలం అర్హత పత్రాలను సంపాదించే సాధనంగా మారే ప్రమాదం ఉంటుంది. ఇరవై ఏళ్ల విద్యా ప్రయాణం, తుది ఎంపిక ప్రక్రియ మధ్య ఎలాంటి సంబంధం లేకపోతే, విద్యార్థులు విద్యను గౌరవించాలా? లేక కేవలం పరీక్షలను మాత్రమే గౌరవించాలా? ఈ వైరుధ్యాన్ని అధిగమించాలంటే, సంస్కరణలు కేవలం ప్రశ్నాపత్రాల రూపకల్పనలో కాకుండా నియామక వ్యవస్థ తత్వంలోనే ప్రారంభం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒక అభ్యర్థి పాఠశాల, ఇంటర్, డిగ్రీ స్థాయిలలో సాధించిన విద్యా ప్రదర్శనకు పరిమిత స్థాయిలో వెయిటేజీ కల్పించడం లేదా తుది ఎంపికలో అదనపు ప్రమాణంగా పరిగణించడం వంటి అంశాలు పరిశీలించదగినవిగా కనిపిస్తున్నాయి. దీని ద్వారా రెండు దశాబ్దాల విద్యా ప్రస్థానానికి మరింత అర్థవంతమైన స్థానం కల్పించే అవకాశం ఉండవచ్చు.అదే సమయంలో పూర్తి సిలబస్‌ను ముందుగానే ప్రకటించే ప్రస్తుత పద్ధతి కూడా పునఃపరిశీలనకు అర్హమైన అంశంగా కనిపిస్తోంది. ప్రశ్నల స్వభావాన్ని ముందుగానే అంచనా వేయగలిగే స్థితి ఏర్పడినప్పుడు, పరీక్షలు జ్ఞానాన్ని కాకుండా నమూనాలను కొలవడం ప్రారంభిస్తాయనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి సిలబస్‌కు బదులుగా కేవలం సబ్జెక్టుల పరిధిని మాత్రమే ప్రకటించడం, ప్రతి నోటిఫికేషన్‌కు అనుగుణంగా అంతర్గత ప్రాధాన్యతలను మార్చడం వంటి ప్రత్యామ్నాయాలు కూడా చర్చకు అర్హమైనవే. ప్రశ్నాపత్రంలో ఒక భాగం ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు అభ్యర్థి నిర్మించుకున్న ప్రాథమిక విజ్ఞానాన్ని పరీక్షించేలా, మిగిలిన భాగం ఆయా ఉద్యోగాలకు అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలు, నైతిక విలువలు, నిర్ణయాత్మక సామర్థ్యాన్ని అంచనా వేసేలా రూపొందించే విధానంపై కూడా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అసలు ప్రశ్న కోచింగ్ కేంద్రాలను ఎలా నియంత్రించాలన్నది కాదు. పాఠశాలలు, కళాశాలలు రెండు దశాబ్దాల పాటు నిర్మించిన మేధో సంపత్తికి, చివరి పరీక్షా తయారీ కంటే ఎక్కువ గౌరవం ఇవ్వాలా లేదా అన్నదే అసలు ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానం 'అవును' అయితే, నియామక వ్యవస్థలో మార్పులు అనివార్యం. లేకపోతే మన విద్యాసంస్థలు జ్ఞానాన్ని పెంపొందించే కేంద్రాలుగా కాకుండా కేవలం సర్టిఫికెట్లు అందించే కర్మాగారాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఒక దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఎవరు పరీక్షలో విజయం సాధించారన్నది కాదు. ఎలాంటి ప్రతిభను విజేతగా నిలబెట్టాలనుకుంటుందన్నదే.

# భారత జాతీయ పతాక నేపథ్యం

20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారతదేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. "(భారత) మాతకు వందనం" అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)" ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్లతామర స్వచ్ఛతకు చిహ్నాలు.1907 లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్సీబగాన్ స్క్వేర్లో శచీంద్ర ప్రసాద్ బోస్ చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని "కలకత్తా పతాకం" అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి: పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, క్రింది పట్టీ మీద నెలవంక, మధ్యలో దేవనాగరి లిపిలో "వందేమాతరం" అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని స్టుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిష భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకుపచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తారనెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా (రాట్నము) ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపుఆకుపచ్చ రంగు పట్టీలమీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లుదర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్ఖులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు. భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు.1931లో సూచించబడిన జెండా ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది. "జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని" కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోందనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు.

1931లో, పింగళి వెంకయ్య రూపకల్పన చేసి, 1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో చరఖా స్థానంలో "ఆజాద్ హింద్" అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో వాడుకొంది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది.





రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## బ్రాయిలర్ కోడి బాలలు

నేటి శిశువు ఏసి రూంలో జన్మించి..
పుట్టుకతోనే 'ఐక్యూ'ను వెంటేసుకొని..
అమ్మానాన్నల అతి గారాల పట్టిగా..
ఇంటి నాలుగు గోడల జైల్లో..
సమాజానికి బహు దూరంగా..
స్మార్ట్ సో'సెల్' మాధ్యమాల్లో..
రేయింబవళ్లు మునిగి తేలుతూ..
అదే గదిలో తింటూ, అక్కడే..
మలమూత్ర విసర్జన చేస్తూ..
గొంతమ్మ కోర్కెలు తీర్చని వేళ..
ఇంటిని యుద్ధ క్షేత్రంగా మార్చుతూ..
పది మందిలో పిల్లిలా మారి..
ఇంట్లో యువరాజు/రాణిగా
కాలరెగిరేసి..
చిట్టి వైఫల్యానికే తెగ బాధ పడుతూ..
ఒంటరితనాన్ని వెంటేసుకొని..
మానసిక రోగిగా మారి పోయి..
మైదాన ఆటలకు మంగళం పలికి..
వీడియో గేమ్స్‌లో కప్పులు గెలుస్తూ..
బంధుమిత్రులకు బహు దూరంగా..
తన చిట్టి గృహ సామ్రాజ్యంలో..
బ్రాయిలర్ కోడి వలె బతుకుతున్న..
నవ సమాజ మెరుగని నేటి పిల్లలు
జీవించే కళ తెలియని డిజిటల్ పిచ్చోళ్లు



మధుసూదన్ రెడ్డి
9949700037

# జాతీయం-అంతర్జాతీయం



## ఢిల్లీలో రైతులను అడ్డుకున్న పోలీసులు

- పంజాబ్ -హర్యానా సరిహద్దుల్లో ఘటన
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నందుకే

**న్యూఢిల్లీ, జులై 21(ఎ.ఎం.ఎస్):** భారత్అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ర్యాలీ చేపట్టేందుకు వెళుతున్న రైతులను పంజాబ్హర్యానా సరిహద్దులో పోలీసులు అడ్డుకున్నారు. దేశ్ బచావో మోర్చా (డిబిఎం) నేతృత్వంలోని పంజాబ్ రైతులను హర్యానా పంజాబ్ సరిహద్దులైన శంభుఅంబాలా, ఖనౌరిజింద్ వద్ద పోలీసులు మంగళవారం నిలిపివేశారు. శంభుఅంబాలా రహదారిపై హర్యానా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో కేంద్రం భారీగా భద్రతా దళాలను మోహరించింది. రైతులు శాంతియుతంగా ఢిల్లీ ర్యాలీలో పాల్గొనేందుకు వెళుతున్నారని, బిజెపి నేతృత్వంలోని హర్యానా ప్రభుత్వం బారికేడ్లతో వారిని అడ్డుకుందని డిబిఎం సమన్వయకర్త సర్వాన్ సింగ్ పాంధేర్ పేర్కొన్నారు. స్థానిక యంత్రాంగంలతో తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఘర్షణ పడే ఉద్దేశ్యం తమకు లేదని అన్నారు. హర్యానాలోని కురుక్షేత్రలో భారతీయ కిసాన్ యూనియన్ (బికెయుచరుని) అధ్యక్షుడు గుర్నామ్ సింగ్ చరునిని సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారని బికెయు (చరుని) ప్రతినిధి ప్రిన్స్ వరైచ్ మీడియాకు తెలిపారు. పెహోవా సమీపంలో పోలీసులను చరుని వాహనాన్ని అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమల ప్రయోజనాలకు, అలాగే దేశ ఆర్థిక, ఆహార సార్వభౌమాధికారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమైన ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ ఆందోళనలను పట్టించుకోకుండా ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్తే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.వివిధ రాష్ట్రాలకు చెందిన రైతు సంఘాల సమాఖ్య (డిబిఎం) మంగళవారం న్యూఢిల్లీలో ర్యాలీకి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. భారత్అమెరికా వాణిజ్య ఒప్పందం కేవలం కొన్ని ఉత్పత్తుల దిగుమతి, ఎగుమతులకు మాత్రమే పరిమితం కాదని, వ్యవసాయం, పాడి పరిశ్రమ, పారిశ్రామిక రంగం, డిజిటల్ వాణిజ్యం, సేవా రంగం, మేధో సంపత్తి హక్కులు, ఇంధనం, పెట్టుబడులు , మార్కెట్ లభ్యత వంటి అనేక కీలక రంగాలను ఇది ప్రభావితం చేసే అవకాశం ఉందని డిబిఎం ఆందోళన వ్యక్తం చేసింది.

## అమెరికాను వెంటాడుతున్న ఇరాన్

- దాన్ని ఆక్రమించుకోవటం అంత ఈజీ కాదు
- పరిమిత చర్యే మేలు
- అగ్ర రాజ్యానికి తప్పని సవాళ్లు



**వాషింగ్టన్, జులై 21 :** పర్షియన్ గల్ఫ్లోని కొన్ని ఇరాన్ దీవులను స్వాధీనం చేసుకునే విషయాన్ని అమెరికా పరిశీలిస్తోందంటూ ఇటీవలి కాలంలో మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో భూతల దాడుల అవకాశాలపై ప్రజలలో తిరిగి చర్చ మొదలైంది. ఇప్పటి వరకూ వైమానిక, క్షిపణి దాడులకే పరిమితమైన అమెరికా తదుపరి సైనిక చర్యగా ఇరాన్ భూభాగంలో దాడులకు దిగుతుందా అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఆధునిక యుద్ధభూమిలో భూతల దాడులపై పరిశీలన జరపడానికి, వాటిని విజయవంతంగా నిర్వహించే సామర్థ్యం ఉండడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. భూతల దాడులపై సైన్యం అధ్యయనం చేయవచ్చు. కానీ దానికి వాస్తవ రూపం కల్పించాలంటే అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. సైనిక సామర్థ్యం, భౌగోళిక పరిస్థితులు మొదలుకొని వాతావరణ పరిస్థితులు, ప్రజాభిప్రాయం, రాజకీయంగా జరిగే నష్టం వరకూ అనేక అంశాలను దృష్టిలో ఉంచుకొని ముందడుగు వేయాలి. ఇరాన్ కు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

ఇరాన్ వంటి దేశాన్ని ఆక్రమించడం అంత తేలికైన విషయం కాదు. ఇరాన్ కు అపారమైన భూభాగం ఉంది. జనాభా కూడా ఎక్కు వే. దాని సైనిక నిర్మాణాన్ని, మధ్యప్రాచ్యంలో దానికి ఉన్న వ్యూహాత్మక స్థానాన్ని తక్కు వగా అంచనా వేయకూడదు. అలాంటి దేశంపై భూతల దాడులకు దిగాలంటే వేలాది సైనిక దళాలు అవసరమవుతాయి. వైమానిక మద్దతు, సాయుధ దళాలు, ఆయుధ నిల్వలు, ఇంజినీరింగ్ సామర్థ్యాలు, ఆస్పత్రులు, మందుగుండు సామగ్రి సరఫరాలు, సురక్షితమైన లాజిస్టిక్ మార్గాలు...ఇవన్నీ అవసరమే. మరీ ముఖ్యంగా ప్రతి దాడులను తట్టుకుంటూ భూభాగాన్ని స్వాధీనం చేసు కోవాల్సి ఉంటుంది. అమెరికా కనుక నిజంగానే భూతల దాడులను గురించి ఆలోచిస్తుంటే ఇరాన్ భూభాగాన్ని పెద్ద ఎత్తున ఆక్రమించుకోవడంపై కాకుండా వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పరిమిత చర్యకు దిగడంపై దృష్టి సారించడం మంచిదని సైనిక విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకొని ఇరాన్పై ఒత్తిడి తేవాలని, చర్చల వేదిక వద్దకు ఆ దేశాన్ని తిరిగి తీసుకొని రావాలని మరికొందరు సూచించారు.

ఏ ప్రాంతాన్ని అయినా స్వాధీనం చేసుకోవడం సులభమే కానీ దానిపై పట్టును కొనసాగించడమే కష్టం. ప్రధాన భూభాగంపై కాకుండా దీవులపై దాడులు చేయడం తేలిక. ఎందుకంటే ఆ ప్రాంతం చిన్నదిగా ఉంటుంది. సరిహద్దులు స్పష్టంగా ఉంటాయి. దళాల అవసరం కూడా పరిమితంగానే ఉంటుంది. అయితే ఇక్కడ ఓ సమస్య ఉంది. దీవులకు ఇంధనం, సైనిక దళాలు, వైద్య పరికరాలను తరలించడం కష్టంతో కూడిన పని. పర్షియన్ గల్ఫ్లోని ఇరాన్ దీవులు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. ఇవి ప్రధాన భూభాగం నుంచి వేరుపడి ఉంటాయి. కాబట్టి దాడి చేసే దేశాలకు శాశ్వతంగా సరఫరాలు జరగాల్సి ఉంటుంది. దీవులపై దాడులను ముందుగానే పసిగట్టడం తేలిక. తద్వారా వాటిని ఎదుర్కొనేందుకు దళాలను సిద్ధం చేయడానికి కావాల్సినంత సమయం ఉంటుంది.

ఒకవేళ భూతల దాడిలో ఇరాన్ను అమెరికా స్వాధీనం చేసుకుంటుందని అనుకున్నా ఆ తర్వాత అది అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. దీర్ఘకాలం పాటు ఇరాన్పై పెత్తనం చెలాయించడం అసాధ్యం. ప్రతి దాడులను ఎదుర్కొంటూ సరఫరాలను రక్షించుకోవడం అంత తేలిక కాదు. నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతాయి. క్షేత్ర స్థాయిలో విజయం సాధించడం సులభమే కానీ ఆ ప్రయోజనాలను కాపాడుకోవడం చాలా కష్టం. వేసవి కాలంలో పర్షియన్ గల్ఫ్, దక్షిణ ఇరాన్పై దాడులు చేయడం దుర్లభం. ఎందుకంటే అక్కడి వాతావరణం చాలా ప్రతికూలంగా ఉంటుంది.

వైమానిక దాడులతో పోలిస్తే భూతల దాడులలో ప్రాణనష్టం అధికంగా ఉంటుంది. శత్రువుకు పట్టుబడే సైనికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. యుద్ధం కనుక దేశీయ సంక్షోభానికి దారితీస్తే రాజకీయంగా ఎదురు దెబ్బలు తగులుతాయి. పైగా ఇరాక్ అనుభవాలు అమెరికాను ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి.



- భేటీపై కొనసాగుతున్న సంప్రదింపులు

**వాషింగ్టన్, జులై 21:** చైనా అధ్యక్షుడు జిన్పింగ్ సెప్టెంబరులో అమెరికాలో పర్యటిస్తారు. ఈ పర్యటనకు సంబంధించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని చైనా తెలిపింది. 'అమెరికా, చైనా దే

**చైనా అధ్యక్షుడు జిన్పింగ్ సెప్టెంబరులో అమెరికాలో పర్యటిస్తారు. ఈ పర్యటనకు సంబంధించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని చైనా తెలిపింది. 'అమెరికా, చైనా దేశాధినేతల దౌత్యం ప్రత్యామ్నాయం లేని వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది' అని చైనా విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం తెలిపారు .**

శాధినేతల దౌత్యం ప్రత్యామ్నాయం లేని వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది' అని చైనా విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం తెలిపారు. ఇటీవల డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు జిన్పింగ్ పర్యటనపై ప్రభావం చూపబోవంటూ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చేసిన ప్రకటనపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా లిన్ ఈ మాట చెప్పారు. ఈ ఏడాది చివరలో ఇరు దేశాల అధినేతల మధ్య జరిగే సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఆయన చెప్పారు.




## లోక్సభ స్పీకర్తో రాహుల్ భేటీ

- నీట్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంటులో చర్చించాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జులై 21(ఎ.ఎం.ఎస్):** లోక్సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పలువురు ఎంపీలతో కలిసి మంగళవారం స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలియజేశారు. భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన ప్రశ్నలు లేవనెత్తారని, అందుకు విద్యార్థులపై అన్యాయంగా లాఠీచార్జీ చేశారని తెలియజేశారు. ప్రస్తుత వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఉభయ సభల్లో చర్చ పెట్టాలని కోరారు. విద్యార్థుల డిమాండ్ లపై ఉభయ సభల్లో సమగ్ర చర్చ కొనసాగించాలని స్పీకర్ కు సూచించారు.'దేశ యువతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో పార్లమెంట్ పాత్రను ప్రశ్నించారు. తమ సొంత భవిష్యత్తు గురించి న్యాయమైన ప్రశ్నలు అడిగినందుకు విద్యార్థులను కొట్టారు. భారత యువత భవిష్యత్తు గురించి పార్లమెంట్ చర్చించలేకపోతే, దాని ప్రయోజనం ఏమిటి?" అని లోక్సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. పార్లమెంట్ లోపల, వెలుపల ప్రతిపక్షం ఈ విషయాన్ని లేవనెత్తుతూనే ఉంటుందని ఆయన ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## ఇక అమెరికాతో పూర్తిస్థాయి యుద్ధం

- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్



**టెహ్రాన్, జులై 21:** తమ దేశం అమెరికాతో పూర్తిస్థాయి యుద్ధంలో ఉందని, దీని పరిణామాలను టెహ్రాన్ ప్రజలు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తెలిపారు. వాస్తవాలను నమ్మాలని, ప్రతిఘటన సరైనదేనని అంగీకరించాలని పెజిష్కియాన్ కోరారు. టెహ్రాన్లో న్యాయాధికారులతో ఆయన మాట్లాడుతూ.. జూన్లో, యుద్ధం వల్ల ఇరాన్లో ద్రవ్యోల్బణం వేగంగా పెరిగి, గతేడాది కన్నా దాదాపు 90 శాతం గరిష్ట స్థాయికి చేరుకుందన్నారు. ఇప్పటివరకు ఇరాన్ అధికారులు 3,000 కంటే ఎక్కువమంది మరణించారని నివేదించారు.

## సెప్టెంబరు 15 నాటికి తిరిగి వచ్చేయండి

- విదేశీ విద్యార్థులకు అమెరికా ఆదేశాలు
- పాత విధానాల స్థానంలో కొత్త రూల్స్
- అక్కడ నాలుగేండ్లే ఉండేందుకు అనుమతి



**న్యూయార్క్, జులై 21:** భారతీయులు సహా విదేశీ విద్యార్థులు తమ సొంతదేశానికి వెళ్లినట్టయితే.. ప్రస్తుతం ఉన్న ఇమ్మిగ్రేషన్ నిబంధనల ప్రయోజనాలను కొనసాగించడానికి సెప్టెంబరు 15 నాటికి తిరిగి వచ్చేయాలని అమెరికాలోని యూనివర్సిటీలు సూచించాయి. ప్రస్తుతం అమలులో ఉన్నడ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానాన్ని రద్దు చేస్తూ.. హోమ్ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్మెంట్ సరికొత్త నిబంధనలు తీసుకురానున్న నేపథ్యంతో ఎఫ్, జే వీసాదారులకు ఈ హెచ్చరికలు జారీ చేశారు. తాజా నిబంధన ప్రకారం విదేశీ విద్యార్థులు గరిష్టంగా నాలుగేళ్ల కాలానికి మాత్రమే అమెరికాలో నివసించేందుకు అనుమతి ఉంటుంది."ఈ కొత్త చట్టం అమలులోకి రావడానికి 60 రోజుల వ్యవధి ఉంది.. సెప్టెంబర్ 8, 2026న తరగతులు ప్రారంభమయ్యే లోపే విద్యార్థులందరూ న్యూయార్క్ చేరుకోవాలని సూచిస్తున్నాం" అని కొలంబియా యూనివర్సిటీ తన నోటీసులో పేర్కొంది. ఎఫ్1 స్టూడెంట్ వీసా, జే1 ఎక్స్ఛేంజ్ విజిటర్ వీసా, విదేశీ జర్నలిస్టులకు ఉద్దేశించిన I వీసా హోల్డర్ల నివాస కాలాన్ని గరిష్టంగా నాలుగేళ్లకు పరిమితం చేస్తూ డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ కఠిన నిబంధనలను ఖరారు చేసింది. ఈ నిర్ణయం లక్షలాది మంది భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ నిబంధన ప్రకారం.. చదువు పూర్తయిన తర్వాత ఇచ్చే గ్రేస్ పీరియడ్ను 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. అంతేకాకుండా, ఏ పొడిగింపు కోసమైనా విద్యార్థులు ఫారం I539 ద్వారా అమెరికా సిటిజన్షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధన సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రస్తుత విధానం ప్రకారం ఎఫ్1 విద్యార్థులు తమ అకడమిక్ స్టేటస్ను కొనసాగించినంత కాలం అమెరికాలో నివసించడానికి అనుమతి ఉంది.

ఇప్పటికే డ్యురేషన్ ఆన్ స్టేటస్ విధానం కింద అమెరికాలో ఉన్న విద్యార్థులు.. ఫామ్ I20లో పేర్కొన్న కోర్సు ముగిసే తేదీ వరకు లేదా ఆమోదించి ఓపీటీ లేదా స్టెమ్ ఓపీటీ ముగిసే వరకు కొనసాగవచ్చు. అయితే, ఈ మినహాయింపు కూడా కొత్త చట్టం అమలులోకి వచ్చిన తేదీ నుంచి గరిష్టంగా నాలుగేళ్ల కాల పరిమితికి లోబడి ఉంటుంది. నిష్క్రమణ వ్యవధితో కలిపి ఇది నవంబర్ 14, 2030 కంటే దాటడానికి వీల్లేదు. అమెరికా విధానంలో వచ్చిన ఈ ఆకస్మిక మార్పుతో భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది తమ విద్యా, ఉద్యోగ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని వారు భయపడుతున్నారు. 'ఇది అమెరికా తన పోటీతత్వాన్ని తానె దెబ్బతీసుకోవడమే' అని ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ దయాస్పోరా స్టడీస్ పాలసీ అండ్ స్ట్రాటజీ చీఫ్ ఖండేరావ్ కాండ్ వ్యాఖ్యానించారు.

"నేటి తరం డిగ్రీలు పూర్తయ్యే సమయానికి, ఈ నాలుగేళ్ల పరిమితికి అసలు పొంతనే లేదు.. సాధారణంగా బ్యాచిలర్స్ డిగ్రీకి 52 నెలలు.. పీహెచ్డీకి 5.7 సంవత్సరాలు పడుతుంది.. మరోవైపు యూఎస్సీఐఎస్ వద్ద ఇప్పటికే 11 మిలియన్లకు పైగా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి.. వాటి ప్రాసెసింగ్కే ఏడాది సమయం పడుతోంది.. విద్యార్థులు కోర్సు లేదా పరిశోధనల మధ్యలోనే విడిచి వెళ్లాల్సి వస్తుంది. దీనివల్ల ల్యాబొరేటరీలు కీలకమైన ప్రతిభను కోల్పోతాయి.. ఫలితంగా అమెరికా తన ఆవిష్కరణల శక్తిని ఇతర దేశాలకు అప్పగించినట్లవుతుంది'' అని ఆయన అన్నారు.

పరిశోధనాత్మక కోర్సులు, ముఖ్యంగా డాక్టోరల్ కోర్సులు, మెడికల్ ట్రెయినింగ్లు సాధారణంగా నాలుగేళ్ల కంటే ఎక్కువ సమయం తీసుకుంటాయని ఎఫ్ఐఐడీఎస్ తెలిపింది. జే1 రిసెర్చ్ స్కాలర్లు, వైద్యులు తమ కోర్సులు పూర్తి చేయడానికి ఐదు నుంచి ఏడేళ్ల సమయం పడుతుంది. అంతేకాకుండా వీసా పొడిగింపుపై స్పష్టత లేకపోవడం వల్ల ల్యాబొరేటరీల పనితీరు దెబ్బతినడమే కాకుండా, గ్రాడ్యుయేషన్ ప్రక్రియ ఆలస్యమవుతుందని, అంతర్జాతీయ ప్రతిభపై ఆధారపడే ఫ్యాకల్టీ నియామకాలపై ప్రభావం పడుతుందని హెచ్చరించింది. "ఈ చట్టం అమలును వాయిదా వేసి విద్యార్థులను రక్షించాలి.. అమెరికా పరిశోధన, ఆవిష్కరణలను కాపాడాలి.

వ్యవస్థలో పారదర్శకత తేవడమే మీ లక్ష్యమైతే, దేశంలో ల్యాబ్లు, స్టార్టప్లను నడిపించే విద్యా వ్యవస్థలను దెబ్బతీయకుండా ఆ పని చేయండి'' అని కాండ్ స్పష్టం చేశారు.

## సుప్రీం వద్దకు ఉద్ధవ్ వర్గం



- ఆరుగురు ఎంపీల విలీనం కేసుపై
- స్పీకర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జులై 21(ఎ.ఎం.ఎస్):** షిండే వర్గంలో ఆరుగురు లోక్సభ ఎంపీల విలీనానికి లోక్సభ స్పీకర్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టును ఉద్ధవ్ వర్గం ఆశ్రయించింది. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ను ఉద్ధవ్ ఠాక్రే వర్గం వేసింది. ఉద్ధవ్ వర్గం పిటిషన్ను విచారించేందుకు సమ్మతిని పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వెల్లడించింది .ఈ విలీనాన్ని ఆమోదిస్తూ లోక్సభ స్పీకర్ ఓం బిర్లా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉద్ధవ్ వర్గం విజ్ఞప్తి చేసింది.లోక్సభ వర్షాకాల సమావేశాలకు ముందే ఎంపీల వి

**క్సభ వర్షా కాల సమావేశాలకు ముందే ఎంపీల విలీనానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. ఎంపీల విలీనంతో లోక్సభలో 13 మందికి షిండే వర్గం శివసేన బలం పెరిగింది. కేవలం మూడు స్థానాలకు ఉద్ధవ్ థాకరే పార్టీ ఎంపీల సంఖ్య పడిపోయింది.**

లీనానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. ఎంపీల విలీనంతో లోక్సభలో 13 మందికి షిండే వర్గం శివసేన బలం పెరిగింది. కేవలం మూడు స్థానాలకు ఉద్ధవ్ థాకరే పార్టీ ఎంపీల సంఖ్య పడిపోయింది. ఎవరికి వ్యతిరేకంగా గెలిచారో వారితోనే విలీనమవడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో ఉద్ధవ్ వర్గం వాదనలు వినిపించింది.

## అమృతకాలం అంటే ఇదేనా..?

- ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ డిమాండ్



**న్యూఢిల్లీ, జులై 21(ఎ.ఎం.ఎస్):** సమాజ్వాదీ పార్టీ అధినేత, లోక్సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ మంగళవారం కేంద్రంపై విమర్శలు గుప్పించారు. పరీక్షల పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వద్ద విలేకరులతో మాట్లాడిన యాదవ్, పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, అధికార యంత్రాంగం వ్యవహరించిన తీరు సరైంద కాదని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు బల ప్రయోగం చేయడం ఏంటని తప్పుబట్టారు. ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయకుండా ఇంకా ఆలస్యం చేయడం సమంజసం కాదని, వెంటనే ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "పరీక్షా పత్రాలు లీక్ కాకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఇంతటి దారుణం జరిగిన తర్వాత కూడా సభలో నినాదాలు చేయాల్సి వస్తోంది, దీనికంటే సిగ్గుచేటు విషయం మరొకటి ఉంటుందా? ప్రభుత్వ లాఠీల దెబ్బలకు యువత, విద్యార్థుల తలలు పగిలిపోతున్నాయి, మీరు బాష్పవాయువు ప్రయోగిస్తున్నారు, విద్యుత్ షాకులు ఇస్తున్నారు. ఇదేనా 'సబ్కా సాత్, సబ్కా వికాస్'? ఇదేనా 'అమృత కాలం'?" అని యాదవ్ పార్లమెంట్ మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు.



## జంతర్ మంతర్ వద్ద గాంధీజీ

**న్యూఢిల్లీ, జులై 21(ఎ.ఎం.ఎస్):** ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో మహాత్మా గాంధీ వేషధారణలో పాల్గొన్న ఓ వృద్ధుడు అందరి దృష్టిని ఆకర్షించారు. పోలీసుల లాఠీచార్జ్, ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఆయన అక్కడ కనిపించడంతో ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. ఉద్యమాన్ని అహింసా మార్గంలో, శాంతియుతంగా కొనసాగించాలనే సందేశంతో ఆయన నిరసనలో పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. పోలీసుల లాఠీచార్జ్, ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఆయన అక్కడ కనిపించడంతో ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. అయితే ఆయన గుర్తింపు, నిరసనలో పాల్గొన్న ఉద్దేశంపై అధికారికంగా ఎలాంటి ధృవీకరణ వెలువడలేదు.

## కొనసాగుతున్న దాడులు

- ఇరాన్ దెబ్బకు రెండు చమురు ట్యాంకర్లు ధ్వంసం
- సిరియాలోని విమానాశ్రయం పైనా దాడి
- వెల్లడించిన ఐఆర్జీసీ

**టెహ్రాన్, జులై 21:** మధ్యప్రాచ్యంలో వరుసగా తొమ్మిదో రోజూ అమెరికా, ఇరాన్ దాడులు కొనసాగాయి. రెండు చమురు ట్యాంకర్లపై దాడి చేసి నిలిపివేశామని ఇరాన్ ప్రకటించడంతో జలసంధిలో నౌకల రాకపోకలపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సోమవారం తెలిపింది. అమెరికాకు చెందిన బ్లాక్ హాక్ హెలికాప్టర్లను పెద్ద సంఖ్యలో ధ్వంసం చేశామని, యుద్ధ విమానాలను నిల్వ ఉంచే కేంద్రాలకు నష్టం కలిగించామని చెప్పింది. కాగా ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయి న్ లో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇరాన్ వైపు నుంచి వచ్చిన డ్రోన్లను కువైట్ సైన్యం అడ్డుకుం టోంది. కువైట్లోని డీశాలి నేషన్ ప్లాంటుపై (ఉప్పు నీటితో మంచినీరుగా మార్చే ప్లాంటు) ఇరాన్ దాడి చేయడంతో



జోర్డాన్లోని అక్వాబా విమానాశ్రయంలో అమెరికా యుద్ధ విమానంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, అలాగే కువైట్లోని అల్ అదిరి శిబిరం పైన, సిరియాలోని అలీ అల్ సలేం విమానాశ్రయం పైన దాడులు జరిపామని ఇస్లామిక్ రివల్యూషనరీ అగ్నిప్రమాదం సంభవించింది. కాగా ఒమన్ తీరంలో జరిగిన దాడిలో ఓ నౌక మంటల్లో చిక్కుకొని సముద్రంలో కొట్టుకు పోయిందని బ్రిటన్ మారీటైమ్ అథారిటీ తెలిపింది. నౌకలోని సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. వారిని ఓ పడవలో ఒడ్డుకు చేర్చారు.



## ఇరాన్ తో యుద్ధంలో అమెరికా భారీ మూల్యం

- ప్రాణాలు కోల్పోయిన 17 మంది సైనికులు

**టెహ్రాన్, జులై 21(ఎ.ఎం.ఎస్):** ఇరాన్తో కొనసాగుతున్న యుద్ధంలో అమెరికా సైనికుల మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉత్తర ఇరాక్లో పేలని ఇరానీ డ్రోన్ అవశేషాలను నిర్వీర్యం చేసే క్రమంలో మరో అమెరికా సైనికుడు మృతి చెందడంతో ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమెరికా సైనికుల సంఖ్య 17కు చేరింది. ఈ విషయాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్కామ్) వెల్లడించింది. ఈ యుద్ధం ప్రధానంగా వైమానిక దాడులు, డ్రోన్లు, క్షిపణుల ద్వారానే సాగుతున్నప్పటికీ.. అమెరికా బలగాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్అమెరికా యుద్ధం ప్రారంభమైన కొద్ది రోజులకే కువైట్లోని ఓ పౌర నౌకాశ్రయంపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించారు. మార్చి 1న సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్బేస్పై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో తీవ్రంగా గాయపడిన మరో సైనికుడు వారం రోజుల అనంతరం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యదాద్రి భువనగిరి, 21-07-2026**




భువనగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భువనగిరి నుండి టేకులసోమారం వయా నమాత్‌పల్లి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నమాత్‌పల్లి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు సర్వీసు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే ని ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం టేకులసోమారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకునే అవకాశం కలిగిందని, గ్రామ ప్రజలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు స్వయంగా ఆర్టీసీ బస్సును నడిపి ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం భువనగిరి నుండి టేకులసోమారం వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేకమయ్యారు.ఈ నూతన బస్సు సర్వీసు ద్వారా మార్గమధ్యంలోని గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సకాలంలో రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో భువనగిరి పట్టణ, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు,RTC DM సురేష్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్‌తో రైతుకు భరోసా..

## గోదావరి జలాలే అభివృద్ధి బాట: మంత్రి తుమ్మల

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 21 ( వుదయం ప్రతినిధి)**




ములకలపల్లి మండలంలో మంగళవారం నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ పంటలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, నీటి సంరక్షణ, గోదావరి జలాల వినియోగం వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా మాట్లాడారు.మంత్రి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రస్తుతం ములకలపల్లి మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, మరో 10 వేల ఎకరాలకు విస్తరిస్తే వెంటనే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. పోడు భూముల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌర విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రాబోయే నెలల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున బోర్లపై ఆధారపడి వరి సాగు చేయకుండా పెసర, మినుము, కంది, అలసంద వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పత్తి సాగులో కందిని అంతర పంటగా సాగు చేస్తే అదనపు ఆదాయంతో పాటు భూమి సారం కూడా పెరుగుతుందని వివరించారు.ఆయిల్ పామ్ తోటల్లో మునగ, పప్పుధాన్యాలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, ప్రపంచ మార్కెట్లో మునగ ఆకుకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులు ఆదాయం పెంచే పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని, గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, మర్రి, వెదురు, చింత వంటి స్థానిక జాతుల మొక్కలను విస్తృతంగా నాటి అడవులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్న మంత్రి, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తు వ్యవసాయానికి ఉపయోగపడతాయని తెలిపారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తికాగానే చెరువులు నింపుతామని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులు సహకరిస్తే ప్రతి పొలానికి గోదావరి జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందించడమే తన జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ఈ ఏడాది మరో 15 వేల ఎకరాల్లో కొత్తగా సాగు విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని వెల్లడించారు.వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, మిర్చి, ఆయిల్ పామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆయిల్ పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ఇవ్వడం ప్రారంభించినప్పటికీ, దాదాపు 30 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమం కింద ప్రభుత్వం కంది, మినుము విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసింది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బంది, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి..కలెక్టర్

**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై -21:**




ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకి అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సేవతో సమాజంలో వెలుగులు నింపాలి.. ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

**హసన్ పర్తి జూలై 21 (వుదయం ప్రతినిధి):**



సేవా కార్యక్రమాలతో సమాజంలో వెలుగులు నింపాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహాలక్ష్మి పంక్షన్ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలోని చిరు వ్యాపారులకు గొడుగుల వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో రోడ్డు పక్కన, కూడళ్లలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఉపశమనం పొందేందుకు, రోజంతా ఎండనక, వాననక చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్న మహిళలు, వృద్ధులకు నీడ నివ్వాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టిన క్లబ్ సభ్యు లను ఎమ్మెల్యే అభినందించారు. గతంలో ఈ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేశారని, మరిన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొడుగుల దాత కోరే చంద్రమౌళి, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు సోమ వేణుగోపాల్, కార్యదర్శి నాయిని అనిల్ కుమార్, కోశాధికారి జూలూరి కృష్ణమూర్తి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పింగిలి వెంకటరెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె, కిరణ్, 65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రౌతు రాజు, కాంగ్రెస్ నాయకులు మేరుగు రాజేష్, తోకల లక్ష్మారెడ్డి, కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ లో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశం**

**సూర్యాపేట, జులై 21, వుదయం ప్రతినిధి**




ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.బీఎల్‌వో రోజుకు 100 మంది లక్ష్యం ఈ సందర్భంగా సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) రోజుకు కనీసం 100 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జూలై 15వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఓటర్ల వివరాలు డిజిటలైజ్ కాగా, గత ఏడు రోజుల్లో కేవలం 22 లక్షల వివరాలు మాత్రమే డిజిటలైజ్ అయ్యాయని, ఈ పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. వచ్చే సమీక్షా సమావేశం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలనే లక్ష్యంతో అన్ని జిల్లాలు పనిచేయాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో పురోగతి నెమ్మది పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పురోగతి చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, వచ్చే వారం గరిష్ఠ స్థాయిలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కీలక ఆదేశాలు– ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. ఈ అంశంపై వస్తున్న వదంతులను జిల్లా యంత్రాంగం వెంటనే ఖండించాలి.– ఎన్యూమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికం మాత్రమే. బీఎల్‌వోలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ నంబర్ ఇవ్వాలని ఓటర్లపై ఒత్తిడి చేయరాదు.– ఆన్‌లైన్‌లో ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారం సమర్పించిన ఓటర్లను మళ్లీ ఆఫ్‌లైన్ ఫారం ఇవ్వాలని కోరవద్దు.– 50 శాతం కంటే తక్కువ డిజిటలైజేషన్ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పనులను వేగవంతం చేయాలి.– జీవించి ఉన్న ఓటర్లను మరణించిన వారిగా నమోదు చేసిన పొరపాట్లను వెంటనే గుర్తించి సరిదిద్దాలి.

# గిరిజన విద్యాభివృద్ధికి నూతన దిశగా అడుగులు

**ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మండలాపురం ఫిరంగి బాధ్యతల స్వీకారం**

**గిరిజన విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ సూచన**

**భద్రాచలం 21/7/26 వుదయం ప్రతినిధి**




ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా మండలాపురం ఫిరంగి మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించిన విజయలక్ష్మి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ కావడంతో, ఆమె స్థానంలో మండలాపురం ఫిరంగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు ఆయనకు బాధ్యతల పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండలాపురం ఫిరంగి భద్రాచలం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ నూతన డిప్యూటీ డైరెక్టర్‌కు అభినందనలు తెలియజేస్తూ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. ప్రత్యేకించి గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రతి పాఠశాలలో విద్యా బోధన నాణ్యతను పెంచాలని, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ, పరీక్షల ఫలితాలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.అలాగే ప్రభుత్వం నిర్దేశించినమెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, వంటశాలల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, వసతి గృహాల్లో భద్రత, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా అధికార యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్ శాతం తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాలికల విద్యకు మరింత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండలాపురం ఫిరంగి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన విద్యను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని, ఆ లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శిస్తానని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా ఉపాధ్యాయులు, వార్డెన్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి చందన, గిరిజన సంక్షేమ శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొని నూతన డిప్యూటీ డైరెక్టర్ మండలాపురం ఫిరంగికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో గిరిజన విద్య, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలై గిరిజన విద్యార్థుల అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీలో వరంగల్ మార్క్:

### ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్రం సమాధానం

**వరంగల్, జూలై 21 (వుదయం ప్రతినిధి) :**



వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలుతీరు, వేతనాల చెల్లింపులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 2025-26లో 99.97 శాతం మందికి పని కల్పించారు. అలాగే సగటు పనిదినాలు 2024-25లో 41.12, 2025-26లో 27.89గా నమోదయ్యాయి. వేతనాల చెల్లింపుల్లో ఎలాంటి బకాయిలు లేవని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా కూలీల ఖాతాల్లోకే నిధులు జమ అవుతున్నాయని కేంద్రం స్పష్టం చేసింది.ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా ఉపాధి కల్పనలో మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. బకాయిలు లేకుండా కూలీలకు వేతనాలు అందడం పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సగటు పనిదినాలను మరింత పెంచడంతో పాటు స్థిరమైన గ్రామీణ ఆస్తుల కల్పన, మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## అమెరికాతో వ్యవసాయ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి

**తొర్రూరు జూలై 21, (వుదయం ప్రతినిధి):**

**కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్ కేయం) ఆధ్వర్యంలో**

**తొర్రూర్ లో ఒప్పంద పత్రాల దగ్ధం...**



అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్కేయం నాయకులు తొర్రూర్ లో ధర్నా నిర్వహించడం జరిగింది. మంగళవారం రోజు తొర్రూరు మండలం కేంద్రంలో గాంధీ సెంటర్లో ఎస్ కే ఎమ్ ఆధ్వర్యంలో అమెరికా స్వేచ్ఛ వాణిచ్చే ఒప్పంద పత్రాలను దగ్ధం చేయడం జరిగింది. అనంతరం ఎస్కేయం నాయకులు,బొల్లం అశోక్,ముంజపెల్లి వీరన్న, ఆలకుంట్ల సాయిలు, గణపురం లక్ష్మణ్ ,కొత్త వెంకట్ రెడ్డి లు సంయుక్తంగా మాట్లాడుతూ, భారతదేశ వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అన్నిటిని యూరోపియన్ యూనియన్ తో చేసుకున్న చీకటి అసమాన ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని రైతు, కూలీలను కాపాడుకుందాం అని వారు అన్నారు. ఈ ప్రమాదకరమైనటువంటి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల వల్ల చిన్న సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం వ్యవసాయక దేశం వ్యవసాయంపైనే ఆధారపడి కోట్లాది కుటుంబాలు జీవిస్తున్నాయని వారి జీవనం మనుగడకు దెబ్బతీస్తే విధానాలను వెంటనే రద్దు చేసి భారతదేశాన్ని కాపాడాలని లేనియెడల రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు మిగతా అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ వాణిజ్య ఒప్పంద పత్రాలను ఎస్కేమ్ నాయకులు దగ్ధం చేయడం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎండి యాకూబ్ జమ్ముల శ్రీను, దర్గయ్య, తిమ్మిడి రవి, రామకృష్ణ, ముద్దెరబోయిన వెంకన్న, రాధా, షమీనా, భాగ్య, వరలక్ష్మి ,వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టండి: కమిషనర్ టి.వెంకన్న

**వరంగల్ టౌన్, జూలై 21 వుదయం ప్రతినిధి) :**

**మాన్ సూన్ బృందాల సహకారం తో పని చేయండి.**

**ప్రధాన రహదారులు పరిశుభ్రత అత్యవసరం**



విస్తృతం గావర్షాలు కురుస్తున్న నేపధ్యం లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. నగర పరిధి లోని లోతట్టు ప్రాంతాలైన తిరుమల బార్ జంక్షన్, ఎన్ జీ ఓస్ రోడ్డు, ఎస్ బి హెచ్ కాలనీ, రామకృష్ణ కాలనీ, కాకతీయ కాలనీ, బొంది వాగు, శివ నగర్, మైసయ్య నగర్, సాయి గణేష్ నగర్ వద్దేపల్లి చెరువు, 12 మోరీలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్ధవంతం గా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణం లో నగరం లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఇంజనీరింగ్ కు చెందిన మాన్ సూన్ టీమ్స్ సహకారం తో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తొలగించాలని చిన్న చిన్న గల్లీ లోని డ్రైన్ లో నీరు నిలిచి ఉండకుండా అవసరం మేరకు డీ సిల్టింగ్ ప్రక్రియ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రధాన రోడ్ల పై శానిటేషన్ పక్కా గా జరిగేలా చూడాలని డివైడర్ ల మధ్యలో చెత్త, మొక్కల ఆకులు పేరుకు పోకుండా తొలగించాలని వీటి తో పాటు లింక్ రోడ్ ల శుభ్రత పై దృష్టి సారించాలని స్వీపింగ్ మిషన్ లు మరమ్మత్తులకు గురి కాకుండా చూడడం తో పాటు అట్టి మిషన్ పని తీరు పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటన లో కమిషనర్ వెంట ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి,ఎం హెచ్ ఓ డా.రాజేష్ శానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను తదితరులు ఉన్నారు.

## ఆకస్మికంగా పాఠశాలను అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ

**ఆకస్మికంగా పాఠశాలను అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ**

**ఖానాపురం, జూలై 21 (వుదయం ప్రతినిధి):**



మండలంలోని బలుతండలోని ప్రభుత్వ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీడీవో వనపర్తి అద్వైత ఆకస్మికంగా తనిఖీ చేసి అంగన్వాడి టీచర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలను అంగన్వాడి కేంద్రమును తనిఖీ చేసే సమయంలో అంగన్వాడి కేంద్రం మూసి ఉండడంపై అంగన్వాడి టీచర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే సంబంధిత అంగన్వాడి అధికారులతో ఎంపీడీవో మాట్లాడి మరల ఇలాంటి సంఘటనలు నరావృతంకాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించినట్లు ఎంపీడీవో తెలుపుతూ, విద్యార్థులకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించే దిశగా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, సర్పంచులు మాద్రాజు వెంకన్న, బానోతు సునీత, సర్వే అధికారులు కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి...

**రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్**

**రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత...**

**జాతీయ రహదారులపై ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలి...**

**జిల్లాల వారీగా రోడ్డు భద్రత చర్యలపై సమగ్ర నివేదికలు సమర్పించాలి...**

**జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**




**జగిత్యాల జులై 21 (వుదయం ప్రతినిధి)**

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి సమర్థవంతమైన రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతను పెంపొందించడం రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు బీహార్ కర్ణాటక పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే సుప్రీంకోర్టుకు అనుసరణ నివేదికలు సమర్పించాయని మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని నివేదికలు పంపాలని సూచించారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను బలోపేతం చేయడంతో పాటు భారీ వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ స్థలాలను జాతీయ రహదారుల సమీపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు పోలీసు శాఖ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పక్కన కొత్తగా మద్యం దుకాణాలకు ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని ఈ ప్రక్రియలో అవసరమైన అన్ని శాఖల సమన్వయం పోలీసు సహకారం అందేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని అనుసరణ నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారి సంధాని ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపట్నంలో గులాబీ హోరు

**కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌లకు ఘన స్వాగతం**

**గులాబీమయమైన చౌరస్తా.. హోరెత్తిన నినాదాలు**

**కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపిన నేతల పర్యటన**



**రాయపట్నం (ధర్మపురి) జులై 21 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి నియోజకవర్గంలోని రాయపట్నం చౌరస్తాలో మంగళవారం గులాబీ శ్రేణుల కోలాహలంతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల పర్యటన సందర్భంగా గులాబీ దండు కదం తొక్కింది. నేతల రాకను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతల నేతృత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు రాయపట్నం చౌరస్తా వద్ద కేటీఆర్, కొప్పుల ఈశ్వర్‌లకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేతలకు తమపూర్తి మద్దతును ప్రకటిస్తూ శ్రేణులు ఉత్సాహంగా పటాకులు కాల్చి సంబరాలు జరిపాయి. రాయపట్నం చౌరస్తా గులాబీ జెండాలు, బ్యానర్లు, తోరణాలతో శోభాయమానంగా మారింది. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలనుంచి కదలివచ్చిన వందలాది మంది కార్యకర్తలు జై బిఆర్ఎస్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మారుమోగాయి. ఈ సందర్భంగా కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ లు మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్యకర్తల ఉత్సాహమే పార్టీకి అసలైన బలమని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తామని, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనతో ధర్మపురి నియోజకవర్గ బిఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపే లక్ష్యం: కలెక్టర్

**ఆగస్టు 1 నుంచి కమాన్‌పూర్ నూతన తహసీల్దార్ కార్యాలయం నుంచి సేవలు ప్రారంభించాలి**

**ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్**



**పెద్దపల్లి (కమాన్‌పూర్) (రామగిరి)జూలై-21(వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ, పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములు, రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని, ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో అలవడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ బోధన, విద్యార్థుల హాజరు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. మాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం, మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 2026 ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి దశను కచ్చితత్వంతో అమలు చేయాలని ఆదేశించారు. పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములను పరిశీలించిన కలెక్టర్, భూ వివాదాల పరిష్కారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ (ల్యాండ్ సర్వే) ఆధ్వర్యంలో సమగ్ర భూ సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లేబర్ రూమ్, వ్యాక్సినేషన్ విభాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పనితీరును మెరుగుపరచడంతో పాటు ఓపీ సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఆరోగ్య సూచికలను నిర్దేశిత ప్రమాణాల మేరకు అమలు చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్టాప్ డయేరియా కార్యక్రమం, ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రామగిరి మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రామగిరి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, పారిశ్రామిక పార్కుకు సంబంధించిన ఫెన్సింగ్ పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కమాన్ పూర్ తహసీల్దార్ వాసంతి, రామగిరి తహసీల్దార్ సుమన్ ,ఎంపీడీఓ శైలజారాణి, ఈ ఈ పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ లు వరలక్ష్మి , జగదీశ్, రామగిరి , తదితర అధికారులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సమితి నూతన కార్యవర్గం ఎంపిక



**ధర్మపురి జులై 21(వుదయం ప్రతినిధి):**

భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ ధార్మిక సమితి ధర్మపురి పట్టణ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బిజెపి జిల్లా కో- కన్వీనర్ కలకోట రాజు ఆధ్వర్యంలో, పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఈ నూతన ఆధ్యాత్మిక కమిటీని ఎన్నుకున్నారు. విభాగ మహిళ కన్వీనర్ గా ముత్యపు రాధిక, విభాగ మహిళ కో-కన్వీనర్ మరియాల అనూష, పట్టణ కన్వీనర్ కొత్తపెల్లి కిషన్, పట్టణ కో-కన్వీనర్ దివిటీ శ్రీకాంత్, అసెంబ్లీ కన్వీనర్ పాత నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ, పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. భారతీయ జనతా పార్టీ ధార్మిక వ్యవహారాలలో మరింత ఉత్సాహంగా పని చేయడం కోసం, సనాతన ధర్మ రక్షణకై నిరంతరం పాటుపడడానికే ఈ సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కార్యదర్శి బెజ్జారపు లవన్, బీజేవైఎం నాయకులు మండలోజు సురజ్, కొత్తకొండ రాజు, ముత్యపు రమేష్, ముత్యపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ ను కలిసిన కవ్వంపల్లి



**కరీంనగర్ జులై 21 (వుదయం ప్రతినిధి):**

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, కార్మికులు, ఉపాధికి సంబంధించిన అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరగా, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# రాష్ట్రమంతా అక్రిడిటేషన్లు... రాజన్న సిరిసిల్లలో ఎందుకీ జాప్యం?

**ఇతర జిల్లాల్లో 70–80% కార్డులు జారీ...**

**ఇక్కడ 20% కూడా పూర్తి కాకపోవడంపై ఆగ్రహం**

**భారీ వర్షంలోను "చలో కలెక్టరేట్"తో జర్నలిస్టుల గర్జన**

**అర్హులందరికీ వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలని**

**'చలో కలెక్టరేట్'లో TUWJ-H143 హెచ్చరిక**




**రాజన్న సిరిసిల్ల, జూలై 21 (వుధయం ప్రతినిధి):**

రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం వరకు జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసిన ప్రభుత్వం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం కనీసం 20 శాతం కూడా పూర్తి చేయకపోవడం వెనుక కారణమేంటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ–H143) నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమంలో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు కలెక్టరేట్‌కు చేరుకుని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్లపై వివక్ష ఎందుకు..? ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా మాట్లాడుతూ, రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం అర్హులైన జర్నలిస్టులను నెలల తరబడి నిరీక్షింపజేయడం ఆందోళనకరమన్నారు. ఇతర జిల్లాల్లో దాదాపు 70–80 శాతం వరకు కార్డులు జారీ చేసిన అధికారులు, ఈ జిల్లాలో మాత్రం కనీసం 20 శాతం కూడా పూర్తి చేయకపోవడం వెనుక కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బస్సు పాస్ రెన్యువల్‌తో ఇబ్బందులు...అక్రిడిటేషన్ కార్డులు లేకపోవడంతో జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అధికారిక గుర్తింపు, ప్రయాణ సౌకర్యాలకు దూరమవుతున్నారని తెలిపారు. శాశ్వత అక్రిడిటేషన్ లేకపోవడంతో ఆరు నెలల్లోనే బస్సు పాస్‌ను పలుమార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యానికి మంచిది కాదు...ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులు తమ హక్కుల కోసం భారీ వర్షంలోనూ రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరణ....ధర్నా విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి అక్కడికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ధర్నా సందర్భంగా "జై తెలంగాణ.. జై జై తెలంగాణ", "జోహార్ తెలంగాణ జర్నలిస్టు అమరవీరులు", "వీ వాంట్ జస్టిస్", "అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి" అంటూ నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పరకాల ప్రవీణ్, రేగుల రాంప్రసాద్, రసూల్, సయ్యద్ అలీ, రాపల్లి సంతోష్, సిహెచ్ దేవరాజు, మల్లికార్జున్, కలీం, దేవేందర్, జిల్లా రమేష్, చౌటుపల్లి వెంకటేష్, రియాజ్ గోవిందు వేణు, బట్టు శ్రీనివాస్, ఫహద్, కంటాల విజయ్, పంపరి నాగరాజు, శ్రీకాంత్, రెడ్డి మల్ల సత్యనారాయణ పోతుల గాంధీ బాబు, జింక శ్రీధర్, వసీం, జనగామ రమేష్, పండుగ స్వామి, సలీం, జితేందర్, విష్ణు గంగాధర్, ఆసిమ్, నయిమ్, సదుమల్ల తిరుపతి, పరుపుల నారాయణ ప్రసాద్, సత్యం, రెడ్డి మల్ల నరసయ్య, కృష్ణ, అజర్, గడ్డం రవి, సంతోష్ తదితర పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 31 లోగా ఈ కేవైసీ పూర్తిచేయాలి.. తహసిల్దార్ రామ్మోహన్ రావు



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

బెజ్జూర్ మండలంలోని రేషన్ కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల ఈ కేవైసీ ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని తాసిల్దార్ రామ్మోహన్ రావు అన్నారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 లోగా ఈ కేవైసీ ప్రక్రియ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కేవైసీ పూర్తయినట్లయితే అనార్హుల పేర్లు తొలగించి, అర్హులైన వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీ బియ్యం సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ కేవైసీ ప్రక్రియ గడువులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. గడుపులోగా ఈ కేవైసీ పూర్తి చేయని వారికి భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి రాయితీ ప్రయోజనాలు అందేలా డీలర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

**నాణ్యతలో రాజీ లేకుండా ప్రజలకు అందుబాటులోకి తేవాలి**

**పంచాయతీరాజ్ అధికారులకు ప్రభుత్వ విప్ ఆది ఆదేశం**



**వేములవాడ, జూలై 21 (వుదయం ప్రతినిధి):**

వేములవాడ నియోజకవర్గంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ గ్రాంట్లు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, డీఎంఎఫ్‌టీ, ఈజీఎస్, సీఆర్ఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపడుతున్న పనుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు ఎక్కడ ఆలస్యమవుతున్నాయో గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడం ద్వారానే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, వేములవాడ డీఈ విష్ణువర్ధన్, చందుర్తి డీఈ పవన కుమారి, కోరుట్ల డీఈ సత్యనారాయణ, ఏఈలు మనోహర్, అంజయ్య, సాయితేజ, జగదీశ్, సుచరిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈత మొక్కలు నాటిన ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ



**కామారెడ్డి, జూలై 21 (వుదయం ప్రతినిధి):**

వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఈత మొక్కల నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలో ఈత చెట్ల పెంపకం గౌడ కుల వృత్తిదారుల జీవనోపాధికి ఎంతో ఉపయోగకరమని, ఈత మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ జీవనోపాధికి కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఎస్ అరుణ్ చంద్ర, సర్కిల్ ఇన్స్పెక్టర్ సంపత్ కృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్లు విక్రమ్ కుమార్, శ్రీనివాసరావు, ఏపీఓ అన్నపూర్ణ, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, ఫరీద్, కానిస్టేబుళ్లు ఘోరీ, రాజు, దినేష్, శరత్, పవన్, బాబు పాల్గొన్నారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ భీమయ్యల లక్ష్మీ రాజు, ఉప సర్పంచ్ లక్ష్మీ నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు ధర్మగోని కిషన్ గౌడ్, ట్రెజరర్ రాజేందర్ గౌడ్, సంఘ సభ్యులు శ్రీకాంత్ గౌడ్, రాజాగౌడ్, అంజాగౌడ్, శ్యామ గౌడ్, ప్రశాంత్ గౌడ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొని ఈతమొక్కలను నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అమ్మ నగర్ బ్రిడ్జి తో దూరభారం తగ్గుతుంది

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా...**

**నిజామాబాద్, వుదయం, జూలై 22:**



నూతన వంతెన నిర్మాణంతో నిజామాబాద్ రూరల్ - పట్టణం మధ్య దూరాభారం తగ్గుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని అమ్మ వెంచర్ సమీపంలో నిర్మించిన వంతెనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నగరంలోని 4వ డివిజన్ నుంచి 22వ డివిజన్ లోకి వెళ్లేందుకు బ్రిడ్జి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానంగా విద్యాలయాలను, మార్కెట్ కు, ఇతర పనుల నిమిత్తం వచ్చే వారికి దూరభారం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మేయర్ ఉమా రాణి, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, స్థానిక కార్పొరేటర్ వైష్ణవి సుధా, నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ తదితరులు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

**నిర్మల్ జిల్లా 21 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**




ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్చిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## జిల్లా గ్రంథాలయం నేడు అసంపూర్తి భవనంగా దర్శనం





- 4 ఏళ్లు గడిచిన పూర్తి కాకపోవడంతో ప్రశ్నార్థకంగా మారిన విద్యార్థుల భవిష్యత్తు

నారాయణపేట జూలై 21 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగట్ట సమీపంలో గత ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కింద రూ.2 కోట్ల అంచనా వ్యయంతో 2022 మే 9న జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు జ్ఞాన కేంద్రాన్ని అందిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. కోట్ల రూపాయల ప్రజాధనం గోడలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.జిల్లా కేంద్రంలోనే సుమారు 15 వేల మంది విద్యార్థులు గ్రూప్స్, డీఎస్సీ, పోలీస్, బ్యాంకింగ్, పీజీ, బీఈడీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కానీ చదువుకునేందుకు సరైన గ్రంథాలయం లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ, పీడీఎస్‌యు,సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఖరీదైన పుస్తకాలు కొనలేక, ప్రైవేట్ లైబ్రరీలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లే స్థోమత లేక చదువుకు దూరమవుతున్నారని, కొందరు జీవనోపాధి కోసం చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ తమ లక్ష్యాలను వదులుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇదిలా ఉండగా నిర్మాణంలో నాణ్యత లోపాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ పనులు ఎందుకు నిలిచిపోయాయి...? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా...? లేక సంబంధిత అధికారుల అలసత్వమా...? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రజలకు అందుబాటులో లేరనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్లుగా ఈ పనులపై బాధ్యత ఎవరు తీసుకుంటారు...? ప్రజలకు సమాధానం చెప్పేది ఎవరు...? అని విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి... నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేసి... ఆధునిక గ్రంథాలయాన్ని విద్యార్థులకు అంకితం చేయాలని, లేకపోతే విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని విద్యార్థి సంఘ నాయకులు నాయకులు హెచ్చరిస్తున్నారు.



## లింగాయత భవన్‌కు కేటాయించిన భూమిలో ఆక్రమణలు తొలగించాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వీరశైవ లింగాయత సమాజం వినతిపత్రం
- ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూమిని సమాజానికి అప్పగించాలని విజ్ఞప్తి

సంగారెడ్డి (వుదయం):

వీరశైవ లింగాయత సమాజానికి లింగాయత భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం సంబంధిత భూమిని సమాజానికి అప్పగించాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత సమాజం ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు ఆధ్వర్యంలో జిల్లా నాయకులు, వివిధ మండలాల ప్రతినిధులు, సమాజ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా సమాజ ప్రతినిధులు మాట్లాడుతూ, వీరశైవ లింగాయత సమాజ ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం లింగాయత భవన్ నిర్మించేందుకు ప్రభుత్వం భూమిని కేటాయించిందని తెలిపారు. అయితే,

**లింగాయత భవన్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలి**

జిల్లాలోని వీరశైవ లింగాయత సమాజ సభ్యులకు ఉపయోగపడే విధంగా లింగాయత భవన్‌ను నిర్మించాలన్నది సమాజ ప్రజల చిరకాల ఆకాంక్ష అని ప్రతినిధులు పేర్కొన్నారు. భవన్ నిర్మాణం జరిగితే సామాజిక సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.


**సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్**

వీరశైవ లింగాయత సమాజ ప్రతినిధుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ రికార్డులు, భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించి నిబంధనలు, చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాజ ప్రతినిధులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు, జిల్లా నాయకులు, వివిధ మండలాల ప్రతినిధులు, వీరశైవ లింగాయత సమాజ సభ్యులు పాల్గొన్నారు.

## మై భారత్' పోర్టల్‌లో యువత వివరాలు నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె. హేమావతి
- జిల్లా సలహా కమిటీ సభ్యులతో జూమ్ సమావేశం
- జూలై 1 నుండి ఆగస్టు 15 వరకు ప్రత్యేక అవగాహన డ్రైవ్

సిద్దిపేట, జూలై 21 (వుదయం బ్యూరో)



జిల్లాలోని యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడంతో పాటు వివిధ జాతీయ, రాష్ట్రస్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవల్లో భాగస్వామ్యమయ్యేందుకు 'మై భారత్' పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి పిలుపునిచ్చారు. 'మై భారత్' పోర్టల్ నమోదు డ్రైవ్‌కు సంబంధించి జిల్లా సలహా కమిటీ సభ్యులతో మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మై భారత్ పోర్టల్ నమోదు లక్ష్యాలను వేగంగా సాధించేందుకు మండల, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న 'మై భారత్ ఇంటెన్సివ్ నమోదు మరియు అవగాహన డ్రైవ్' జూలై 1న ప్రారంభమై ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, క్రీడాకారులు, యువజన సంఘాలను ఇందులో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా యువతకు నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు స్వచ్ఛంద సేవలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందే వేదిక లభిస్తుందన్నారు. ఈ జూమ్ సమావేశంలో మై భారత్ జిల్లా కార్యక్రమాధికారి రంజిత్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పల్లెల్లో వెల్లివిరిసిన 'హరిత చైతన్యం'

- జిల్లెడబండలో మొక్కల పంపిణీ సూపర్ హిట్!
- భావితరాల బాగుకోసం ఇంటింటికీ మొక్క... విత్తనమే రేపటి వృక్షం!
- పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ : సర్పంచ్ నాగేష్ నాయుడు
- హోరెత్తిన మైదానాలు... నీడనిచ్చే నేస్తాలను పోటీపడి తీసుకెళ్లిన జనం

గద్వాల ,జూలై 21 (వుదయం బ్యూరో):



కాలుష్య కోరల్లో చిక్కుకున్న అవనిని కాపాడుకునేందుకు, పల్లె సీమలకు పచ్చని తోరణం కట్టేందుకు జిల్లెడబండ గ్రామపంచాయతీ వేసిన తొలి అడుగు మహా ఉద్యమంగా మారింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తలపెట్టిన "ప్రతి ఇంటికీ ఒక మొక్క" పంపిణీ కార్యక్రమం పల్లెల్లో సరికొత్త హరిత విప్లవాన్ని ఆవిష్కరించింది. జిల్లెడబండతో పాటు పొరుగు గ్రామమైన మర్లపల్లి ప్రజలు పచ్చదనం పరిరక్షణే ధ్యేయంగా కదలిరావడంతో ఈ కార్యక్రమం అపూర్వ ప్రజాదరణ పొందింది.

**నీడనిచ్చే నేస్తం... జీవన ప్రదాత!**

మానవాళికి స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించే పచ్చని చెట్లే అసలైన ఊపిరితిత్తులని, నేడు నాటే ఒక్కో మొక్క భావితరాల ఆరోగ్యకరమైన జీవనానికి బంగారు పునాదిగా మారుతుందని సర్పంచ్ డి. నాగేష్ నాయుడు ఉద్ఘాటించారు. "ఒక ఇంటికి ఒక మొక్క - పచ్చని గ్రామం మన లక్ష్యం" అనే నినాదంతో సాగిన ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్క నాటడంతో బాధ్యత తీరిపోలేదని, దాన్ని మహా వృక్షంగా మలిచే వరకు ప్రణవాయువులా కాపాడుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక ధర్మమని స్పష్టం చేశారు.

**అడుగడుగునా ఉత్సాహం... హరిత శోభితం!**

పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ మొక్కలను అందజేయగా, గ్రామస్తులు ఎంతో ఆత్మీయంగా వాటిని స్వీకరించి తమ గృహ ప్రాంగణాల్లో నాటేందుకు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమతి ఈ. కవిత, వార్డు సభ్యురాలు శ్రీమతి జయమ్మ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు రెండు గ్రామాల పల్లెవాసులు పెద్దయెత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## మొక్కజొన్న సాగుతో రైతులకు ఆర్థిక పురోగతి

సిద్దిపేట/జగదేవ్‌పూర్, జులై 21 (వుదయం ప్రతినిధి):



దేశంలో మొక్కజొన్న ప్రస్తుతం వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన వాణిజ్య పంటగా అవతరించిందని, ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఆలీరాజ్‌పేట్ గ్రామంలో భారతీయ మొక్కజొన్న పరిశోధన సంస్థ (ICARIIMR) ఆధ్వర్యంలో "ఇథనాల్ పరిశ్రమల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో మొక్కజొన్న ఉత్పత్తి పెంపుదల" ప్రాజెక్టు కింద రైతులకు అవగాహన సదస్సు మరియు ఇన్‌పుట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులకు 25 ఎకరాల సాగుకు సరిపడా NK6802, DKC 9144 రకాల హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలతో పాటు బయో జింక్, బయో NPK జీవ ఎరువులు, కలుపు నివారణ మందు Carlos X Tra, పురుగుల నివారణ మందు Spinetoram లను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి 30% ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలనే లక్ష్యంతో ఉందని, అందులో భాగంగానే దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలలోని 78 జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న ఆధారిత ఇథనాల్‌ను పెట్రోల్‌తో కలపడం వల్ల హరితగృహ వాయు ఉద్గారాలు తగ్గడమే కాకుండా, విదేశీ ఇంధన దిగుమతి వ్యయం గణనీయంగా ఆదా అవుతుందని వివరించారు. అంతేకాకుండా పౌల్ట్రీ రంగానికి కూడా మొక్కజొన్న ప్రధాన మేతగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రైతులు పంట మార్కెటింగ్, పురుగుల యాజమాన్యం మరియు ఎరువుల వినియోగంపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతులకు నిరంతరం సాంకేతిక సహకారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ICARIIMR ప్రధాన శాస్త్రవేత్త డా. ఎన్. సునీల్, యంగ్ ప్రొఫెషనల్ ఎం. కిశోర్ కుమార్, పయనీర్ కంపెనీ మేనేజర్ చిరంజీవి, ఎంఏవో వసంత్ రావు, సర్పంచ్ ఎల్లేష్, ఏఈవో శరణ్య, PJTAU అగ్రికల్చర్ విద్యార్థులు మరియు 30 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ కృషి

పటాన్‌చెరు, జూలై 21,వు దయం:



:సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీ, బచ్చుగూడ ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, బెల్టులు, టైలు, షూలు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని అందజేశారు.కార్యక్రమంలో మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గత ఐదేళ్లుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు వాటిని ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

గత ఐదేళ్లుగా తాము సేవలందిస్తున్న పాఠశాలల్లో అనేక మార్పులు వచ్చాయని, ఇలాంటి సానుకూల మార్పులు రావాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో తమ పిల్లలను చేర్పిస్తున్నారని, ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యా, క్రీడా సామగ్రిని అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరఫున మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడ్వాన్ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బచ్చుగూడ గ్రామ కౌన్సిలర్ సరిత బుజంగారెడ్డి, రామేశ్వరం బండ కౌన్సిలర్ అంతిరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పార్కర్ కోఆర్డినేటర్ హఫీజ్, ఆమదాయ్య కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## పటేల్‌గూడ–కిష్టారెడ్డిపేట్ కాలనీల సమస్యలు పరిష్కరించాలి

- జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ వినతిపత్రం
- బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీలో బహుళ అంతస్తుల నిర్మాణంపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి

అమీన్‌పూర్ (వుదయం):



పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట్ గ్రామాల పరిధిలో ఉన్న వివిధ కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

**బహుళ అంతస్తుల నిర్మాణంపై అభ్యంతరం**

బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీలోని రోడ్ నంబర్-11లో చేపట్టేందుకు ప్రయత్నిస్తున్న బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణంపై బీహెచ్ఈఎల్ మెట్రో సొసైటీ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు, సంబంధిత శాఖల ఆమోదాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, విచారణ పూర్తయ్యే వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీ ప్రధానంగా వ్యక్తిగత నివాస గృహాలతో ఏర్పడిన ప్రాంతమని, ఇక్కడ బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణం జరిగితే భవిష్యత్తులో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ, తాగునీటి సరఫరాపై అదనపు భారం పడే అవకాశం ఉందని సొసైటీ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఇందిరమ్మ కాలనీ 12వ చౌరస్తా నుంచి బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీ వరకు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఈర్ల రాజు ముదిరాజ్ కోరారు. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ వివిధ కాలనీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సరైన వెలుతురు లేకపోవడంతో రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీధి దీపాల ఏర్పాటును ప్రాధాన్యతగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.డ్రైనేజీ, రోడ్ల సమస్యలకూ పరిష్కారం చూపాలిఅదే విధంగా బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీలో ప్రతిపాదిత అపార్ట్‌మెంట్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధమైన అంశాలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపినట్లు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఈర్ల రాజు ముదిరాజ్**

ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధి, ప్రజల భద్రత, మౌలిక వసతుల కల్పన కోసం అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పనిచేస్తామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీహెచ్ఈఎల్ మెట్రో సొసైటీ అధ్యక్షుడు నరసింహులు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు వినయ్ భాస్కర్ గౌడ్, కార్యదర్శి నరేందర్ రెడ్డి, కోశాధికారి శ్రీను, డైరెక్టర్లు మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాఘవేంద్ర, శంకర్, కాలనీ నాయకులు ప్రమోద్, ధర్మసింగ్, బీజేపీ నాయకులు వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై రాజీపడొద్దు

వనపర్తి, జులై 21 (వుదయం ప్రతినిధి):



జిల్లాలో రహదారి భద్రతను మరింత సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

మంగళవారం రాష్ట్ర రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లాల్లో రహదారి భద్రతకు సంబంధించిన చర్యలు, సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.

వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారులు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రోడ్లు & భవనాల శాఖ, పోలీసు శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) సమన్వయంతో రహదారి భద్రతా చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు.

జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు. ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల అమలుపై రేపటిలోగా పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రహదారులపై అక్రమ ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ నిషేధిత ప్రాంతాల అమలు, రోడ్డు భద్రతా తనిఖీలు, సమర్థవంతమైన పహారా, తదితర అంశాలపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లా హైవేస్ టాస్క్‌ఫోర్స్ను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసి, అక్రమ ఆక్రమణల జాబితాను సిద్ధం చేసి తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో రోడ్లు & భవనాల శాఖ ఈఈ పరిమళ, డిటిఓ సురేష్,తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- లయన్ రాధాకృష్ణ

నాగర్ కర్నూల్, జూలై 21 (వుదయం బ్యూరో):

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేసే సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని మాజీ గవర్నర్ లయన్ రాధాకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డి. అమరేందర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దేశి ఇటిక్యాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ... "ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి. లయన్స్ వంటి స్వచ్ఛంద సంస్థలు విద్యారంగానికి చేస్తున్న సహాయం అభినందనీయం" అని పేర్కొన్నారు.అధ్యక్షులు అమరేందర్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని 105 మంది విద్యార్థులకు రూ.22 వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు పంపిణీ చేశారు. సంవత్సరం మొత్తానికి సరిపడా స్టేషనరీ అందించడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఈ పాఠశాలలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షులు దొడ్ల ఈశ్వర్ రెడ్డి, వెంకట రాజ, రాజవర్ధన్ రెడ్డి, పోల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయిని మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి



- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జులై 21 (వుదయం బ్యూరో):

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, బి. మనోహర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు దయానంద్, HMWSSB మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పని చేయాలని సూచించారు. సంభావ్య వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కంటింజెన్సీ ప్లాన్లను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, అవసరమైన విత్తనాల సరఫరా, తాగునీటి ఏర్పాట్లు, పశువులకు మేత, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అనావృష్టి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని, అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.సమిష్టిగా నిలబడి ఎల్‌నినోను ఎదుర్కొందాం, రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం - అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలని తెలిపారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.

## మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



- శ్రీనిధి రుణాల రికవరీ అక్టోబర్ నాటికి 100% పూర్తి కావాలి
- నిధులు దుర్వినియోగం చేసిన వివో ఏ లను వారం రోజుల్లో టర్మినేట్ చేస్తాం
- ఈ-కామర్స్ రంగంలోకి స్వయం సహాయక సంఘాలు – స్థలాలు కేటాయింపుకు సిద్ధం

సిద్దిపేట, జూలై 21 (వుదయం బ్యూరో):



మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని భావి భారత వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జిల్లా కలెక్టర్ కె. హేమావతి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐకేపీ, శ్రీనిధి, మెప్మా అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి శ్రీనిధి రుణాలు గొప్ప వేదికగా నిలుస్తున్నాయని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలో రుణాల రికవరీ మందగించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి రుణాల రికవరీని అక్టోబర్ చివరి నాటికి 100% పూర్తి చేయాలి. రికవరీలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవు. శ్రీనిధి నిధులను పక్కదారి పట్టించిన (మిస్ యూజ్) వీఓఏ లు వారం రోజుల్లోగా ఆ మొత్తాన్ని చెల్లించకపోతే ఉద్యోగాల నుంచి తక్షణమే టర్మినేట్ చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు.మహిళా సంఘాలు డిజిటల్ యుగానికి అనుగుణంగా ఈకామర్స్ రంగంలోకి ప్రవేశించాలని సూచించారు. జిల్లాకు కేటాయించిన 125 పీఎం 'సూర్య ఘర్ సోలార్' యూనిట్లకు త్వరితగతిన లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు, కేటాయించిన ఈబైకులు, ఈఆటోలను మహిళలకు వెంటనే అందజేయాలన్నారు. 'వివిజి రామ్ జీ' పథకం ద్వారా పొలాల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకుని లాభదాయకమైన చేపల పెంపకం చేపడుతూ అదనపు ఆదాయం పొందేలా మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, అడిషనల్ డిఆర్డిఓ సుధీర్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, రెడ్కో జిల్లా మేనేజర్ రవీందర్ చౌహాన్, శ్రీనిధి ఆర్ఎం మోహన్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఈసీ సభ్యులు, ఏపీఎంలు, శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

# పేదోడి కడుపు కొట్టి...'రైస్ మాఫియా'

- గద్వాల 'సీఎంఆర్'లో రూ. వందల కోట్ల ప్రజాధనం స్వాహా!
- 10 రూపాయిల రేషన్ బియ్యానికి రసాయనాల మెరుపులు... ఎఫ్‌సీఐకే నకిలీ 'సీఎంఆర్' టోకరా!
- ముడుపుల మత్తులో 'సివిల్ సప్లై' అధికారులు... చిన్న డ్రైవర్లపైనే ప్రతాపం, మిల్లర్ల తిమింగలాలకు రాజభోగం?
- ప్రభుత్వ ఖజానాకు కన్నం పడుతున్నా నిద్రమత్తు వీడని పౌరసరఫరాల శాఖ!

గద్వాల జూలై 21 (వుదయం బ్యూరో)

నిరుపేదవాడి ఆకలి కేకలు తీర్చాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ పేదిన... కొందరు రక్తపిపాసి 'రైస్ మాఫియా' చేతిలో బలిపీఠంపై నిలుస్తోంది! పేదల నోటికాడి కూటిని లాక్కుంటూ, ప్రభుత్వ ఖజానాను పగటిపూటే లూటీ చేస్తూ గద్వాల జిల్లా కేంద్రంగా సాగుతున్న 'కస్టమ్ మిల్డ్ రైస్' సీఎంఆర్ రీసైక్లింగ్ దందా అన్ని హద్దులూ దాటేసింది. రూ. వందల కోట్ల ప్రజాధనం కళ్లముందే పక్కదారి పడుతున్నా... మిల్లర్ల ముడుపుల మాయాజాలం ముందు పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ యంత్రాంగం నిస్సిగ్గుగా దండం పెట్టి దొంగనిద్ర నటిస్తుండటం ప్రజా రక్తాన్ని మండిస్తోంది!

**అసలు దందా ఇదిగో... బరితెగించిన రాబందుల దోపిడీ!**

ప్రభుత్వం సేకరించిన కోట్లాది రూపాయల ధాన్యాన్ని నిబంధనల ప్రకారం మిల్లింగ్ చేసి, నాణ్యమైన బియ్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎఫ్ సిఐ గోదాములకు అప్పగించాల్సింది పోయి... మిల్లర్లు సాగిస్తున్న దోపిడీ క్రీడ తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోంది: గ్రామాల్లో రేషన్ లూటీ: దళారుల ముసుగులో గ్రామాల్లోకి దింపి, నిరుపేదల నుంచి కిలో కేవలం ₹10 నుంచి ₹12లకే దొంగతనంగా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు.

ఎఫ్‌సీఐకే నకిలీ సీఎంఆర్: ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ కోటా కింద ఈ పనికిరాని, కెమికల్ పాలిష్ పట్టిన పాత రేషన్ బియ్యాన్నే ఎఫ్‌సీఐ గోదాముల్లోకి యథేచ్ఛగా కుక్కేస్తున్నారు. అసలు బియ్యం 'పక్క రాష్ట్రాలకు' స్మగ్లింగ్: ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం ద్వారా వచ్చిన నాణ్యమైన ఒరిజినల్ సీఎంఆర్ బియ్యాన్ని మాత్రం కర్ణాటక, మహారాష్ట్ర బహిరంగ మార్కెట్లలో క్వింటా రూ. 3,500 నుంచి రూ. 4,000 కి తెగనమ్మి కోట్లకు కోట్లు సొమ్ముచేస్తున్నారు!

**అసలు రహస్యమిదే:**

రూపాయి పెట్టుబడి లేకుండా... ఒకే బియ్యంతో రెండు వైపులా వందల కోట్ల అక్రమ లాభాలు గడిస్తున్న ఈ అక్రమార్కుల ముందర చట్టం, సర్కారు యంత్రాంగం పూర్తిగా మోకరిల్లాయనడానికి ఈ దందాయే నగ్న సత్యం!

**మామూళ్ల మత్తులో యంత్రాంగం... ఉడతల పైనే ప్రతాపమా?**

ఈ కోట్లాది రూపాయల కుంభకోణం ఏదో అర్థరాత్రి దొంగతనంగా జరగడం లేదు. కళ్లముందే లారీ కొద్దీ రేషన్ బియ్యం మిల్లుల్లోకి వెళ్తున్నా, సరిహద్దు దాటుతున్నా సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు తమ కళ్లకు గంతలు కట్టుకుని



వ్యవహరిస్తున్నారు. మరి ఈ వందల కోట్ల దోపిడీ వెనుకున్న రైస్ మిల్లుల తిమింగలాల 'గుమ్మం' తొక్కడానికి అధికారులకు కాళ్లు ఎందుకు వణుకుతున్నాయి? నెలనెలా అందాల్సిన భారీ 'మామూళ్లు' మూటల రూపంలో సకాలంలో చేరుతుండటంతో ఈ రాబందుల ముసుగు తొలగించడం లేదనే ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి!

**పౌరసరఫరాల శాఖను కడిగిపారేస్తున్న పదునైన ప్రశ్నలు!**

కరెంట్ బిల్లుల ఆడిట్ ఏది?: ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ అవ్వకుండానే ఎఫ్‌సీఐకి వేల టన్నుల బియ్యం ఎలా వస్తున్నాయి? మిల్లుల విద్యుత్ వినియోగాన్ని బట్టి అసలు మిల్లింగ్ జరిగిందో లేదో ఎందుకు తనిఖీ చేయడం లేదు? ఫోరెన్సిక్ క్వాలిటీ టెస్టులేవి?: ఎఫ్‌సీఐ లోడ్ తీసుకునే ముందు సదరు బియ్యం కొత్తవా? లేక పాలిష్ పట్టిన పాత రేషన్ బియ్యమా? అని నిర్ధారించే క్వాలిటీ టెస్టులు ఎందుకు చేయడం లేదు? పీడీ యాక్ట్ ఏమైంది?: పేదల కడుపు కొడుతున్న అక్రమ మిల్లర్ల లైసెన్సులు రద్దు చేసి, వారిని జైలుకు పంపించి 'పీడీ యాక్ట్' కింద కేసులు నమోదు చేయడానికి ప్రభుత్వానికి వస్తున్న అభ్యంతరమేంటి? బీఆర్ఎస్ నాయకుడు ఆల్వాల్ పాదం గోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లుగా... పేదవాడి ఆకలిని సొమ్ము చేసుకుంటున్న ఈ 'బియ్యం రాబందుల' ఆట తక్షణమే కట్టించకపోతే... ప్రభుత్వ ఖజానాతో పాటు, ప్రజా పంపిణీ వ్యవస్థ నమ్మకమే పూర్తిగా మట్టికొట్టుకు పోయే ప్రమాదముంది! ఇప్పటికైనా ఈ దోపిడీపై పాలకులు నోరు విప్పుతారా? లేక ముడుపుల మత్తులోనే నిద్రపోతారా?



## బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రివర్యులు కొండా సురేఖ గారు

హైదరాబాద్, జూలై 20(వుదయం): కూతురు సుస్మిత పటేల్‌తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు ముఖ్యమంత్రి సతీమణి శ్రీమతి గీతా రెడ్డి గారితో కలిసి అమ్మవారి కళ్యాణోత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మంత్రి సురేఖదేవాదాయశాఖ చేపట్టిన వరుణ యాగాలు దైవానుగ్రహానికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్న మంత్రిఅమ్మవారి దయతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేసిన మంత్రి రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి చెందాలని కోరిన మంత్రి సురేఖహైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ తన కూతురు సుస్మిత పటేల్‌తో కలిసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి గీతా రెడ్డి గారిని మంత్రి కొండా సురేఖ గారు మర్యాదపూర్వకంగా కలుసుకుని బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, బల్కంపేట అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి ప్రభుత్వం కట్టుదిట్టంగా చేసిన ఏర్పాట్ల మధ్య అమ్మవారిని సంతోషంగా దర్శించుకుంటున్నారని అన్నారు. నా కూతురు సుస్మితపటేల్ తో కలిసి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజలతో అమ్మవార్ల అనుగ్రహం లభించి తెలంగాణపై వరుణ దేవుడు కరుణతో వర్షాలు కురుస్తున్నాయని భావిస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రతి కుటుంబంలో సుఖ శాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రి కొండా సురేఖ అమ్మవారిని ప్రార్థించారు. బల్కంపేట ఆలయ వైభవాన్ని అందించేందుకు దేవాదాయ శాఖ కట్టుబడి ఉందని మంత్రి సురేఖ తెలిపారు.




శ్రీశ్రీశ్రీ బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.. అమ్మవారి అపార కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను..

– శ్రీ వి. నవీన్ యాదవ్ గారు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు..

## మెదక్ జిల్లాలో పర్యటించిన నటుడు విష్ణు మంచు

మెదక్, తెలంగాణ:

ప్రముఖ నటుడు విష్ణు మంచు, మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమా సింగ్ గారి ఆహ్వానం మేరకు మెదక్ జిల్లాలో ఒకరోజు పర్యటించారు. చారిత్రక, సాంస్కృతిక వారసత్వంపై ప్రత్యేక ఆసక్తి కలిగిన ఆయన, జిల్లాలోని పలు ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విష్ణు మంచు చారిత్రక ప్రాధాన్యం కలిగిన మెదక్ కోట, ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గాభవాని ఆలయం, ప్రపంచ ప్రసిద్ధి చెందిన మెదక్ కేథడ్రల్‌ను సందర్శించారు. అక్కడి చరిత్ర, సంస్కృతి, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అధికారులతో పలు అంశాలపై చర్చించారు.



అనంతరం మీడియాతో మాట్లాడిన విష్ణు మంచు, మెదక్ జిల్లాకు అపారమైన పర్యాటక, సినీ చిత్రీకరణ అవకాశాలు ఉన్నాయని అన్నారు. "మెదక్‌లోని కోటలు, అడవులు, సరస్సులు, దేవాలయాలు, అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు సినిమాల చిత్రీకరణకు అత్యంత అనువైన ప్రదేశాలు. భవిష్యత్తులో నా సినిమాల చిత్రీకరణను ఇక్కడ నిర్వహించేందుకు తప్పకుండా ప్రణాళికలు రూపొందిస్తాను" అని తెలిపారు.

మెదక్ వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక పటంలో ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు చేపట్టే కార్యక్రమాలకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని విష్ణు మంచు హామీ ఇచ్చారు.

అంతేకాకుండా ప్రజలను ఉద్దేశించి, "ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం ఒక్కసారైనా మెదక్‌ను సందర్శించండి. ఇక్కడి చరిత్రను తెలుసుకోండి... ప్రకృతి అందాలను ఆస్వాదించండి... మన గొప్ప వారసత్వాన్ని అనుభవించండి" అంటూ పిలుపునిచ్చారు. మెదక్‌ను తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమా సింగ్ గారు, జిల్లా పర్యాటక శాఖ అధికారులు చేస్తున్న కృషిని విష్ణు మంచు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి
- అంగరంగ వైభవంగా యాగ మహోత్సవం

కల్వకుర్తి, జూలై 21 (వుదయం):



ప్రపంచ మానవాళి సుఖశాంతులతో జీవించడం తో పాటు సమృద్ధిగా వర్షాలు కురిసి దేశ రైతులందరూ అష్టైశ్వర్యాలతో జీవించాలని సంకల్పంతో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్ర 91వ విశ్వశాంతి మహాయాగం ఎంతో గొప్పదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న ఆయుత చండీ అతి రుద్ర మహా యాగం కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధ్వజ సంభ ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ యాగం నిర్వహించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులలో రాష్ట్రంలోని రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ ఇబ్బందులు తొలిగేవిధంగా యాగం ఫలించి భారీ వర్షాలు కురిసి రైతులందరూ పంటలు సమృద్ధిగా పండించుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని గోలి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ కృష్ణ చైతన్య పరిశుద్ధానంద స్వామి మాట్లాడుతూ యాగఫలం అందరికి అందుతుందన్నారు. ఆగస్టు 3 వరకు యాగ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. అంగరంగ వైభవంగా యాగ మహోత్సవం అంగరంగ వైభవోపేతంగా యాగ మహోత్సవం నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీ ఆంజనేయ మన్యు పాశుపత హోమాలు చండీ హోమం పూజ గ్రహ హోమం నిర్వహించారు. సాయంత్రం అభయాంజనేయ స్వామికి లక్ష తమల పాకుల అర్చన, సింధూర అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించలేని సంఘాలు ఎందుకు...?




వికారాబాద్, జులై 21 (వుదయం బ్యూరో):

దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే సంఘాలకు ఇప్పుడు సొంత సభ్యుల నుంచే ఊహించని ప్రతిఘటన ఎదురవుతోంది. మీ సంఘాలు మాకొద్దు.. మీ సభ్యత్వం మాకొద్దు అంటూ కొంతమంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బాహాటంగానే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. ఇకపై ఏ సంఘానికి వార్షిక సభ్యత్వ రుసుం చెల్లించబో మంటూ పాఠశాలల వారీగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తుండటం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రంలో దాదాపు 1.10 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులున్నారు. వీరంతా పీఆర్టీయూ, యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, డీటీఎఫ్ వంటి వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఏటా ఈ సంఘాలకు సభ్యత్వ రుసుము చెల్లిస్తూనే ఉన్నారు. కొంతకాలంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ఈ సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**టీచర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇవే...**

సుమారు ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిసాధించడంలో సంఘాలు ఎందుకు వెనకబడి ఉన్నాయని ప్రశ్నిస్తున్నారు.

**2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ పొడిగింపు**

రాష్ట్రంలో డీఎస్సీ2008 సెకండరీ గ్రేడ్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న 1,181 మంది సర్వీసులను మరో ఏడాది పాటు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పొడిగింపు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కాంట్రాక్ట్ ఉపా ధ్యాయుల వేతనాల కోసం ప్రభుత్వం రూ. 21,99,49,440బడ్జెట్ను విడుదల చేసిందని, వీరికి నెలకు రూ. 31,040 చొప్పున గౌరవవేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పొడిగింపునకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కొన్ని ముఖ్యమైన నిబంధనలను విధించింది. అభ్యర్థులతో కొత్తగా ఒప్పంద పత్రాలు రాసుకోవాలని, వేతనాలు ఐఎఫ్ఎంఐఎస్ డీబీటీ ద్వారానే చెల్లించాలని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకూడదని, ఖాళీల్లో కొత్త నియామకాలు చేపట్టకూడదని నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు ఈ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ఆదేశించారు.

## నీటి గండం... ఆరుతడే దండం!

- రైతన్నకు నష్టం రావొద్దు... సీరియస్ అయిన కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఈ నెల 22, 23న ఊరూరా కదిలొస్తున్న యంత్రాంగం!

గద్వాల, జూలై 21 (వుదయం బ్యూరో):



ఎల్ నినో ఎఫెక్ట్‌తో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులకు నష్టం కలగకుండా పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. "రైతు నష్టపోవడానికి వీల్లేదు... అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలు వేసేలా వారిలో నమ్మకాన్ని నింపండి" అని అధికారులకు తేల్చి చెప్పారు. ఉచితంగా ఇచ్చిన కూరగాయల విత్తనాలను ప్రతీ రైతు వినియోగించుకునేలా చూడాలని, ఆయిల్ పామ్ సాగును ఉధృతంగా విస్తరించాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మురికి కూపాలుగా మారకుండా పారిశుధ్యం పటిష్టం చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## బడిపై 'కలెక్టర్' మార్క్!

- రేకులపల్లి బడిలో అదనపు కలెక్టర్ రచ్చబండ.. ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం
- విద్యార్థుల నైపుణ్యాలకు పరీక్ష.. వెనుకబడితే ఉపాధ్యాయులదే బాధ్యత
- అభివృద్ధి పనుల్లో నాణ్యత మారితే చర్యలు తప్పవు!

గద్వాల, జూలై 21 (వుదయం బ్యూరో):

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యే ధ్యేయంగా జిల్లా పాలనా యంత్రాంగం చర్యలు తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా గద్వాల మండలం రేకులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ నర్సింగరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి కలకలం రేపారు. తరగతి గదుల్లోకి అడుగుపెట్టిన ఆయన, విద్యార్థుల పఠన, రచన, గణిత నైపుణ్యాలను స్వయంగా పరీక్షించి విద్యా ప్రమాణాల స్థాయిని ఒలికిపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల తీరుపై స్పందిస్తూ... విద్యార్థుల అభ్యసన స్థాయిలో నాణ్యత కొరవడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర వికాసానికి కృషి చేయాలన్నారు. కేవలం



మార్కులే కాకుండా నైతిక విలువలు, వ్యక్తిగత పరిశుభ్రత అలవరచాలన్నారు. బడిలో విద్యార్థులు, టీచర్ల హాజరు 100 శాతం ఉండాల్సిందేనని ఆజ్ఞాపించారు. మధ్యాహ్న భోజన నాణ్యతలో లోపాలు ఉండకూడదన్నారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ సోక్‌పిట్, వీఓఏ భవన నిర్మాణాలను పరిశీలించిన ఆయన, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## మృతురాలి కుటుంబానికి యువ స్టార్ యూత్ అసోసియేషన్ ఆర్థిక సాయం

- రూ.9 వేల నగదు అందజేసి పరామర్శించిన మిత్రులు

దౌల్తాబాద్, జూలై 21 (వుదయం):

రాయపోల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి చింతకింది మహేష్ మాతృమూర్తి చింతకింది యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. యువ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహేష్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.9 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టసమయంలో మిత్రులు కుటుంబానికి తోడుగా నిలవడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఆర్థిక సహాయం అందించిన మిత్రులకు చింతకింది మహేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంగరి మహేష్, చింతకింది మహేష్, గౌరీగారి స్వామి, చెప్పాల చక్రి, తోడేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- నిర్మాణ పనుల జాప్యంపై సీఎం అసంతృప్తి.
- అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక

వికారాబాద్, జూలై 21; (వుదయం జిల్లా ప్రతినిధి):



కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎడ్యుకేషన్ హబ్‌లో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా తనకు అందజేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను అవసరమైతే సస్పెండ్ చేయడానికీ వెనుకాడవద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన నివాస ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై కూడా ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులందరికీ వచ్చే వారంలోపు ప్లాట్ల పట్టాలు అందజేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రాజెక్టు సహా ఎడ్యుకేషన్ హబ్‌లోని అన్ని పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి నిర్ణీత గడువు లో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. "కడ" సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పరిశీలన మరియు సమీక్ష లో పరిగి, తాండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి రాష్ట్ర పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియ, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విప్పి గౌతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టికే శ్రీదేవి, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్ మెంట్ సెక్రటరీ శ్రీధర్, టీజీఐఐసి బీసీ మరియు ఎండి శశాంక, "కడా" ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి రాష్ట్ర స్థాయి ఇంజనీర్ ఇన్ చీఫ్ లు, సంబంధిత శాఖాధికారులు తదితరులున్నారు.

## చిన్నారులకు నందమూరి జానకిరామ్ ట్రస్ట్ సేవా చేయూత

హైదరాబాద్, జూలై 20(వుదయం):



పిల్లల చిరునవ్వే సమాజానికి నిజమైన సంపద "అనే గొప్ప భావనతో, కొండకల్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల కోసం నందమూరి జానకిరామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించబడింది. అంగన్వాడి టీచర్ల విజ్ఞప్తి మేరకు చిన్నారుల సౌకర్యార్థం కుర్చీలు అందజేయడంతో పాటు, వారి ఆరోగ్యం, ఆనందాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రేమతో చిరు కానుకగా డ్రై ఫ్రూట్స్ కూడా పంపిణీ చేయడం జరిగింది. పిల్లలు దైవ స్వరూపులు..వారి చిరునవ్వుల్లోనే దేవుడి ఆశీర్వాదం కనిపిస్తుంది. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే వారికి మెరుగైన విద్య, మంచి ఆరోగ్యం, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. వారి కోసం చేసే ప్రతి చిన్న సేవ భవిష్యత్తు భారత నిర్మాణానికి వేసే ఒక గొప్ప అడుగు. ఈ సేవా కార్యక్రమంలో శ్రీమతి నందమూరి దీపిక జానకిరామ్ గారు స్వయంగా పాల్గొని చిన్నారులకు కుర్చీలు, డ్రై ఫ్రూట్స్ అందజేసి వారి ముద్దుల నవ్వులను, ఆశీర్వాదాలను అందుకున్నారు. సేవే మా సంకల్పం... చిన్నారుల సంక్షేమమే మా లక్ష్యం.

జై తెలుగు తల్లి! నందమూరి జానకిరామ్ ట్రస్ట్ "సేవే పరమో ధర్మః"

## వైభవంగా జరుగుతున్న ఆషాడ నవరాత్రి ఉత్సవాలు

- భక్తులతో పోటెత్తిన శ్రీ భగలాముఖి శక్తిపీఠం ప్రాంగణం

న్యూస్ శివ్వంపేట జులై 21..

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నెలకొల్పిన శ్రీ భగలాముఖి ఆషాడ మాసం నవరాత్రి ఉత్సవాలు గత ఏడు రోజులుగా వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుండి విలాదిగా పెద్ద ఎత్తున భక్తులు వస్తూ శ్రీ భగలాముఖి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. శ్రీ భగలాముఖి శక్తిపీఠం వ్యవస్థాపకులు ప్రముఖ వేద పండితులు శాస్త్రుల వెంకటేశర్మ ఆధ్వర్యంలో ఆషాడ ఉత్సవాలు శక్తిపీఠంలో ఘనంగా జరుగుతున్నాయి ఏడవ రోజు శ్రీ భగలాముఖి అమ్మవారు శ్రీ ధూమవతి దేవత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పూజా కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులధితో శక్తిపీఠం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కడకల్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

## మై భారత్ పోర్టల్ నమోదు డ్రైవ్ విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

వుదయం, సిద్దిపేట ప్రతినిధి

మై భారత్ పోర్టల్ నమోదు డ్రైవ్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సలహా కమిటీ సభ్యులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. నమోదు లక్ష్యాలను సాధించేందుకు మండల, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు మై భారత్ ఇంటెన్సివ్ నమోదు, అవగాహన డ్రైవ్ కొనసాగుతోందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, క్రీడాకారులు, యువజన సంఘాల భాగస్వామ్యంతో



ఈ డ్రైవ్‌ను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ జూమ్ సమావేశంలో మై భారత్ జిల్లా కార్యక్రమ అధికారి రంజిత్ రెడ్డి, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిబొట్టును ఒడిసిపడదాం – కరవును జయిద్దాం!

- కొత్తపేట గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి

జగదేవపూర్ (కొత్తపేట), జులై21 (వుదయం ప్రతినిధి)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జల సిరి' కార్యక్రమంలో భాగంగా జగదేవపూర్ మండలం కొత్తపేట గ్రామంలో సర్పంచ్ జ్యోతి మహేష్ అధ్యక్షత లోఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో 'ఎల్‌నినో' ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, రైతులందరూ ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీరు, సాగునీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టడమే మన లక్ష్యం కావాలి. వర్షపు నీరు వృథా కాకుండా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, పొలాల్లో పంట కుంటలు, ఊట కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. ఎండిపోతున్న బోరు బావులను రీఛార్జ్ చేసుకునే నిర్మాణాలను తక్షణమే చేపట్టాలి అన్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే చిరుధాన్యాలు (మిల్లెట్స్) మరియు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపాలి. వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలి. ఈ గ్రామసభలో ఉప సర్పంచ్ అమరేందర్ రెడ్డి**, వార్డు సభ్యులు మహిపాల్, బాలమణి, పంచాయతీ కార్యదర్శి రేఖ, టెక్నికల్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఏఈ , ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు, మహిళలు , పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం

## మెరిపించే షీట్‌మాస్క్!



అందంగా కనిపించేందుకు క్లెన్సింగ్, టోనింగ్, మాయిశ్చరైజింగ్‌తో పాటు అప్పుడప్పుడూ ఫేస్‌మాస్క్‌లు వేసుకోవడం, ఫేషియల్స్ చేయించుకోవడం వంటివి మామూలే. ఇటు ఇంట్లో అందుబాటులో ఉండే సహజసిద్ధమైన పదార్థాలతోనే కాదు.. అటు మార్కెట్లో లభ్యమయ్యే ఫేషియల్ క్రీమ్స్‌తోనూ ప్యాక్స్, మాస్క్‌లు తయారుచేసుకొని ప్రయత్నిస్తుంటాం. అయితే ఉదయం పూట ఫంక్షన్‌కో లేదంటే రాత్రి జరిగే పార్టీకో వెళ్లాలనుకునే వారు ఇన్‌స్టంట్ మెరుపును పొందాలంటే.. షీట్‌మాస్క్ అందుకు చక్కటి ఎంపిక అంటున్నారు నిపుణులు. మరి, వాటిని ఎలా వాడాలో తెలుసుకుందాం రండి.. షీట్ మాస్కులంటే ముఖం ఆకృతిలో ఉన్న ఫ్యాబ్రిక్ షీట్.. దీనిపై కళ్లు, ముక్కు, పెదాల దగ్గర ఆయా ఆకృతుల్లో ముందస్తుగానే రంధ్రాలు చేసి ఉంటాయి. పేపర్, ఫ్యాబ్రిక్ వంటివి కలిపి తయారుచేసిన ఈ మాస్క్‌ని పోషకాలు నిండిన సీరంలో నానబెట్టి తర్వాత ఆరబెడతారు. మనం చూసే జెల్ లేదా పేస్ట్‌లాంటి ఫేస్‌మాస్క్‌లకి ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. సాధారణంగా ఫేస్‌మాస్క్ వేసుకోవడం కాస్త శ్రమతో కూడుకున్న పని. అదే షీట్‌మాస్క్‌ని నేరుగా ముఖంపై అమర్చుకుంటే సరిపోతుంది. అయితే షీట్ పెట్టుకునే ముందు ముఖాన్ని శుభ్రం చేసుకొని ఆపై షీట్‌ను అతికించుకోవాలి. అరగంట తర్వాత తీసేస్తే సరిపోతుందట. ఈ షీట్ మాస్కులు దక్షిణ కొరియాలో పుట్టినా ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్నాయి. ఎంతోమంది సెలబ్రిటీలు కూడా వీటిని తరచూ ఉపయోగించడం చూస్తున్నాం.

చర్మానికి మేలు చేసే పదార్థాల్లో ముంచి ఆరబెట్టిన ఈ తరహా మాస్కుల వల్ల చర్మానికి తక్షణ మెరుపును అందించచ్చంటున్నారు నిపుణులు. అయితే సాధారణ మాస్కులు చాలా త్వరగా ఆరిపోతాయి. కానీ ఈ షీట్ మాస్కుల్లో ఉన్న ఫ్యాబ్రిక్ తేమను బయటకు పోకుండా కాపాడుతుందట. దీంతో ఎక్కువసేపు మాస్కుని ధరించి ఉంచుకునే వీలుంటుందని చెబుతున్నారు.

షీట్ మాస్కులు ఎంత ప్రయోజనకరమైనవే అయినా.. వాటి వినియోగంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు.

ఈ మాస్క్ వేసుకోవడానికి ముందు చర్మాన్ని చక్కటి క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవాలి. కావాలంటే స్క్రబ్బింగ్ కూడా ముందే చేసుకోవచ్చు. తద్వారా చర్మంపై పేరుకున్న మలినాలు తొలగిపోయి.. మాస్క్‌లో ఉన్న పోషకాలు చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు.

అలాగే మాస్క్‌ని తొలగించిన తర్వాత పదే పదే ముఖాన్ని తుడుచుకోవడం, నీటితో శుభ్రం చేసుకోవడం.. వంటివి చేయకూడదని చెబుతున్నారు.

ఒకసారి మాస్క్ వేసి తొలగించిన తర్వాత కనీసం రెండు, మూడు రోజుల వరకు స్క్రబ్బింగ్ జోలికి వెళ్లకూడదంటున్నారు నిపుణులు.

## కళ్లకు ఆకలేస్తే...


సామాజిక మాధ్యమాలు తెరిస్తే చాలు... చీజ్ పిజ్జా, 399 రూపాయలకే నాన్ వెజ్ కాంబో, కేవలం 99 రూపాయలకే నోరూరించే బిర్యానీ అంటూ ఎన్నెన్ని వీడియోలో. స్క్రోల్ చేస్తున్నకొద్దీ అదే తరహా కంటెంట్ కళ్లముందుకు వస్తుంది. అవి చూశాక తినకుండా ఉండగలమా...



టక్కున ఫోన్ తీస్తాం, క్లిక్‌మని ఆర్డర్ బటన్ నొక్కేస్తాం. బయటకు వెళ్లినప్పుడూ అంతే... కేక్‌లు, బర్గర్లు, జంక్ ఫుడ్‌ని చూస్తాం, తినేస్తాం. ఆకలి వేస్తోందా లేదా, తినే సమయమేనా, ఆరోగ్యకరమైనదా కాదా ఇవేవీ ఆలోచించం. ఇలా కళ్లకు ఆకలి వేసిన ప్రతిసారీ తినడాన్నే 'విజువల్ హంగర్' అంటున్నారు నిపుణులు. ఇది నిజమైన ఆకలి కాదు. పదేపదే ఆహారానికి సంబంధించిన వీడియోలు చూడటం, తలచుకోవడం వల్ల వచ్చినది. ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, తింటే తప్పేంటి అన్న భావనలూ దీనికి కారణమట. ఊబకాయం, అధిక బరువు, జీర్ణ సంబంధిత సమస్యలు ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ విజువల్ హంగర్ తెచ్చే తిప్పలు ఒకటీరెండూ కావు. అందుకే తిన్నాక అపరాధ భావం వెంటాడుతూ ఉంటుంది అమ్మాయిల్ని. దీన్ని నియంత్రించడానికి ఈ తరహా వీడియోలు వచ్చినప్పుడు, క్షణం కూడా ఆలోచించకుండా దాటవేయమంటున్నారు నిపుణులు. రీల్ చూశాక 20 నిమిషాలు ఫోన్ పక్కన పెట్టేసి వేరే పనులు చేసుకోమంటున్నారు. ఈ గ్యాప్‌లో ఆ క్రేవింగ్ తగ్గిపోతుందట. ఒకవేళ ఫుడ్ ఆర్డర్ పెట్టాల్సి వస్తే... ఇది కళ్లకు వేసిన ఆకలా? కడుపుకి వేసిన ఆకలా అని ప్రశ్నించుకోమంటున్నారు. అలానే బయటకు వెళ్లే ముందు... ఇంట్లోనే అల్పాహారం, పండ్లు, డ్రైఫ్రూట్స్ లాంటివి తినమంటున్నారు. అప్పుడు చుట్టూ ఉండే అనారోగ్యపు ఆహారం జోలికి వెళ్లమట. పాటిస్తారుగా మరి!

## మెడిటెర్రేనియన్ డైట్‌లో ఈ ప్రొటీన్

ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతున్న కొద్దీ రకరకాల ఆహారాల మీదా ప్రజల్లో ఆసక్తి కలుగుతున్నది. ఎలా తీసుకుంటే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? ఎక్కడి ఆహారంలో ఏం ప్రత్యేకతలున్నాయి? లాంటివీ చర్చల్లోకి వస్తున్నాయి. ఇటీవల శాస్త్రవేత్తలు మధ్యధరా ప్రాంతపు ఆహార అలవాట్ల మీద చేసిన పరిశోధనలో ఒక ఆసక్తికర విషయం వెల్లడైంది. అమెరికాలోని సదరన్ క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో దాదాపు ఇరవై ఏండ్లకుపైగా చేసిన ఈ పరిశోధనలో మనుషుల్లో ముసలితనం రావడాన్ని నెమ్మదింపజేసేందుకు మధ్యధరా ప్రాంతపు ఆహారం తోడ్పడుతున్నదని తేలింది. అక్కడి ఆహారం మన శరీర కణాల్లోని ప్రత్యేక సూక్ష్మ ప్రొటీన్‌లను యాక్టివేట్ చేస్తున్నదని, అది గుండె, మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు సాయపడుతున్నదని చెబుతున్నారు పరిశోధకులు. ఆ ప్రాంతంలో ఎక్కువగా ఆలివ్ నూనె, చేపలు, చిక్కుడు జాతి గింజలు, పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలతోపాటు తక్కువగా ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లు కలిగిన ఆహారాన్ని తీసుకుంటారు. ఇవి మన కణాల్లో శక్తిని ఉత్తేజితం చేసే మైటోకాండ్రియాలో ఉండే హ్యూమనిన్, ష్మాజ్ (ఎస్‌హెచ్‌ఎమ్‌ఓఓఎస్‌ఈ) అనే ప్రత్యేక ప్రొటీన్‌లను యాక్టివేట్ చేసేందుకు తోడ్పడుతున్నాయట. మెడిటెర్రేనియన్ డైట్‌ను చక్కగా అనుసరించే వారి రక్తంలో వీటి నమూనాలు ఎక్కువగా కనిపించాయట. ఇవి గుండె ఆరోగ్యంతో పాటు అల్జీమర్స్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పించే మెదడు కణాల సంబంధిత ప్రక్రియలోనూ కీలకంగా పనిచేస్తాయి. అంటే ఈ ఆహారం ముసలితనాన్ని నెమ్మదింపజేసేలా, చిన్న వయసులో మరణాలను అరికట్టేలా తోడ్పడుతున్నదని ఈ అధ్యయనం చెబుతున్నది. అందుకే వృద్ధాప్యాన్ని ఆరోగ్యవంతంగా చేసే ఆహార ప్రణాళికల తయారీలో ఈ ఫలితాలు మంచి మార్గదర్శకాలు కానున్నాయి.



## గింజ చిన్నది.. గుణం గొప్పది

కొత్త ఖరీదైన 'సూపర్ ఫుడ్స్' కంటే మన ఇంటి ఆహారంలోనే ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిలో ఇప్పుడు ఎక్కువగా చర్చకు వస్తున్నది అమరాంత్ (తోటకూర గింజలు). గ్లుటెన్ లేకపోవడంతో పాటు ప్రొటీన్, ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలతో నిండి ఉండటం దీని ప్రత్యేకత. అమరాంత్‌ను కేవలం ఉపవాస ఆహారంగా మాత్రమే చూడాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. రోజువారీ ఆహారంలో రొట్టెలు, ఉప్మా, లడ్డూలు లేదా గంజి రూపంలో చేర్చుకోవచ్చు. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలగడంతో అనవసరంగా చిరుతిళ్లు తినే అలవాటు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఆహారాన్ని మితంగా తింటే ఔషధం.. అమితంగా తింటే విషమన్న సంగతి గుర్తుంచుకోవాలి. ఏ ఒక్క ఆహారాన్నీ అద్భుత ఔషధంగా భావించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామంతో కలిపి తీసుకున్నప్పుడే దీని ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. సూపర్ ఫుడ్స్ కోసం వెతికే ముందు మన సంప్రదాయ ధాన్యాలకు ఓసారి అవకాశం ఇవ్వడం మంచిదేగా!



## మరుపు వెనుక వాయు కాలుష్యం మరక

'టౌను పక్కకెళ్లొద్దురో' అనే పాట అప్పుడెప్పుడో వచ్చింది. ఇప్పుడు ప్రపంచ ఆరోగ్య సంస్థ అదే హెచ్చరిక చేస్తున్నది. వాయు కాలుష్యం ఉన్న ప్రాంతంలో ఎక్కువ సమయం గడిపితే డిమెన్షియా (మతిమరుపు వ్యాధి) వస్తుందని చెబుతున్నది. డబ్ల్యూహెచ్‌వో ఇటీవల విడుదల చేసిన నివేదికలో ప్రతి ఏటా పది లక్షల మంది డిమెన్షియాకు గురవుతున్నారు. వీటిలో చికిత్స ద్వారా తగ్గించగలిగే డిమెన్షియాల జాబితాలో వాయు కాలుష్యం కారణంగా డిమెన్షియా బారినపడ్డ బాధితులు కూడా చేరారు. ఇంతకు ముందు పొగ తాగడం, అధిక రక్త పీడనం, మద్యపానం, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్, ఒత్తిడి, కొన్ని రకాల మందుల ప్రభావం వల్ల మతిమరుపు పలకరించేది. తాజాగా అధిక కాలుష్య వాతావరణంలో ఉండేవాళ్లనూ డిమెన్షియా వదలనంటున్నదని తేలింది. పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ, పరిశ్రమల కారణంగా వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. వాటి నుంచి తప్పించుకునేందుకు పారిశ్రామికవాడలకు దూరంగా, వాయు కాలుష్యం తక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించేందుకు ప్రాధాన్యమివ్వాలి. దీనికంటే ముందు 2024లో భారతీయుల్లో జరిపిన అధ్యయనాల్లో డిమెన్షియా బాధితుల్లో 45 శాతం మంది వాతావరణ కాలుష్యం కారణంగానే ఈ వ్యాధి బారినపడినట్టు లాన్సెట్ ప్రచురించింది. పెద్ద పెద్ద పారిశ్రామికవాడలే కాదు ఇళ్లల్లో ఉండే కాలుష్యం మూలంగానూ డిమెన్షియా ప్రమాదం పొంచి ఉందని అధ్యయనంలో గుర్తించారు. కాబట్టి వాయు కాలుష్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. అధికంగా వాయు కాలుష్యంలో ఉండేవాళ్లు వ్యాయామం, ప్రాణాయామం, పోషకాహారం తీసుకుంటే డిమెన్షియా రాకుండా కొంతవరకు నియంత్రించవచ్చు.



## గురక.. రాదిక!

ఇప్పుడు చాలామందిని 'గురక' వేధిస్తున్నది. ఈ సమస్య బాధితులతో పాటు పక్కవారికీ ఇబ్బంది కలిగిస్తుంది. అయితే, కొన్ని వ్యాయామాలు గురకను నివారిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గొంతు కండరాలను బలోపేతం చేయడంలో ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. గాలి వెళ్లే మార్గాన్ని వెడల్పుగా ఉంచి, నిద్రలో శ్వాస సులభంగా ఆడేలా చేస్తాయని అంటున్నారు.

నాలుక చివరను పై దంతాల వెనుక భాగంలో ఉంచాలి. మెల్లిమెల్లిగా నాలుకను వెనక్కి వంచుతూ.. గొంతు వైపు వీలైనంత వరకూ లాగాలి. ఇలా రోజుకు 20 సార్లు చేయాలి. నాలుక మొత్తాన్నీ నోరు పైభాగానికి గట్టిగా నొక్కిపట్టి ఉంచాలి. అలా ఓ ఐదు సెకన్ల పాటు ఉంచి, ఆపై వదిలేయాలి. ఇలా 10 నుంచి 15 సార్లు చేయాలి. నాలుక చివరను కింద వరుస పళ్లకు తగిలించి ఉంచాలి. నాలుక మధ్య భాగాన్ని నోటి కింది భాగానికి గట్టిగా నొక్కాలి. ఐదు సెకన్ల పాటు అలాగే ఉంచి వదిలేయాలి. నోటిని కొద్దిగా తెరిచి, కింది దవడను కుడి వైపు జరిపి.. 30 సెకన్ల పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత ఎడమ వైపు జరిపి.. మరో 30 సెకన్ల పాటు ఉంచాలి. పెదవులను లోపలికి ముడుచుకుని, నోటిని గట్టిగా మూసేయాలి. ఐదు సెకన్లపాటు అలాగే ఉంచి, ఆపై రిలాక్స్ అవ్వాలి. దీనిని 10 సార్లు పునరావృతం చేయాలి. ఏ, ఈ, ఐ, ఓ, యూ అనే ఆంగ్ల అచ్చులను గట్టిగా, స్పష్టంగా పలకాలి. ప్రతి అక్షరాన్ని పలికేటప్పుడు నోటి కండరాలపై ఒత్తిడి పడేలా చూసుకోవాలి. ఇలా రోజుకు మూడు నాలుగు సార్లు, ప్రతిసారీ రెండుమూడు నిమిషాల పాటు చేయాలి.నోటిని తెరిచి, గొంతు వెనుక భాగంలో ఉండే కండరాలను పైకి లేపడానికి ప్రయత్నించాలి. ఇలా చేయడం వల్ల గొంతు కండరాలు గట్టిపడతాయి.



## చిరు జాగ్రత్తలు.. పెద్ద మేలు

వర్షాకాలంలో ఆహార సంబంధిత ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి. వైద్యులు హెచ్చరిస్తున్న సమస్యల్లో ఫుడ్ పాయిజనింగ్ ఒకటి. బయట తినే ఆహారమే కాదు... ఇంట్లో నిల్వ చేసిన వంటకాలు, సరిగా కడగని కూరగాయలు, కలుషిత నీరు కూడా దీనికి కారణం. వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాపిస్తాయి. కాబట్టి, ఆహారాన్ని ఎక్కువసేపు బయట ఉంచకూడదు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలను చిన్నగా తీసుకోవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. వేడి ఆహారం తినడం, తాగునీటిని మరిగించి లేదా ఫిల్టర్ చేసి వాడాలి. పండ్లు–కూరగాయలను బాగా కడిగి తీసుకోవడం, మిగిలిన ఆహారాన్ని వెంటనే ఫ్రిజ్‌లో పెట్టేయడం వంటి చిన్న జాగ్రత్తలు పెద్ద సమస్యలను దూరం చేస్తాయి.



## 5 ఏళ్లలో 273% పెరిగిన యూపీఐ లావాదేవీల విలువ

యూపీఐ లావాదేవీలు గత అయిదేళ్లలో భారీగా విస్తరించాయి. లావాదేవీల సంఖ్య పరంగా 425%, విలువలో 273% మేర వృద్ధి నమోదైంది. సోమవారం లోక్‌సభకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి ఈ సమాచారాన్ని అందించారు. 2026 జూన్ నాటికి యూపీఐ వినియోగదారుల సంఖ్య 55.49 కోట్లకు చేరింది. యూపీఐ చెల్లింపులను భద్రంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 10 దేశాలు 12 భాగస్వామ్య సంస్థలతో కలిసి యూపీఐని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భూటాన్, సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్ మారిషస్, శ్రీలంక, నేపాల్, ఖతార్, గ్రీస్, కాంబోడియా ఉన్నాయని చెప్పారు.




# రెండో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం, విదేశీ మదుపర్లు విక్రయాలు జరపడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దీంతో సెన్సెక్స్ 238 పాయింట్లు కోల్పోగా.. సెన్సెక్స్ 50 పాయింట్ల మేర పతనమైంది. సెన్సెక్స్ 238.41 పాయింట్ల నష్టంతో 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ 50.80 పాయింట్లు పతనమై 24,187.70 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్30 సూచీలో బజాజ్‌ఫైనాన్స్, ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఎస్‌బీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రుపాయి విలువ 96.24 వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.33 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,066 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఎస్‌బీఐ ఫండ్స్: లిస్టింగ్‌లో నిరాశే..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సుమారు రూ.1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వచ్చింది. రూ.11,693 కోట్ల నిధులను సమీకరించింది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.545-574గా ప్రకటించింది. జులై 14 నుంచి 16 వరకు జరిగిన సబ్‌స్క్రిప్షన్‌కు అనూహ్య స్పందన లభించింది. 41.66 రెట్ల బిడ్డింగ్‌లను అందుకుంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (OFS) రూపంలో ఈ పబ్లిక్ ఇష్యూ జరిగింది. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయించాయి. ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ ద్వారా 13 మంది ఉద్యోగులు కోటీశ్వరులుగా మారారు. 2018 నుంచి అమలు చేసిన ఉద్యోగ స్టాక్ ఆప్షన్ల (ESOPs) వల్ల పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు కేటాయించిన షేర్లు భారీ లాభాలను ఆర్జించాయి. వీరిలో డిప్యూటీ ఎండీ దేవేందర్ పాల్ సింగ్‌కు చెందిన వెస్టెడ్ షేర్ విలువ రూ. 21.14 లక్షల నుంచి రూ.121 కోట్లకు పెరిగింది. ఫండ్ హౌస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసన్ రామ అయ్యర్ షేర్ విలువ రూ.105 కోట్లుగా ఉంది. మొత్తంగా 13 మందికి పైగా ఉద్యోగుల షేర్ల విలువ రూ.1 కోటి కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.




ఐపీఓలో అనూహ్య స్పందన లభించినప్పటికీ.. లిస్టింగ్‌లో మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో వాటాదారులకు నిరాశే ఎదురైంది. మంగళవారం ఎస్‌బీఐ ఫండ్స్ షేర్ ఇష్యూ ధర రూ.574 పోలిస్తే.. కేవలం 6 శాతం ప్రీమియంతో ఎన్ఎస్ఈలో రూ.613 వద్ద ట్రేడింగ్ మొదలెట్టింది. బీఎస్ఈలో రూ.610 వద్ద లిస్ట్ అయ్యింది. అనంతరం దాదాపు 9 శాతం ప్రీమియంతో రూ.625 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈలో రూ. 616 వద్ద ట్రేడవుతోంది. ఎస్‌బీఐ ఫండ్స్

# ఎన్‌టీపీసీ నుంచి బొండాడకు బీఈఎస్ఎస్ ప్రాజెక్టు

మౌలిక వసతుల రంగంలోని హైదరాబాద్ సంస్థ బొండాడ ఇంజినీరింగ్‌కు ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి కీలక ప్రాజెక్టు దక్కింది. గుజరాత్‌లోని ఖవ్డా సోలార్ పార్కులో 100 మెగావాట్ల అవర్ (ఎండబ్ల్యూహెచ్) వెనేడియం రిడాక్స్ ఫ్లో బ్యాటరీ (వీఆర్ఎఫ్‌బీ) ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటుకు ఈ ఒప్పందం కుదిరింది. డీలెక్ట్రిక్ సిస్టమ్స్ సాంకేతిక భాగస్వామ్యంతో దీనిని చేపట్టనున్నారు. పది నెలల కాల పరిమితిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని విలువను కంపెనీ వెల్లడించ లేదు. పదేళ్లపాటు దీని నిర్వహణ బాధ్యతలనూ బొండాడ చూసుకుంటుంది. ప్రస్తుతం దేశంలో వాడుతున్న లిథియం బ్యాటరీలతో పోలిస్తే ఇవి సురక్షితమైనవనీ, 25-30 ఏళ్లపాటు పనిచేస్తామని బొండాడ గ్రూపు సీఎండీ బొండాడ రాఘవేంద్రరావు, సీఈఓ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. దేశీయంగా లభించే వెనేడియం ఖనిజాన్ని వాడటం వల్ల చైనా దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. దేశ ఇంధన రంగంలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్లుగా ఉన్న ఆర్డరు పుస్తకం 2026-27 చివరకు రూ.15,000 కోట్లకు చేరొచ్చని కంపెనీ అంచనా కట్టింది. ప్రస్తుతం 1.2 గిగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ సామర్థ్యం సంస్థకుంది. డేటా సెంటర్లు, రక్షణ రంగంలోకి కంపెనీ అడుగుపెట్టడం ద్వారా 2030 నాటికి ఈ విభాగాల నుంచి 30% ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఐటీఆర్-1, ఐటీఆర్-2.. ఏది ఫైల్ చేయాలి?

ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి గడువు దగ్గరపడింది. పట్టుమని 10 రోజులు కూడా లేకపోవడంతో రిటర్నులు దాఖలు చేయడానికి చాలా మంది ఇప్పుడిప్పుడే త్వరపడుతున్నారు. ఈ హడావుడిలో కొందరు ఫారాలు ఎంపిక చేసుకోవడంలో పొరపడుతుంటారు. వేతనం ద్వారా ఆదాయం వస్తోంది కాబట్టి ఐటీఆర్-1 దాఖలు చేస్తే సరిపోతుందని భావిస్తుంటారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కొన్ని లావాదేవీలు, పెట్టుబడుల కారణంగా మీకు ఐటీఆర్-1 సరిపోకపోవచ్చు. ఒకవేళ పొరపాటున తప్పుడు ఫారం ద్వారా రిటర్నులు సమర్పిస్తే ఆదాయపు పన్ను విభాగం 'డిఫెక్టివ్ రిటర్న్'గా పరిగణించే ప్రమాదం ఉంది.




కాబట్టి వేతన జీవులు ఐటీఆర్-1, ఐటీఆర్-2లో ఏది ఎంపిక చేసుకోవాలనే విషయంలో స్పష్టత కలిగి ఉండడం మంచిది.

ఐటీఆర్-1 ఎవరికి?

వేతనం, లేదా పెన్షన్‌పై ఆదాయం వచ్చే వారు ఐటీఆర్-1 దాఖలు చేయాలి.

పన్ను చెల్లింపుదారుల వార్షికాదాయం కచ్చితంగా రూ.50లక్షలలోపే ఉండాలి.

రెండు సొంతిళ్ల నుంచి ఆదాయం కలిగిన వారు

సెక్షన్ 112ఏ కింద దీర్ఘకాలిక మూలధన లాభాల రూ.1.25 లక్షలలోపు ఉన్నవారు

వ్యవసాయ ఆదాయం రూ.5వేలులోపు ఉండాలి.

పొదుపు ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఆదాయపు పన్ను రీఫండ్, ఇతర వడ్డీ ఆదాయాలు ఉన్నవారు ఐటీఆర్-1ను ఎంపిక చేసుకోవచ్చు.

ఐటీఆర్-2 ఎవరు దాఖలు చేయాలి?

వార్షికాదాయం రూ.50 లక్షలలోపు ఉన్నవారు

స్టార్టప్ కంపెనీలో ESOPsపై పన్ను చెల్లింపు వాయిదా పడినప్పుడు

ఏదైనా కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సందర్భాల్లో

రెండు కంటే ఎక్కువ సొంతిళ్లు కలిగినవారు

రూ.1.25 లక్షల కంటే ఎక్కువ దీర్ఘకాలిక మూలధన లాభాలు కలిగినవారు

స్వల్పకాలిక మూలధన లాభాలు (ఎస్‌టీసీజీ) ఉన్నప్పుడు (స్టాక్ మార్కెట్ / మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టినవారు)

గత సంవత్సరంలో ఎప్పుడైనా అన్‌లిస్టెడ్ ఈక్విటీ షేర్లను కలిగి ఉండడం

పన్ను పరిధిలోకి వచ్చే ఇతర మూలధన నష్టాలను తదుపరి సంవత్సరాలకు బదిలీ చేసుకోవాల్సిన సందర్భాల్లో

విదేశీ ఆదాయం, రూ.5వేల కంటే ఎక్కువ వ్యవసాయ ఆదాయం ఉన్నప్పుడు

కరెంట్ ఖాతాలో రూ.1 కోటి కంటే ఎక్కువ డిపాజిట్లు

విదేశీ ప్రయాణాల కోసం రూ.2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినప్పుడు

ఏడాదికి రూ.1 లక్ష కంటే ఎక్కువ కరెంట్ బిల్లు చెల్లించినప్పుడు ఐటీఆర్-2 దాఖలు చేయాల్సి ఉంటుంది.

తప్పుడు ఐటీఆర్ ఫారం ఫైల్ చేస్తే ఏమౌతుంది?

ఒకవేళ మీరు పొరపాటున తప్పుడు ఐటీఆర్ ఫారాన్ని ఎంచుకుని సబ్‌మిట్ చేస్తే, ఆదాయపు పన్ను విభాగం దాన్ని సెక్షన్ 139 (9) కింద డిఫెక్టివ్ రిటర్న్‌గా (లోపభూయిష్టమైనది) పరిగణిస్తుంది. ఐటీ నోటీసు పంపి ఆ తప్పును సరిదిద్దుకోవడానికి సాధారణంగా 15రోజులసమయం ఇస్తుంది.




## అర్జెంటీనా ఆటగాళ్లపై ఫిఫా దర్యాప్తు



ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం అర్జెంటీనా, స్పెయిన్ ఆటగాళ్ల మధ్య మైదానంలో ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫిఫా తెలిపింది. ఎఫ్‌డీసీ (ఫిఫా క్రమశిక్షణా నియమావళి) నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై దర్యాప్తు కోసం క్రమశిక్షణా, ఎథిక్స్ ప్రాసిక్యూటర్‌ను నియమించామని పేర్కొంది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలను బహిర్గతం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. ఫిఫా ప్రపంచ కప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని భావించిన డిఫెండింగ్ అర్జెంటీనాకు స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఫైనల్‌లో 1-0 తేడాతో ఓడించింది. మ్యాచ్ అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా.. అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరెడెస్ కాస్త దూకుడుగా వ్యవహరించాడు. స్పెయిన్ ప్లేయర్లు ఎరిక్ గార్సియా, గావిలపైకి వెళ్లాడు. అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వారిని కొట్టేందుకూ యత్నించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# కష్టకాలంలో.. విరాట్ భాయ్ అండగా నిలిచాడు: పి.వి. సింధు

భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు ఇటీవల జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి ముందు రెండేళ్లపాటు సింధు కెరీర్ పరంగా చాలా ఇబ్బందులు పడింది. ప్రతి టోర్నీలో బరిలో దిగి ఒకటి, రెండు రౌండ్లలోనే ఇంటిముఖం పట్టింది. గాయాలు కూడా ఇబ్బంది పెట్టాయి.



ఈ ఫామ్‌తో 2028 ఒలింపిక్స్ వరకూ కొనసాగుతుందా అన్న సందేహాలు కలుగుతున్న సమయంలో.. తనలో ఛాంపియన్ ఆట ఇంకా ఉందని చాటుతూ ఈ తెలుగమ్మాయి జపాన్ ఓపెన్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. తన కెరీర్ కష్ట కాలంలో ఉన్నప్పుడు.. టీమ్‌ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అండగా ఉన్నట్లు సింధు పేర్కొంది. కోహ్లీ మాటలు తనలో స్ఫూర్తి నింపాయని తెలిపింది.

'నేను విరాట్ భాయ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కెరీర్ క్లిష్టమైన దశలో ఉన్నప్పుడు నేను కోహ్లీని సంప్రదించాను. వరుస గాయాలు, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సతమతమవుతున్న సమయంలో నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒకరు నాకు అవసరమయ్యారు. కోహ్లీ నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. మరుసటి రోజే మేము కలుసుకున్నాం. ఆయన ఇచ్చిన సలహాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన చెప్పిన మాటలు నాకు, నా భర్త దత్తాకూ బాగా గుర్తుండిపోయాయి. కొన్ని సంభాషణలు మన ఆలోచనా తీరునే మార్చేస్తాయి. అటువంటి వాటిలో ఇదొకటి'' అని సింధు వివరించింది.

# అప్పుడు రోహిత్ శర్మ మాటలను నమ్మలేదు: శాంసన్

భారత్ 2026 టీ20 ప్రపంచ కప్ సాధించడంలో సంజు శాంసన్ ప్రధాన పాత్ర పోషించాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌లో.. తర్వాత ఇంగ్లాండ్‌తో సెమీ ఫైనల్, న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. టోర్నమెంట్ ఆరంభంలో తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని, అప్పుడు రోహిత్ శర్మ తనకు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని సంజు పేర్కొన్నాడు. అయితే, మొదట్లో రోహిత్ మాటలను తాను నమ్మలేదని, అందుకు ఇప్పుడు క్షమాపణలు చెబుతున్నానని శాంసన్ అన్నాడు. ''నిజం చెప్పాలంటే ఆ సమయంలో రోహిత్ భాయ్ చెప్పిన మాటలను నేను నమ్మలేదు. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. ఆయన తన అనుభవంతో మన



స్ఫూర్తిగా మాట్లాడి నాలో ధైర్యం నింపే ప్రయత్నం చేశాడు. కానీ, ఆ సమయంలో నేను తీవ్ర నిరాశలో కూరుకుపోయి ఉన్నాను. ఆ తర్వాత రోహిత్ చెప్పిన మాటలను గుర్తు చేసుకుని.. నా ఆలోచన విధానాన్ని మార్చుకున్నాను. తర్వాత అంతా సజావుగా సాగిపోయింది '' అని శాంసన్ పేర్కొన్నాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో శాంసన్ విఫలమయ్యాడు. ఒక్క మ్యాచ్‌లోనూ 30కిపైగా స్కోరు చేయలేదు. అప్పుడు చాలా నిరుత్సాహనికి గురయ్యానని, నాలుగైదు రోజులు చాలా కష్టంగా గడిచాయని శాంసన్ పేర్కొన్నాడు. ఆ క్లిష్ట పరిస్థితి తనను మానసికంగా మరింత బలంగా మార్చిందన్నాడు.

# అనేవాళ్లు అంటూనే ఉంటారు...: రోహిత్ శర్మ

క్రికెట్లో కొనసాగుతున్నంత వరకు తనపై విమర్శలు వస్తూనే ఉంటాయని భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. ''అరంగేట్రం చేసినప్పటి నుంచీ మాటలు అంటూనే ఉన్నారు. నేను క్రికెట్లో కొనసాగుతున్నంత వరకు విమర్శలు వస్తూనే ఉంటాయి. కానీ వాటితో పోరాడటం కాకుండా పరుగులు సాధించడంపై దృష్టి పెడతాను. జట్టు విజయంలో భాగమయ్యేందుకు ప్రయత్నిస్తా. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం, బ్యాటుతో నా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నా పని. కెరీర్ ఆరంభం నుంచీ అదే చేస్తున్నా. ఇక ముందూ అదే చేస్తా'' అని 39 ఏళ్ల రోహిత్ అన్నాడు.



ఆదివారం ఇంగ్లాండ్‌తో మూడో వన్డే తర్వాత రోహిత్‌కు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ఊహాగానాలు వినిపించాయి. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో శతకం (138; 110 బంతుల్లో 17×4, 5×6) సాధించిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.

# హాకీ వరల్డ్ కప్.. జట్టును ప్రకటించిన భారత్

ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనున్న పురుషుల హాకీ ప్రపంచ కప్ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ కోసం మంగళవారం 20 మంది సభ్యులతో భారత్ జట్టును ప్రకటించింది. డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల లండన్ అంచె ప్రొ హాకీ లీగ్‌లో భారత్ 24 మంది ఆటగాళ్లతో బరిలోకి దిగింది. కానీ, ప్రపంచ కప్‌లో జట్టు పరిమాణంపై ఉన్న పరిమితి కారణంగా ఆ లీగ్‌లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్క లేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్‌థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు.



ప్రపంచ కప్‌లో పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. 1971లో కాంస్యం, 1973లో రజతం సాధించింది.

# వుదయం సినిమా


MOVIE TIME!

## 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి రెండు జాతీయ అవార్డులు

**వుదయం సినిమా** 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మా 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి *ఉత్తమ తెలుగు చిత్రం*తో పాటు ఉత్తమ మేకప్ విభాగాల్లో రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల నిర్మాత ఫణి అడపాక హర్షం వ్యక్తం చేశారు.ఆ తర్వాత పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ కలిసి 'కమిటీ కుర్రోళ్లు' వంటి మంచి కథ, బలమైన భావోద్వేగాలు కలిగిన చిత్రాన్ని నిర్మించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. భవిష్యత్తులోనూ మంచి కథలు, కొత్త ప్రతిభను ప్రోత్సహించే సినిమాలు, ముందుకు వస్తూ, తెలుగు సినిమా స్థాయిని మరింత ఉన్నతంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తామని"నిర్మాత ఫణి అడపాక తెలిపారు.



## #NBK111 షూటింగ్ లో బాలకృష్ణకి స్వల్ప గాయం



**వుదయం సినిమా:** #NBK111 షూటింగ్ లో నందమూరి బాలకృష్ణకి స్వల్ప గాయమైయింది. అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం: దర్శకుడు గోపిచంద్ మలినేనిగాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణకు స్వల్ప గాయమైయింది. బాలయ్య హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో #NBK111 రూపొందుతోంది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కాకినాడలో జరుగుతోంది. ఓ కీలక యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా బాలకృష్ణకి చిన్న మసిల్ టియర్ అయింది. ఈ విషయాన్ని దర్శకుడు గోపిచంద్ మలినేని సోషల్ మీడియా ద్వారా తెలిజేశారు.'



## 'జన నాయగన్' విజయ్ చివరి మూవీ కాదు.. సీఎంగా ఫస్ట్ మూవీ..

**వుదయం సినిమా:** ప్రస్తుతం సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'జన నాయగన్' (Jana Nayagan). తమిళ నాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ (Vijay) నటించిన ఆఖరి చిత్రం కావడంతో అందరి కళ్లు దీనిపైనే ఉన్నాయి. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ ఆరున్నర నెలల తర్వాత జులై 23న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మరి ఈ మూవీ గురించి ఆసక్తికర విషయాలు తెలుసుకుందామా..? రాజకీయ రంగ ప్రవేశానికి ముందు విజయ్ నటించిన చివరి చిత్రం ఇదే కావడం గమనార్హం. కానీ, దర్శకుడు హెచ్.వినోద్ మాత్రం ఇది సీఎం విజయ్ ఫస్ట్ మూవీ అంటున్నారు.ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీని 30 దేశాల్లో 8 వేల స్క్రీన్‌లపై ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే అన్నిచోట్లా బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఉదయం 8 గంటల నుంచే షోలు ప్రదర్శిస్తుండటం గమనార్హం.అడ్వాన్స్ బుకింగ్స్ లోనూ 'జన నాయగన్' దూకుడు కొనసాగుతోంది. ఇప్పటికే రూ.15.22 కోట్లు ఈ మూవీ ఖాతాలో పడినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.తమిళనాడులో ఈ మూవీ టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. మరోవైపు బెంగళూరులోనూ విజయ్ క్రేజ్ కొనసాగుతోంది. ఓ థియేటర్‌లో ఏకంగా ఈ మూవీ టికెట్ ధరను రూ.2500గా నిర్ణయించడం గమనార్హం.చెన్నైలోని మయజాల్ మల్టీప్లెక్స్‌లో ప్రదర్శిస్తున్న 48 షోల టికెట్స్ అన్నీ అమ్ముడయ్యాయి. తెలుగులో ఈ మూవీని 'జన నాయకుడు', హిందీలో 'జన నేత'పేరుతో విడుదల చేస్తున్నారు.బాలకృష్ణ-అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన తెలుగు మూవీ 'భగవంత్ కేసరి'. దీని మూల కథను తీసుకుని.. విజయ్ స్టార్‌డమ్‌కు అనుగుణంగా హెచ్.వినోద్ మార్పులు చేశారు.



## "35 చిన్న కథ కాదు" టీమ్ ను అభినందించిన "సమ్మర్ హాలిడేస్" టీమ్



**వుదయం సినిమా:** ఇటీవల ప్రకటించిన 72వ నేషనల్ ఫిలిం అవార్డ్స్ లో ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ బాల నటుడు విభాగాల్లో రెండు అవార్డ్స్ గెల్చుకుంది "35 చిన్న కథ కాదు" సినిమా. ఈ చిత్రంలోని నటనకు ఉత్తమ బాల నటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల. మాస్టర్ అరుణ్ దేవ్ ప్రస్తుతం "సమ్మర్ హాలిడేస్" అనే బాలల చిత్రంలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో "35 చిన్న కథ కాదు" మూవీ టీమ్ ను అభినందించారు "సమ్మర్ హాలిడేస్" సినిమా టీమ్. "సమ్మర్ హాలిడేస్" చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు జరిగిన ఈవెంట్ లో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ - 35 చిన్న కథ కాదు బ్యూటిఫుల్ ఫిలిం. ఈ సినిమాలో అరుణ్ నటన చూస్తున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాను. డైరెక్టర్ నందకిషోర్ ఎఫర్ట్స్ వల్లే ఈ రోజు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి.

## ఆగస్టు 14న 'హాయ్'

**వుదయం సినిమా:** లేడీ సూపర్ స్టార్ నయనతార, యువ హీరో కవిన్ తొలిసారి జంటగా నటిస్తున్న 'హాయ్' విడుదల తేదీని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. ప్రత్యేక అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేస్తూ ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా



థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. నూతన దర్శకుడు విష్ణు ఎడ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కె. భాగ్యరాజ్, ప్రభు, రాధిక శరత్‌కుమార్, వీటీవీ గణేష్, సత్యన్, ఆదిత్య కదిర్, ఖురేషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జెన్ మార్టిన్ సంగీతం సమకూరుస్తున్నారు.

## 'టాక్సిక్' మెలోడీ సాంగ్

**వుదయం సినిమా:** రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' నుంచి విడుదలైన తొలి పాట 'తబాహీ' రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్ తో చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే జోష్‌ను కొనసాగిస్తూ మేకర్స్ రెండో పాట 'మనసాగదే' (తెలుగు వెర్షన్)ను విడుదల చేశారు. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి ఈ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాయి.'తబాహీ' ప్రేమలోని ఉప్పొంగే ఉద్వేగాలను చూపిస్తే, 'మనసాగదే' మాత్రం ప్రేమలోని మరో కొత్త కోణాన్ని ప్రజెంట్ చేసింది. మనసులో దాచుకున్న భావాలు, తీరని తపన, మౌనంగా మిగిలిపోయిన ప్రేమను ఈ పాట ఎంతో అందంగా పలికిస్తుంది. ప్రతి ప్రేమకథలో ఎన్నో భావోద్వేగాల పొరలు ఉంటాయని, ప్రతి దశ ప్రేమకు కొత్త అర్థాన్ని ఇస్తుందని ఈ పాట చెబుతోంది.ఈ పాటలో యష్, తారా సుతారియా రాయా, రెబెకా పాత్రల మధ్య బంధాన్ని పూర్తిగా కొత్త కోణంలో చూపించారు. వీరిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీ, ఎమోషన్స్ కట్టిపడేసింది. 'తబాహీ' లో కనిపించిన రాయా పాత్ర ఈసారి మనసులో నడుస్తున్న సంఘర్షణను కూడా సూచిస్తుంది.తనిష్క్ బాగ్చి, అర్సాన్ నిజామీ, ఫహీమ్ అబ్దుల్లా స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీకి సిద్ధార్థ్ బస్రూర్ తన వోకల్స్ టచ్ ప్రాణం పోశారు. ఐదు భాషల్లో విడుదలైన ఈ పాట తెలుగు వెర్షన్‌కు 'మనసాగదే' టైటిల్‌తో రిలీజ్ చేశారు. తెలుగు సాహిత్యాన్ని రామజోగయ్య శాస్త్రి అందించారు. హిందీలో 'మధోష్', కన్నడలో 'మన మోహక', తమిళంలో 'తడుమారుధేయ్', మలయాళంలో 'మధుమోహిని' పేర్లతో ఈ పాట విడుదలైంది.



## 'M4M-2' సీక్వెల్ ప్రకటన

**వుదయం సినిమా:** శాన్‌ఫ్రాన్సిస్కో (కాలిఫోర్నియా): అమెరికాలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సైకాలజికల్ థ్రిల్లర్ 'M4M (మోటివ్ ఫర్ మర్డర్)' మూవీ 60 రోజుల విజయోత్సవాన్ని జూలై 18, 2026న శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలోని సినీ లౌంజ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో దర్శక-నిర్మాత మోహన్ వడ్లపట్ల, హీరోయిన్ Jo Sharma కలిసి 'M4M-2' సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి M4M అభిమానులు, కమ్యూనిటీ నాయకులు, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, విశిష్ట అతిథులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన దర్శక-నిర్మాత Mohan Vadlapatla, M4M విజయానికి ప్రేక్షకుల అపారమైన ఆదరణే ప్రధాన కారణమని అన్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, మీడియా అందించిన సహకారం లేకుండా ఈ విజయాన్ని సాధించడం సాధ్యమయ్యేది కాదని పేర్కొన్నారు.



## జన నాయకుడు విజయ్ కి గుర్తిండిపోయే మూవీ



**వుదయం సినిమా:** తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ 'జన నాయకుడు' సినిమా కోసం సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై వెంకట్ కె. నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాలు వున్న ఈ చిత్రం జులై 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట్ కె. నారాయణ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ సినిమా రిలీజ్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు కదా? మీరు ముందుగానే ఊహించారా?**

ముందుగానే కొన్ని ఇబ్బందులు రావొచ్చని మేము అనుకున్నాం. విజయ్ గారు కూడా, "ఇది నా చివరి సినిమా.

**మీరు బిజినెస్‌లో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లారు.సినిమాల్లోకి రావాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. అకాడమిక్ పుస్తకాల్లో దొరకని ఎన్నో గొప్ప విషయాలు సినిమాల్లో ఉంటాయి.

**కోవిడ్ సమయంలో సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు కదా**

కోవిడ్ చాలా మంది ఇంపాక్ట్ అయ్యారు. ఆ సమయంలో మేము కేవీఎన్ ద్వారా 'ఫీడ్ మై సిటీ' కార్యక్రమాన్ని ప్రారంభించాం. కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి, రోజువారీ కూలీలకు భోజనం అందించాం.

**విజయ్ గారితో మీ ప్రయాణం ఎలా మొదలైంది?**

ఇది నాతొలి తమిళసినిమా. విజయ్ మేనేజర్‌తో నాకు ముందే పరిచయంఉంది. 'లియో' సినిమా సమయంలో మా మధ్య చర్చలు జరిగాయి. గోట్ తర్వాత విజయ్ మరో సినిమా చేయబోతున్నారని తెలిసింది.

## 'ది ఇండియా స్టోరీ' కొత్త పోస్టర్ రిలీజ్

**వుదయం సినిమా:** కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' నుంచి మేకర్స్ మరో పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దేశంలో అత్యంత ఆందోళన కలిగిస్తున్న పెస్టిసైడ్ వ్యవసాయం అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్న ఈ పోస్టర్, సినిమా చెప్పబోయే బలమైన సందేశాన్ని మరోసారి హైలైట్ చేస్తోంది. మనం ప్రతిరోజూ తినే ఆహారం వెనుక దాగి ఉన్న ప్రమాదాలను ఆలోచింపజేసేలా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు.కొత్తగా విడుదలైన పోస్టర్‌లో పెస్టిసైడ్స్ అధికంగా ఉపయోగించడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని బలంగా చూపించారు. ఆలోచింపజేసే విజువల్ డిజైన్‌తో రూపొందిన ఈ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. సమాజానికి ఎంతో కీలకమైన అంశాన్ని ఎమోషనల్, థ్రిల్లింగ్ కథతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఈ సినిమా సిద్ధమవుతోంది. కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేస్తున్న సమస్యపై అవగాహన కల్పించడమే ఈ సినిమా ప్రధాన ఉద్దేశం.సినిమా గురించి కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. "'ది ఇండియా స్టోరీ' ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా. మన రోజువారీ జీవితాలను నేరుగా ప్రభావితం చేసే అంశాన్ని ఎంతో ధైర్యంగా ఈ సినిమా ప్రస్తావించింది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.